అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 14-10-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 235 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 10 పేజీలు వెల : 6.50



(ఫైల్)

ప్రొఫెసర్ సాయిబాబా
కన్నుమూత

నేడు మౌలాలిలోని ఇంటికి భౌతికకాయం

అనంతరం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగింత

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్, న్యూఢిల్లీ

ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, పౌర హక్కుల ఉద్యమకారుడు జీఎన్ సాయిబాబా(58) హైదరాబాద్‌లో కన్నుమూశారు. దీర్ఘకాలికంగా అనారోగ్యంగా బాధపడుతున్న సాయిబాబాను వారం రోజుల క్రితం నిమ్స్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి 8.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. సాయిబాబా కోరిక మేరకు, ఆయన కుటుంబ సభ్యులు భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్టు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఇప్పటికే సాయిబాబా కండ్లను ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసినట్టు తెలిపారు. మృతదేహాన్ని నిమ్స్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు తీసుకుంటారు. అక్కడి నుంచి తొమ్మిది గంటలకల్లా నగరంలోని గన్‌పార్క్ దగ్గర తీసుకెళతారు. అక్కడ దాదాపు పావుగంటపాటు ఉంచనున్నారు. అనంతరం 10 గంటలకు మౌలాలి కమాన్ దగ్గరలోని జవహర్‌నగర్‌లోని శ్రీనివాసా హైట్స్ అపార్ట్‌మెంటుకు చేరుస్తారు. అక్కడ మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. అ తర్వాత రెండున్నర గంటలకు ప్రదర్శనగా బయలుదేరి సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీకి తీసుకొస్తారు. శ్రద్ధాంజలి అర్పించాలనుకున్నా వారంతా ఆయా ప్రాంతాల్లో ఎక్కడికైనా రావచ్చని సాయిబాబా కుటుంబ సభ్యులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

90 శాతం అంగవైకల్యంతో వీల్‌చైర్‌కే పరిమితమైన సాయిబాబా, మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణపై

ప్రజాఉద్యమాలకు తీరనిలోటు




ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం 90 శాతం అంగవైకల్యంతో ఉన్న సాయిబాబాను ఉపా చట్టం కింద సుదీర్ఘకాలంగా జైలులో నిర్బంధించింది. అర్బన్ నక్సలైట్‌గా ముద్రవేసింది. జైల్లో ఉన్న సమయంలో ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా సరైన వైద్యసౌకర్యం అందించలేదు. బీజేపీ ప్రభుత్వ విధానాలకు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయిబాబా, దళిత, గిరిజన, వికలాంగుల హక్కుల నేతగా, విద్యావేత్తగా పేర్కొందారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు.

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఆయనతోపాటు మరో ఐదుగురికి మహారాష్ట్ర గడ్చిరోలి ట్రయల్‌కోర్టు జీవితఖైదు విధించడంతో 2017 నుంచి దాదాపు దొమ్మిదేండ్లపాటు నాగ్‌పూర్‌జైల్లోనే ఉన్నారు. అంతకుముందు కూడా ఆయన 2014 నుంచి 2016 వరకు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సంవత్సరం మార్చి ఐదున ముంబయి హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించి నాగ్‌పూర్ జైలు నుంచి విడుదల చేసింది. మానవహక్కుల ఉద్యమకారుడు, రచయిత, విద్యావేత్తగా సాయిబాబా గుర్తింపు పొందారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి జైల్లో నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆయన ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జైల్లో దుర్భరజీవితం ...3లో



భారతావనిలో ఆకలి కేకలు



సూచికలో దిగజారుతున్న స్థానం పొరుగు దేశాల కంటే ఘోరం

పోషక లోపాలతో చిన్నారులు విలవిల

భారతావనిలో పట్టెడన్నం కోసం పేదల ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. ఉజ్వల భవిష్యత్తుకు దారులు వేసుకోవాల్సిన చిన్నారులు గుప్పెడు మెతుకుల కోసం యాచకులుగా మారిపోతున్నారు. ప్రపంచ ఆకలి సూచిక (జీహెచ్ఐ)లో మన స్థానం నానాటికీ దిగజారిపోతోంది. 2024వ సంవత్సరానికి సంబంధించి విడుదలైన 19వ జీహెచ్ఐలో భారత్ 105వ స్థానంలో (మొత్తం 127 దేశాలు) నిలిచింది. పొరుగున ఉన్న నేపాల్, శ్రీలంక, మయన్మార్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ కంటే వెనుకబడిపోయింది.

న్యూఢిల్లీ : 'కన్‌సర్న్ డే వరల్డ్‌వైడ్', 'వెల్త్‌హంగర్‌లైఫ్' సంయుక్తంగా ప్రచురిస్తున్న జీహెచ్ఐ సిరీస్ తక్షణం దృష్టి సారించాల్సిన అంశాలను ప్రస్తావించింది. ఈ సంవత్సరపు నివేదికలో భారత్ స్కోరు 27.3. దేశంలో ఆకలి తీవ్రత ఏ స్థాయిలో ఉన్నదో ఇది ప్రతిబింబిస్తోంది. ఇటీవలి సంవత్సరాలలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య స్వల్పంగా పెరిగిందని నివేదిక తెలిపింది. 2016వ సంవత్సరపు జీహెచ్ఐ స్కోరు 29.3తో పోలిస్తే ప్రస్తుత స్కోరు మెరుగైనప్పటికీ అది ఇప్పటికీ 'తీవ్రత' కేటగిరీలోనే ఉంది. పొరుగు దేశాల కంటే బాగా వెనుకబడి ఉంది. అయితే 2000వ సంవత్సరపు స్కోరు 38.4, 2008 స్కోరు 35.2తో పోలిస్తే మాత్రం గణనీయమైన పురోగతి కన్పిస్తోంది. ఈ రెండు సందర్భాలలోనూ మన దేశం 'ఆందోళనకరం' అనే కేటగిరీలో ఉంది.


చిన్నారులలో పోషక లోపాలు

ఆకలి సూచికను గణించే పద్ధతిలో మార్పులు చేసినందున, సవరించిన సమాచారాన్ని వినియోగించినందున 2023వ సంవత్సరపు నివేదికతో తాజా నివేదికను పోల్చలేదు. కానీ 2000, 2008, 2016, 2024 నివేదికలలోని సమాచారాన్ని పోల్చారు. చిన్నారులలో పోషకాహార లోపం విషయంలో మన దేశం ఇప్పటికీ అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. ప్రపంచంలో మనదే అత్యధిక చైల్డ్ వేస్టింగ్ రేటు (ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలలో ఎత్తుకు తగిన బరువు లేకపోవడం). మన దేశంలో చిన్నారుల కుంగుబాటు రేటు 35.5 శాతంగా ఉంది. ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలలో 2.9 శాతం మంది మృత్యువాత పడుతున్నారు. 13.7 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు.

పిల్లల మరణాల విషయంలో మన దేశం 2000వ సంవత్సరం నుండి మెరుగుదల కన్పిస్తోంది. అయినప్పటికీ పోషకాహార లోపం తీవ్రమైన సమస్యగానే ఉండిపోతోంది. అలాగే ఐదు సంవత్సరాల లోపు చిన్నారులలో కుంగుబాటు, ఎత్తుకు తగిన బరువు లేకపోవడం అనే సమస్యలు కూడా ఆందోళనకరంగా ఉన్నాయి. ఈ సూచికలు తీవ్రమైన ప్రజారోగ్య సవాళ్లకు దారితీస్తున్నాయని నివేదిక తెలిపింది.

లక్ష్య సాధన అసాధ్యం

ప్రపంచ దేశాలలో ఆకలిని తగ్గించే విషయంలో 2016 నుండి పురోగతి లేదని నివేదిక ప్రస్తావించింది. 2030 నాటికి ఆకలిని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం కాకపోవచ్చునని స్పష్టం చేసింది. ఎందుకంటే ఆకలిపై 127 దేశాలలో అధ్యయనం జరపగా 42 దేశాలు నేటికీ 'తీవ్రత' లేదా 'ఆందోళనకరం' స్థాయిలోనే ఉన్నాయి.



ఈ మూడింటికీ లింకు

ఆకలి, వాతావరణ మార్పులు, లింగ అసమానత్వం... ఈ మూడింటి మధ్య నేరుగా సంబంధం ఉన్నదని నివేదిక ఎత్తిచూపింది. వివక్షాపూరితమైన నిబంధనలు, లింగ ఆధారిత హింస అనేవి మహిళలను, మైనారిటీలను ప్రమాదంలో పడేస్తున్నాయని, వారికి ఆహార, పోషకాహార భద్రత లభించడం లేదని తెలియజేసింది. ఈ సవాళ్లను అధిగమించేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలకు వాతావరణ మార్పుల ప్రభావం ప్రతిబంధకంగా ఉంటోందని నివేదిక చెప్పింది.

తెలంగాణ సాధనకు స్ఫూర్తి
అలయ్ బలయ్
సీఎం రేవంత్ రెడ్డి



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సహ ఐదు రాష్ట్రాల గవర్నర్లు హాజరు

రాజకీయ నేతలు తమ భాషను మార్చుకోవాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాధనలో అలయ్ బలయ్ కీలక భూమిక పోషించిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హర్యానా గవర్నర్ దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన అలయ్‌బలయ్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన ఆలస్యమైనప్పుడు రాజకీయ జేఏసీ ఏర్పాటుకు ఈ వేదిక స్ఫూర్తిగా ఉపయోగపడింది. జెండాలను, అజెండాలను పక్కనపెట్టి తెలంగాణ కోసం ఒక్కటయ్యేలా చేసింది. ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు, కాంగ్రెస్ నుంచి కమ్యూనిస్టుల వరకు ఒక్కటై ప్రత్యేక రాష్ట్రం కోసం గళం విప్పారు" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణ సాధనలో కులాలకు, మతాలకు అతీతంగా సబ్బండ వర్గాలను ఐక్యం చేసి ముందుకు నడిపించిందని గుర్తు చేశారు. "తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండుగ దసరా. దసరా అంటే పాలపిట్ట, జమ్మి చెట్టు గుర్తుకు వస్తాయి. అలయ్ బలయ్ అంటే గుర్తుకు వచ్చేది బండారు దత్తాత్రేయ. రాజకీయాలకు అతీతంగా గౌరవించబడే దత్తాత్రేయ 19 ఏండ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అంతరించిపోతున్న తెలంగాణ కళలను భావితరాలకు అందిస్తున్నారు. ఆ వారసత్వాన్ని దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి కొనసాగిస్తున్నారు. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత" అని సీఎం ...3లో



రూ.288 కోట్లు నొక్కేశారు

350 మంది డీలర్లతో కలసి జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్



32 సూట్‌కేస్ కంపెనీలు తెరిచి..

తప్పుడు పత్రాలతో కుంభకోణం

జగిత్యాలతో వెలుగు చూసిన అక్రమాలు

జగిత్యాల : తెలంగాణలో తప్పుడు పత్రాలతో చేసిన రూ.288 కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దాదాపు 350 మంది డీలర్లతో కలసి జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను దోచేశారు. జగిత్యాల కేంద్రంగా ఓ జీఎస్టీ కన్సల్టెంట్ 32 సూట్ కేసు కంపెనీలు తెరచిన ఆయన.. వ్యాపారం చేయకుండానే చేసినట్లు కాగితాలపై చూపి భారీ మొత్తంలో ఐటీసీ నొక్కేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏడాదిన్నరపాటు ఓ ట్యాక్స్ కన్సల్టెంట్ చేసిన వ్యవహారాన్ని జీఎస్టీ అధికారులు ఆలస్యంగా గుర్తించారు.

సారొస్తారొస్తారూ..!


కేసీఆర్ రాకకు డిసెంబర్‌లో ముహూర్తం

రేవంత్ దూకుడుకు హైడ్రా బ్రేక్?

ధృతరాష్ట్ర కౌగిలిలో కమలనాధులు

తరుముకొస్తున్న స్థానిక ఎన్నికలు

సత్తా చాటాలని ఉవ్విళ్ళూరుతున్న క్షేత్రస్థాయి నేతలు



ఎవరు అవునన్నా...కాదన్నా...రాష్ట్ర రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్)లేని లోటు స్పష్టంగానే కనిపిస్తున్నది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేక బొక్కబోర్లాపడిన బీఆర్ఎస్ పార్టీని పునరుత్తేజం చేయాల్సిన ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం రకరకాల రాజకీయ ఊహాగానాలకు తావిస్తుంది.

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేసీఆర్ స్థానాన్ని భర్తీ చేయాలని ఆయన కుమారుడు, మాజీ మంత్రికే తారకరామారావు (కేటీఆర్) తాపత్రయపడుతున్నారనేది జగద్విదితమే! దానికోసం ఆయన నానా అవస్థలు పడుతున్నారు. ఆయనకు తోడు మరో మాజీ మంత్రి టీ హరీశ్‌రావు కూడా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. బీఆర్ఎస్ పక్షాన వీరిద్దరే ప్రస్తుత రాజకీయ యవనికపైన నిత్యం కనిపిస్తున్నారు. మరోవైపు ప్రస్తుత రాజకీయాల్లో కేసీఆర్ సమకాలీకులు ఎవరూ ప్రధానపార్టీల్లో లేరు. దీనితో ఆయన తనకన్నా వయసులో, అనుభవంలో చిన్నవాళ్లయిన ఇతరపార్టీల నేతలతో విమర్శలు, నిందలు పడాల్సి వస్తున్నది. దీన్ని భరించలేకే కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ముఖం చాటేస్తున్నారని చెప్తున్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం అధికార కాంగ్రెస్‌పార్టీకి ఓ ఏడాది గడువు ఇచ్చాక, పరిపాలన చూసి, అప్పుడు తమ అగ్రనేత జనంలోకి వస్తారని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7వ తేదీతో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఏ రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తవుతుంది. ఈ ఏడాదికాలంలో ప్రభుత్వ వైఫల్యాలను జనంలో ఎండగట్టేందుకు డిసెంబర్ 8 నుంచి 15వ తేదీ లోపు రాష్ట్ర వ్యాప్తంగా కనీసం నాలుగు అతిపెద్ద బహిరంగసభల్ని ఏర్పాటు చేసి, కేసీఆర్ 'గర్జన'ను వినిపించాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఫాంహౌస్‌లో తనను కలిసిన నేతలతో కేసీఆర్ కూడా ఇదే తరహా సిగ్నల్స్ ఇస్తున్నట్టు సమాచారం.

అయితే కాంగ్రెస్ శ్రేణులు దీన్ని కొట్టిపారేస్తున్నాయి. కేసీఆర్ శకం ముగిసినట్టే అని ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్‌పై మరింత పట్టు సాధించేందుకు మాజీ మంత్రి కేటీఆర్ అష్టకష్టాలు పడుతున్నారని ...2లో

మహేందర్ రెడ్డి నియామకం
రాజ్యాంగ విరుద్ధం
మాజీమంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనమండలి చీఫ్‌విప్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి నియామకం రాజ్యాంగ విరుద్ధమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. మండలి చైర్మెన్ వద్ద అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉన్న వ్యక్తికి విప్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. పీఏసీ ...3లో

ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి..

తండ్రి ఆత్మహత్య • పండుగపూట విషాదం

• కుటుంబ కలహాలతోనే..?..కామారెడ్డి జిల్లాలో ఘటన



నవతెలంగాణ - తాడ్వాయి (లింగంపేట్)

కలహాలు.. ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. అభం శుభం ఎరగని పిల్లలను బావిలోకి తోసి తండ్రి సైతం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పండుగ వేళ.. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ...3లో



తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ సంఘం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనికి వినతి

- కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, ఉద్యోగులు, విద్యారంగం వంటి పలు సమస్యలపై విన్నపం

నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్దీకరణ, ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు, ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తుల బకాయిలు, ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్ విధానం, విద్యా రంగంలో ఉన్న సమస్యల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఆదివారం ఖమ్మంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తమ్మినేని వీరభద్రం సానుకూలంగా స్పందించి తమ పార్టీ ఆధ్వర్యంలో సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అయన్ను కలిసిన వారిలో.. సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కుప్పిశెట్టి సురేష్, మానుకోట జిల్లా రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి మల్లయ్య తదితరులు ఉన్నారు.

మెడికల్ సీట్లు సాధించిన గిరిపుత్రులకు.. మంత్రి సీతక్క సన్మానం

నవతెలంగాణ-ములుగు




ములుగు జిల్లాలోని అన్నంపెల్లి గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించగా ఆదివారం మంత్రి సీతక్క వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. తన సొంత గ్రామం జగ్గన్నపేట శివారు గ్రామం అన్నంపెల్లికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించడం సంతోషంగా ఉందన్నారు. మెడికల్ సీట్లు సాధించిన పోరిక సూరజ్, పోరిక సభపతి సౌరబ్ అభయానంద్, పోరిక సాయిరాం, పోరిక కళ్యాణిలను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, కుల సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కన్న కూతురిపై లైంగికదాడి

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఘటన

నవతెలంగాణ-షాబాద్

కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి కన్న కూతురును కాటేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని ఓ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. షాబాద్ మండలంలోని ఓ గ్రామంలో అతని భార్య కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయింది. ఆతనికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే అతడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కూతురు ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. కుమారుడు చిన్నవాడు. భార్య లేకపోవడంతో కూతుర్ని (మైనర్‌ను) భయపెట్టి లైంగికదాడికి పాల్పడేవాడు. ఎప్పటిలాగే శనివారం రాత్రి దసరా పండుగకు పీకలదాకా మద్యం తాగి వచ్చి, రాత్రి కూతుర్ని భయపెట్టి అరువకుండా నోట్లో బట్టపెట్టి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో కంగుతిన్న కొడుకు.. స్థానికుల సహాయంతో 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించి నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆదివారం అతనిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.



ఎంఎస్ఎన్ ఆర్గానిక్స్ పరిశ్రమను తరలించాలి

అఖిలపక్ష నాయకులతో కలిసి బీబీనగర్ వాసుల ధర్నా

నవతెలంగాణ-బీబీనగర్

యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలోని ఎంఎస్ఎన్ ఆర్గానిక్స్ పరిశ్రమను వెంటనే అక్కడ నుంచి తరలించాలని స్థానిక ప్రజలు అఖిలపక్ష నాయకులతో కలిసి పరిశ్రమ గేటు ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నాయకులు మాట్లాడుతూ.. కాలుష్య కారకమైన ఈ పరిశ్రమ వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, అంతేకాకుండా దీర్ఘకాల వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులు.. శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. పరిశ్రమను మూసివేసి ఇక్కడి నుంచి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పరిశ్రమ మూసివేసేంత వరకు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు ధర్నా నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక పోలీసులు ధర్నా స్థలికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు నిర్వహించకుండా శాంతియుతంగా ధర్నా నిర్వహించాలని గ్రామస్తులు, నాయకులను కోరారు. ధర్నా అనంతరం పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులతో నాయకులు, పోలీసులు చర్చలు జరపగా.. ఒక్కరోజు గడువు ఇవ్వాల్సిందిగా యాజమాన్యం కోరడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. సమస్యను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని పరిశ్రమ ప్రతినిధులు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పొట్టోల్ల శ్యామ్‌గౌడ్, గోళి పింగళ్‌రెడ్డి, మల్లగారి శ్రీనివాస్, గోలి నరేందర్‌రెడ్డి, పొట్ట నవీన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సురకంటిసత్తిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

హరీశ్ మీకిది తగదు

ఉల్లంఘనలు జరగలేదు : మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ శాసనమడలి చీఫ్‌విప్ సహా ఇతర నియామకాలు రాజ్యాంగబద్ధంగానే జరిగాయని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఎక్కడా ఉల్లంఘనలు జరగలేదన్నారు. మండలి చీఫ్‌విప్‌గా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని ఎలా నియమించారని హరీశ్‌రావు ప్రశ్నించిన నేపథ్యంలో మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. కేసీఆర్ హయాంలో హరీశ్‌రావు శాసనసభ వ్యవహారాల మంత్రిగా ఉన్న సమయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని, అప్పుడు రాజ్యాంగం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చెందిన 12 మంది ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిగా బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని విమర్శించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మండలి చైర్మెన్, అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాలు తీసుకుంటారని వివరించారు. సంప్రదాయం ప్రకారమే ప్రతిపక్ష సభ్యుడికి పీఏసీ చైర్మెన్ పదవి ఇచ్చినట్టు మంత్రి తెలిపారు. అనర్హత పిటిషన్ల అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందన్నారు.

సీఎం రాకతో మురిసిన 'కొండారెడ్డిపల్లి'

దసరా పండుగను స్వగ్రామంలో జరుపుకున్న రేవంత్‌రెడ్డి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- బతుకమ్మలు, బోనాలు, పూలతో.. సీఎంకు స్వాగతం

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/వంగూరు



రాష్ట్ర ముఖ్యమంత్రి హెూదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి మొదటిసారిగా ఆయన స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి శనివారం విచ్చే యడంతో గ్రామస్తులు ఆనందోత్సాహాలతో ఉప్పొంగి పోయారు. దసరా పండుగకు స్వగ్రామంలో జరుపుకోవడం కోసం ప్రతి ఏడాది రేవంత్‌రెడ్డికి కొండారెడ్డిపల్లికి వస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఎం ఆయ్యాక ఇప్పటివరకు ఆయన స్వగ్రామానికి రాలేదు. శనివారం ప్రత్యేక హెలీకాప్టర్‌లో కొండారెడ్డిపల్లికి చేరుకున్న సీఎంకు గ్రామస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు.. బతుకమ్మలు, బోనాలు, గజమాలతో పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. అనంతరం రేవంత్‌రెడ్డి అందరినీ పలకరిస్తూ ముందుకు కదిలారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

గ్రామంలో రూ.72 లక్షలతో నిర్మించిన కొత్త పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మామిడి మొక్కను నాటారు. రూ.55లక్షలతో అత్యాధునికంగా నిర్మించిన అమర జవాను యాదయ్య స్మారక గ్రంథాలయం, రూ.58 లక్షలతో నిర్మించిన బీసీ సామాజిక భవనం, రూ.45 లక్షలతో నిర్మించిన పశువైద్యశాల భవనాలను సీఎం ప్రారంభించారు. అలాగే, గ్రామంలో రూ.18 కోట్లతో చేపట్టనున్న భూగర్భ మురుగు నీటి పైప్‌లైన్ నిర్మాణం, మురుగునీటి శుద్ధి కేంద్రం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 64 లక్షలతో ప్రయాణ ప్రాంగణం, ప్రధాన రహదారి మీదుగా విద్యుత్తు దీపాలంకరణ, రూ.32 లక్షలతో చిల్డ్రన్‌పార్కు, బహిరంగ వ్యాయామశాల పనులకూ సీఎం శంకుస్థాపనలు చేశారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ ఆలయంకు చేరుకున్న ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో పూజారులు స్వాగతం పలకగా... స్వామి వారి దర్శించుకున్నారు. దసరా పండుగ సందర్భంగా శనివారం సాయంత్రం గ్రామశివారులోని జమ్మిచెట్టు దగ్గరికి చేరుకొని పూజలు నిర్వహించి అందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి దసరా పండగను స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో జరుపుకొనేందుకు ముఖ్యమంత్రి రానున్న ఆయన వెంట నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్ రెడ్డి, స్థానిక ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

అధికారులు, పోలీసుల అత్యుత్సాహంపై గ్రామస్తుల ఆగ్రహం

గ్రామంలో పుట్టి, తమ మధ్య పెరిగి.. సీఎం హెూదాలో రేవంత్ రెడ్డి.. కొండారెడ్డిపల్లికి రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా, గ్రామస్తులు సీఎం వద్దకు వెళ్లి విజయదశమి శుభాకాంక్షలు తెలుపుదామనుకున్న స్థానికులకు నిరాశేమిగిలింది. సీఎంను కలవడం కాదుకదా.. కనీసం దూరం నుంచైనా చూడటానికి పోలీసులు అనుమతించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ముందు అతివినయం ప్రదర్శిస్తూ తమను దూరంగా నెట్టి వేశారని కొంతమంది గ్రామస్తులు తెలిపారు. విలేకరులకూ ఎంట్రీ పాస్‌లు ఇవ్వకపోవడంపై మీడియా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

గ్రీన్ ఎనర్జీ దిశగా ప్రపంచం అడుగులు

రైతులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు

- రైతుకు ప్రాధాన్యత కల్పిస్తూ బడ్జెట్‌లో రూ.73 వేల కోట్లు కేటాయింపు
- ఆయిల్‌ఫామ్ టన్ను గెలలు రూ.20 వేలకు పైగా మద్దతు ధరకు కృషి
- ఆశ్వారావుపేటలో 2.5 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

నవతెలంగాణ-అశ్వారావుపేట



నేడు ప్రపంచం థర్మల్ విద్యుత్ నుంచి గ్రీన్ విద్యుత్ దిశగా మారుతున్నదని, రాబోయే ఆరేండ్లలో రాష్ట్రంలో దాదాపు 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలోని రైతులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో ఉన్న ఆయిల్‌పామ్ కర్మాగారం సొంత అవసరాలకు రూ.36.5 కోట్లతో నిర్మించిన 2.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని శనివారం మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి భట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుల కోసం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సును భట్టి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు ఆయిల్‌పామ్ సాగుపై అడిగిన సందేహాలను మంత్రులు, అధికారులు నివృత్తి చేశారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. ప్రతి పైసా ప్రజల కోసం ఖర్చు చేస్తూ ప్రతి కుటుంబంలో వెలుగులు నింపేలా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. విజయదశమి రోజు రైతుల సంక్షేమానికి పనిచేసే ఆయిల్ ఫెడ్ కంపెనీ బయో మాస్ ప్లాంట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో గెలలు గానుగ పట్టే క్రమంలో వచ్చే ఉప ఉత్పత్తి అయిన గెలలు పీచు(చెత్త)తో 2.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్లాంట్ నిర్మించుకున్నట్టు చెప్పారు. రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ శాఖకు రూ.73 వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. రైతులకిచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.18 వేల కోట్లతో చేశామని, మిగిలిన రైతులకు కూడా త్వరలో మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలతో వరదలు ముంచెత్తడంతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం సైతం అందజేశామని గుర్తు చేశారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గతంలో ఈ ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ అమ్మడానికి చాలా మంది ప్రయత్నించారని, రైతులకు లాభాలు అందించే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని అమ్మకుండా ఉంచేందుకు తాను కృషి చేశానని అన్నారు. ఆయిల్‌పామ్ పంటకు రూ.20 వేలకుపైగా ధర వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దని తెలిపారు. రైతులు బయట ఎక్కడా ఆయిల్‌పామ్ విత్తనాలు కొనుగోలు చేయొద్దని, ప్రభుత్వం సరఫరా చేసే మొక్కలు మాత్రమే వేయాలని తెలిపారు. నర్సరీలో అనేక పరీక్షలు నిర్వహించిన తర్వాత మాత్రమే రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. దేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, సన్నాలు పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించామని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో దేశంలోనే తెలంగాణ ఆయిల్‌పామ్ సాగులో ప్రథమ స్థానంలో ఉండ బోతుందని అన్నారు. గిరిజనుల ప్రాంతమైన అశ్వారావు పేట అడవులతో దట్టంగా ఉండేదని, నేడు ఆయిల్ పామ్ మొక్కలతో పచ్చగా ఉండటం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, వైరా, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్, కూనంనేని సాంబశివరావు, జారే ఆదినారాయణ, మట్ట రాగమయి, ఆయిల్ ఫెడ్, నీటిపారుదల అభివృద్ధి, వేర్ హౌస్, మార్క్ ఫెడ్ కార్పొరేషన్ల చైర్మెన్లు జంగా రాఘవరెడ్డి, మువ్వా విజయ్ బాబు, రాయల నాగేశ్వరరావు, కొత్వాల శ్రీనివాస రావు, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానశాఖ కార్యదర్శి, ఆయిల్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యస్మీన్ భాషా, సింగరేణి సీఎండీ బలరాం, కలెక్టర్ జితేష్ వీ.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు బాబూరావు, మధుసూధన్ రావు, జే.కిషోర్(ఇన్‌చార్జి), ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్ రెడ్డి, ప్రాజెక్టులు మేనేజర్ ఎన్.శ్రీకాంత్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ పి.తిరుమలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి.. 60 మందికి పైగా అస్వస్థత.. ఇద్దరు మృతి

నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావ్‌పేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

కలుషితమైన నీటిని తాగి 60 మందికి పైగా అస్వస్థతకు గురవగా.. వారిలో ఇద్దరు మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్‌రావ్ పేట్‌లో గురువారం జరిగిన ఈ ఘోర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ పురాతన బావి నీటితో.. మిషన్ భగీరథ నీటిని కలిపి వాటిని నీటి ట్యాంకుల్లో నింపి కాలనీలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాగా, గురువారం ఆ నీటిని తాగిన గ్రామస్తులు ఒకొక్కరుగా వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల్లో చేరడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన బోడి మహేష్(26), బాయికాడి సాయవ్వ(80) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందారు. మరో 60 మందికిపైగా వివిధ ఆస్పత్రుల్లో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. అయితే, తాగునీటి బావి పక్కనే చెత్తాచెదారం, మురుగు నీటితో నిండిన పెద్ద చెరువు ఉన్నది. ఆ కలుషిత నీరు.. భూగర్భం ద్వారా బావిలోకి చేరి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఆ బావిలో మూడ్రోజుల క్రితం కుక్కపిల్ల పడి మృత్యువాత పడినట్టు సమాచారం. దాంతో తాగునీరు కలుషితం అయి ఉండొచ్చని గ్రామస్తులు అంటున్నారు. కాగా, గ్రామస్తులు అస్వస్థతకు గురయిన ఘటన వెలుగులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో హెల్త్‌క్యాంపు నిర్వహించి.. వైద్యం అందిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో ఇప్పటివరకు 30 మందికి ట్రీట్మెంట్ చేసినట్టు హాస్పిటల్స్ సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

కానిస్టేబుల్ సాగర్ ఆత్మహత్య

గంజాయి చోరీ ఘటనలో సస్పెండ్

- ఇద్దరు ఎస్ఐలు, మరో వ్యక్తి కలిసి బలి పశువును చేశారంటూ సూసైడ్ వీడియో
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో ఘటన

నవతెలంగాణ-బూర్గంపాడు

గంజాయి కేసులో సస్పెండ్ అయిన కానిస్టేబుల్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూరుకు చెందిన భూక్యా సాగర్ బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశాడు. ఈ ఏడాది జనవరిలో బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో పలు కేసుల్లో సీజ్ చేసిన గంజాయి మాయమైన ఘటనలో విచారణ చేపట్టిన అధికారులు కానిస్టేబుల్ సాగర్‌ను బాధ్యుడిని చేసి సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో గంజాయి చోరీ కేసులో తనను బలి పశువును చేశారంటూ ఆరోపిస్తూ దసరా పండుగ రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతూ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో పని చేసిన ఎస్ఐలు సంతోష్, రాజ్‌కుమార్, బూర్గంపాడుకు చెందిన గొనెల నాని అనే వ్యక్తితో కలిసి గంజాయిని అమ్ముకున్నారని సాగర్ తెలిపారు. గంజాయి మాయమైన విషయంలో ఎస్ఐల పాత్ర ఉందని, వారిని వదిలేసి తనపై చర్యలు తీసుకోవడంతో మనస్తాపానికి గురైనట్టు సాగర్ సూసైడ్ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. తన స్వగ్రామైన ఏన్కూరులో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా.. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మంకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పరకాల కాంగ్రెస్‌లో భగ్గుమన్న గ్రూపు విభేదాలు

కొండా వర్సెస్ రేవూరి మధ్య వర్గపోరు

నవతెలంగాణ-గీసుగొండ

వరంగల్ జిల్లా పరకాల కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విభేదాలు భగ్గుమన్నాయి. మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రావూరి ప్రకాశ్‌రెడ్డి గ్రూపుల మధ్య ఫ్లెక్సీ వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ధర్మారంలో మంత్రి కొండా వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో రేవూరి ఫొటో లేకపోవడంతో రేవూరి వర్గీయులు వాటిని చింపివేశారు. దాంతో ఇరు గ్రూపుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో పోలీసులు రంగప్రవేశం చేసి కొండా వర్గీయులు 5మందిని అరెస్టు చేశారు. దాంతో కొండా వర్గీయులు పెద్ద ఎత్తున చేరుకొని వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి ధర్మారం వద్ద ధర్నా చేపట్టారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే తమపై అక్రమంగా కేసులు పెట్టించి వేధిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో ఒక్కసారిగా ఉమ్మడి జిల్లా రాజకీయాలు వేడెక్కాయి.

సారొస్తారొస్తారూ..!

(మొదటిపేజీ తరువాయి)

చెప్పున్నారు. ఇప్పుడు ఆపార్టీకి పెద్ద దిక్కులుగా కేటీఆర్, హరీశ్‌రావు మాత్రమే మిగిలి ఉన్నారనీ, కేసీఆర్ కేవలం ఉత్సవ విగ్రహమేనని విమర్శలు చేస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు, మంత్రులైతే అసలు కేసీఆర్ బతికే ఉన్నారా...అని లేని సందేహాలను ప్రజలకు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం చేపట్టిన పనులకు సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. తమ లక్ష్యాన్ని సమర్థించుకొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా, ఈ విషయంలో మాత్రం ప్రజలు ఆయన్ని విశ్వసించే పరిస్థితులు క్షేత్రస్థాయిలో కనిపించట్లేదు. రైతు రుణమాఫీలోనూ కాంగ్రెస్ సర్కారుకు అనేక చిక్కుముడులు పడుతూనే ఉన్నాయి. క్రమంగా ఆపార్టీపై, రేవంత్‌రెడ్డి నాయకత్వంపై ప్రతిపక్షాలు దాడిని పెంచాయి. రైతు రుణమాఫీ కాగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావించిన ప్రభుత్వం ఇప్పుడు కొద్దిగా వెనుకంజ వేస్తున్నట్టు కనిపిస్తున్నది.



అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం మాత్రం కచ్చితంగా అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ రెండో వారంలోపు స్థానిక ఎన్నికల్ని నిర్వహించకతప్పదని తేల్చిచెప్తున్నది. ఆ మేరకు ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని రాజకీయపార్టీల నేతలతోనూ సమావేశాలు నిర్వహించింది. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించింది. బీసీ రిజర్వేషన్ల ఖరారుపై కూడా ఎన్నికల సంఘం స్పష్టమైన వైఖరినే ప్రకటించింది. రిజర్వేషన్ల ఖరారు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదనీ, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేలోపు ఆ జాబితా ఇస్తే, అమలు చేస్తామనీ, లేకుంటే పాతపద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించేస్తామని తేల్చిచెప్పింది. దీనితో స్థానిక సమరం దాదాపు ఖాయంగానే కనిపిస్తున్నది.

ఈ దశలో బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేసుకోవడంపై దృష్టిసారించింది. ఆపార్టీ ప్రజాందోళనల్ని తాజాగా జిల్లాలకు విస్తరింపచేసింది. ఈ రేస్‌లో తామెక్కడ వెనుకబడి పోతామో అని భావిస్తున్న బీజేపీలో నేతల మధ్య అనైక్యత, ఆధిపత్యధోరణి పార్టీ శ్రేణులకు తలనొప్పిగా మారింది. చివరకు ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి 'పార్టీలో నా మాటే ఫైనల్' అని పత్రికాముఖంగా చెప్పుకొనే స్థితికి దిగజారింది. పార్టీలో పెద్ద తలలుగా ఉన్న డాక్టర్ కే లక్ష్మణ్ ప్రస్తుతం 'టచ్ మీ నాట్' అనే ధోరణిలోనే వ్యవహరిస్తున్నారు. ఇక బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వరరెడ్డి తనకు పార్టీలో ప్రాధాన్యత ఇవ్వట్లేదనీ, పార్టీ ఆఫీసులో మాట్లాడాలంటే, అనుమతి తీసుకోవాలని చెప్తున్నారని వాపోతున్నారు. దీనితో ఆయన అసెంబ్లీ ప్రాంగణంలోని బీజేపీ శాసనసభాపక్ష కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్నారు. మరో కేంద్రమంత్రి, బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ తన దూకుడు మాత్రం తగ్గించట్లేదు. జనంలోకి హిందుత్వ అజెండాను చొప్పించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అంత దూకుడు వద్దని పార్టీ అధినేత జీ కిషన్‌రెడ్డి చెప్తున్నా...'డోంట్ కేర్' అంటూ నోటికొచ్చిన మాటలు మాట్లాడుతూనే ఉన్నారు. ఇక మరో ఎమ్మెల్యే రాజాసింగ్...తాను పార్టీలో సీనియర్ అయినా పట్టించుకోవట్లేదని వేరు కుంపటి పెట్టుకొని, తనగోల తాను పడుతున్నాడు. దీంతో పార్టీని ఏకతాటిపైకి తేవడం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి తలనొప్పిగా మారింది.

ఇక వామపక్షాలు మాత్రం ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజాసమస్యలపై కలిసొచ్చే అంశాల్లో ఐక్య ఉద్యమాలు చేపడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా సీపీఐ(ఎం) భూపోరాటాలను ఉధృతం చేసింది. డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఎప్పుడిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంది. వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై నిరసన గళాన్ని ప్రభుత్వానికి వినిపిస్తున్నది. మొత్తానికి పార్లమెంటు ఎన్నికల్లో పరువు పోగొట్టుకున్న బీఆర్ఎస్, ఊహించని విధంగా 8 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించిన బీజేపీ రాష్ట్రంలో రెండోస్థానంలో నిలవడం కోసం అష్టకష్టాలు పడుతున్నాయి. దీనికి స్థానిక ఎన్నికలు కొలమానంగా నిలిచి, ప్రజాభిప్రాయాన్ని వెల్లడించనున్నాయి.

మానుకోట కలెక్టరేట్‌లో కాల్పులు

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మృతి

- ఆత్మహత్యనా..? గన్ మిస్‌ఫైరా..?
- విచారణ జరుగుతున్న ఎస్పీ

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం తుపాకి కాల్పుల్లో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గుడి బోయిన శ్రీనివాస్(53) మృతి చెందారు. కాగా, తన గన్‌తో ఆత్మహత్య చేసుకున్నారా లేక గన్ మిస్ ఫైర్ అయిందా అనేది తెలియడం లేదు. జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేక స్వయంగా విచారణ నిర్వహిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో క్యాంటీన్ పక్కనున్న స్ట్రాంగ్ రూమ్‌లో ఎన్నికలకు సంబంధించిన విలువైన సామగ్రి నిల్వ చేశారు. ఇక్కడ ఒక పోలీస్ అవుట్ పోస్ట్‌నూ ఏర్పాటు చేసి 24 గంటలు కానిస్టేబుల్‌ను కాపలా పెట్టారు. ఆదివారం అక్కడ ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ గన్‌తో కాపలాగా ఉన్నారు. ఆదివారం సాయంత్రం కాల్పుల శబ్దం రావడంతో కలెక్టరేట్ వాచ్‌మెన్ వెళ్లి చూడగా శ్రీనివాస్ రక్తమడుగులో పడి మృతి చెంది ఉన్నారు. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేక స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శ్రీనివాస్‌కు భార్యతో విభేదాలు ఉన్నట్టు ఎస్పీ తెలిపారు. శ్రీనివాస్ భార్య వరలక్ష్మి కొంతకాలంగా శ్రీనివాస్‌తో విభేదించి పుట్టింట్లో ఉంటుంది. వీరికి ఒక కొడుకు సుశాంత్ ఉన్నారు. శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు అంటుండగా.. గన్ మిస్‌ఫైర్ అయిందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య ఆత్మహత్య చేసుకునే అంత పెద్ద విభేదాలు ఏమున్నాయనే కోణంలోనూ విచారణ నిర్వహిస్తున్నారు. కాగా, మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

పండుగ పూట విషాదం

కూలీల ట్రాలీ అదుపుతప్పి కేఎల్ఐ కాల్వలోకి పల్టీ

- ఒకరు మృతి,12 మందికి గాయాలు
- పత్తి తీయుటకు వెళ్తున్న 13 మంది మహిళా కూలీలు
- నాగర్‌కర్నూల్ మండలం మంతటిలో ఘటన

నవతెలంగాణ -నాగర్ కర్నూల్ రూరల్


నాగర్ కర్నూల్ మండలం మంతటి గ్రామంలో పండుగ పూట విషాదం చోటు చేసుకున్నది. మండలంలోని జ్ఞాన సరస్వతి దేవాలయం సమీపంలో కూలీలు వెళుతున్న ట్రాలీ అదుపుతప్పి కేఎల్ఐ కాల్వలోకి పల్టీ కొట్టింది. దాంతో ఒక మహిళా కూలీ మృతిచెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా మంతటి గ్రామానికి చెందిన 13 మంది మహిళా కూలీలు ట్రాలీ వాహనంలో కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని కేఎల్ఐ కాలువకు సమీపంలోని వ్యవసాయ పొలంలో పత్తి తీయడానికి వెళ్తున్నారు. కాగా, ట్రాలీ వేగంగా వెళుతున్న క్రమంలో వాహనాన్ని డ్రైవర్ పొలం వైపు తిప్పేటప్పుడు అదుపుతప్పి కాల్వలోకి పల్టీలు కొట్టింది. దాంతో ఫాతిమా బేగం (40) అక్కడికక్కడే మృతి చెందింది. ఇద్దరి మహిళకు తీవ్ర గాయాలు కాగా, ఇతరులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా, సిబ్బంది వచ్చి గాయపడ్డ వారిని వెంటనే ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి.. ప్రధాన ఆస్పత్రికి చేరుకొని సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న కూలీలను పరామర్శించారు. అనంతరం వైద్యు లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



మనపై ఉత్ప్రేరకాల ప్రభావం

ఉమెన్ హెల్త్

నమస్కారం అండీ! అందరూ కులాసాగా ఉన్నారని ఆశిస్తున్నాను. మీరు మీ భావోద్వేగ ఉత్ప్రేరకాల(ట్రిగ్గర్స్)ను గుర్తించారని భావిస్తున్నాను. మరి అవి ఎలా పనిచేస్తాయో తెలుసుకుంటున్నారా? మన ఉత్ప్రేరకాలను గుర్తించడం ఎంతో ముఖ్యం. గత వారంలో ఈ విషయంపై మాట్లాడుకున్నాం కదా! ఈ వారం మరిన్ని విశేషాలు తెలుసుకుందాం...



ఈ ఉత్ప్రేరకాల గురించి ఎవరైనా మాట్లాడినప్పుడు, మనకు వారిపై కోపం, అపోహలు ఏర్పడతాయి. ఈ అపోహల వల్ల క్షోభ, resentment వంటి భావాలు పుట్టుకొస్తాయి. తద్వారా సంబంధాలు దెబ్బతింటాయి. దాంతో పాటు మన అవసరం తక్కువగా అనిపించవచ్చు. మానవ సంబంధాలలో దూరం పెరుగుతుంది. నిజానికి ఈ ఉత్ప్రేరకాలు మనపై ఎంత ప్రభావం చూపిస్తున్నాయో మనం గుర్తించలేం. ఉత్ప్రేరకం చలించినప్పుడు మనలో కొన్ని మార్పులు చోటు చేసుకుంటాయి. గుండె వేగంగా కొట్టుకోవడం, ముఖం ఎర్రగా మారడం, ఊపిరి పీల్చడం వేగం అవ్వడం వంటివి జరుగుతాయి. దీనిని heightened emotional state లేదా fight or flight response అంటారు. ఈ సందర్భంలో flight mode గురించి కూడా మాట్లాడాలి.



తార్కిక ఆలోచన కోల్పోతాం

flight modeకి వెళ్లినప్పుడు, మనం తార్కిక ఆలోచనలను కోల్పోతాము – శాస్త్రీయంగా దీనిని "amygdala hijack" అంటారు. rational brain పనిచేయడం ఆగిపోతుంది. emotional brain మాత్రమే స్పందిస్తుంది. అందువల్ల flight modeలో ఉన్నప్పుడు మనం awareness కలిగి ఉండడం మొదటి దశ. తరువాత pause (దీర్ఘంగా శ్వాస తీసుకోవడం, పది నుండి ఒకటి వరకు లెక్కపెట్టడం) చేయడం, భావాన్ని గుర్తించడం, నెమ్మదిగా భావాన్ని అనుభవించడం, నర్వస్ సిస్టమ్‌ను సమీకరించడం ద్వారా మన భావాలు సులభంగా విడుదల అవుతాయి. ఈ విధానం ద్వారా మనం చాలా అసౌకర్యకరమైన పరిస్థితులను నివారించగలుగుతాం. ఇతరులను బాధపెట్టడం నివారించగలుగుతాం. అలాగే మనం ప్రశాంతంగా ఉండగలుగుతాం. మన భావాలను అర్థం చేసుకుని బయటి పరిస్థితుల ప్రభావం లేకుండా మనం బలంగా ఉండగలుగుతాం.

ఆలోచనలను మార్చు కుందాం

ముఖ్యమైన విషయం ఏమిటంటే మనం ఎప్పుడూ బయటి పరిస్థితులను మార్చలేము. కానీ మనలోపల మార్పు చేయడం, లోటస్ ఆకుల వంటి భావాలను అభివృద్ధి చేయడం ఎంచుకోవచ్చు. మరింతగా మనం ఈ ప్రయాణంలో మన ఆలోచనలను మార్పు చేయడానికి కూడా ప్రయత్నించాలి. ప్రతీ రోజూ కొన్ని క్షణాలు మీకు నచ్చిన సాధనలను చేస్తూ, చిత్తశుద్ధిని పెంపొందించుకోండి. ధ్యానం, జ్ఞాన బోధనలు లేదా రికార్డు చేసిన భావనలు – ఇవన్నీ మన భావోద్వేగాలను గుర్తించడానికి సహాయపడతాయి.





మనపై దృష్టిపెడదాం

సారాంశం ఏమిటంటే మన ఉత్ప్రేరకాలను గుర్తించుకుందాం. amygdala hijack నుండి తప్పించుకోవడానికి pause చేయడం అభ్యసించుకుందాం. అసౌకర్యకరమైన పరిస్థితులను నివారించుకుందాం. చివరగా మనపైన దృష్టి పెట్టి, భావోద్వేగ మాస్టరీని పొందుదాం. దీని కోసం మనం ఈ రోజు మొదటి అడుగు వేద్దాం! ఈ ప్రయాణంలో మనం ఒకరికొకరు సహాయపడితే మన ప్రగతిని మరింత వేగవంతం చేయగలుగుతాం. ప్రతిదీ మన చేతిలోనే ఉంది. మనలోని శక్తిని కనుగొనవలసిన సమయం ఇది! మనందరం కలిసి ఈ యాత్రను అందంగా సాగిద్దాం.

Dr.Prathusha. Nerella
MD(General Medicine) CCEBDM; CCGDM; NLP; FID
Senior General Physician
Positive Psychologist certified Nutritionist
Diabetes And Lifestyle Expert
Pranic Healer Chiief Holistic Health Consultant And Medical Director @ Praveha General, Diabetes And Lifestyle Clinic - A Holistic Centre With Integrated Approach.
Ph: 8897684912/040-49950314

ఇట్ల చేద్దాం

మిక్సీజార్ బ్లేడ్స్ పదునుగా ఉండాలంటే దాంట్లో కొద్దిగా ఉప్పువేసి తిప్పాలి.





వంటింట్లో బొద్దింకలు పోవాలంటే కొద్దిగా బోరిక్ పౌడర్‌ను వంటింటి మూలల్లో ఉంచాలి.

చిన్న మార్పులతో...



ఫంక్షన్ చిన్నదా, పెద్దదా అనే తేడా లేదు.. ఏ అకేషన్ అయినా సరే మహిళలు స్పెషల్ గా కనిపించాలని కోరుకుంటారు. ఇందు కోసం కొన్ని రోజుల ముందు నుంచి రకరకాల బ్యూటీ టిప్స్ ఫాలో అవుతుంటారు. అసలైన ఫంక్షన్ రోజున లేచింది మొదలు మేకప్ చేసుకుంటూనే ఉంటారు. ఇది సెలబ్రిటీల నుంచి, సామాన్యుల వరకు అందరూ చేసే పనే. అయితే మేకప్ వేసుకోవడం అన్ని సందర్భాల్లోనూ సాధ్యం కాకపోవచ్చు. పైగా ఖర్చుతో కూడుకున్న పనికూడా.. అంతేకాదు అదే పనిగా మేకప్ వేసుకున్నా చర్మం పాడవుతుంటుంది. కొన్ని రకాల స్కిన్ సమస్యలు వస్తుంటాయి. అయితే మేకప్ లేకుండా కూడా ముఖాన్ని అందంగా, కోమలంగా తీర్చిదిద్దుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అయితే దీనికోసం కొన్ని టిప్స్ పాటించాలని సూచిస్తున్నారు. అవి ఏమిటో ఈ రోజు తెలుసుకుందాం..

రోజువారి జీవనశైలిలో చిన్నపాటి మార్పులతో సహజసిద్ధమైన మెరుపు పొందవచ్చు. దీని కోసం ప్రతిరోజు 8 గ్లాసుల నీళ్లు తాగడం తప్పనిసరి. దీనివల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకి వెళ్లిపోతాయి. దాంతో చర్మం సహజంగా కాంతిని సంతరించుకుంటుంది.

వారానికి రెండు సార్లు అయిన ఐస్ క్యూబ్స్ తో ముఖంపై మర్దన చేసుకుంటూ ఉండాలి. ఐదు నిమిషాల పాటు ఇలా చేస్తే చర్మం తేలికగా మారుతుంది. ముడతలు తగ్గి చర్మం బిగుతుగా తయారవుతుంది. దద్దుర్లు ఉంటే తగ్గిపోతాయి.

మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడతాయి. రోజు నిద్ర పోయే ముందు అలోవెరా జెల్ తో గాని, కొబ్బరి నూనెతో కానీ కళ్ల కింద మర్దన చేయాలి.

నిద్రపోయే ముందు ముఖాన్ని మంచినీటితో శుభ్రంగా కడుక్కోవాలి.. అప్పుడు ముఖంపై చేరిన దుమ్ము కణాలు తొలగిపోతాయి. దీని ద్వారా చర్మం మృదువుగా కనిపిస్తుంది.

ఎన్సీపీ నేత దారుణ హత్య

మహారాష్ట్రలో రాజకీయ ప్రకంపనలు
శాంతిభద్రతలు క్షీణించాయని ప్రతిపక్షాల ఆరోపణ
తమ పనేనన్న బిష్ణోయ్ గ్యాంగ్

ముంబయి : మహారాష్ట్రలో ఎన్సీపీ నేత, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీని (66) దుండగులు శనివారం రాత్రి కాల్చి చంపిన ఘటన రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఎమ్మెల్యే అయిన కుమారుడు జీషన్ సిద్ధిఖీ నివాసం ఎదుట ఆయనపై దాడి జరిగింది. దుండగులు ఆయనపై మొత్తం ఆరు రౌండ్లు కాల్పులు జరిపారని, వాటిలో మూడు ఆయనకు తగిలాయని పోలీసులు తెలిపారు. కాల్పుల కోసం ఉపయోగించి 9 ఎంఎం తుపాకీని వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే సిద్ధిఖీని లీలావతి ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. సిద్ధిఖీ భౌతిక కాయానికి ఆదివారం రాత్రి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. సిద్ధిఖీ హత్యకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో హంతకుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన అని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. నిందితులు ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన వారని తెలిపారు. నిందితులను గుర్మయిల్ సింఘా, ధర్మ్‌రాజ్ కశ్యప్‌గా గుర్తించారు. గుర్మయిల్ నాలుగు సంవత్సరాలుగా జైలులోనే ఉన్నాడని, బెయిల్ ఎలా వచ్చిందో తెలియడం లేదని అతని తల్లి చెప్పారు. అతనితో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె తెలిపారు. ఈ ఘటన వెనుక గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ప్రమేయంపై కూడా ముంబయి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో విచారణలో సహకరించేందుకు ఢిల్లీ పోలీసులు ప్రత్యేక బృందాన్ని పంపారు. ఫోరెన్సిక్ నిపుణుల బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించింది. సిద్ధిఖీని చంపింది తామేనని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. కూపర్ ఆస్పత్రిలో సిద్ధిఖీ భౌతిక కాయానికి పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం స్వగృహానికి తరలించారు.

ప్రతిపక్షాల మండిపాటు

పదిహేను రోజుల క్రితమే సిద్ధిఖీని హత్య చేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. సిద్ధిఖీ కదలికలపై రెక్కీ కూడా నిర్వహించారు. దీంతో ఆయనకు వై కేటగిరీ భద్రత కల్పించారు. సిద్ధిఖీ మృతిపై పలువురు ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వారు ఆరోపించారు. ఘటనకు రాష్ట్ర హోం మంత్రి బాధ్యత వహించాలని ప్రతిపక్ష నేత విజయ్ వడెట్టివార్ డిమాండ్ చేశారు. ముంబయి నగరం మరోసారి అండర్ వరల్డ్ గుప్పిట్లోకి వెళుతోందని ఈ ఘటన రుజువు చేస్తోందని కాంగ్రెస్ నేత తారిక్ అన్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. భద్రత ఉన్నప్పటికీ సిద్ధిఖీని కాల్చి చంపారని, అలాంటప్పుడు సామాన్యుల గతేమిటని కాంగ్రెస్‌కే చెందిన మరో నేత రషీద్ అల్వీ ప్రశ్నించారు. ఇది దురదృష్టకరమైన సంఘటన అని శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ చెప్పారు. రాజకీయ నాయకత్వం కారణంగా మహారాష్ట్ర అధికారులు గతంలో ఎన్నడూ లేని విధంగా నైతిక స్థైర్యాన్ని కోల్పోయారని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు. ముంబయికి ఇద్దరు పోలీస్ కమిషనర్లు ఉన్నప్పటికీ నగరం సురక్షితంగా లేదని శివసేన (ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) అధ్యక్షుడు ప్రకాష్ అంబేద్కర్ డిమాండ్ చేశారు. సిద్ధిఖీ హత్య వెనుక పెద్ద కుట్ర జరిగిందని సమాజ్‌వాదీ పార్టీ ప్రతినిధి ఫక్రుల్ హసన్ చంద్ అభిప్రాయపడ్డారు. ఈ ఘటనతో మహారాష్ట్ర ప్రజలే కాక దేశం యావత్తూ భయభ్రాంతులకు గురవుతోందని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.

కస్టడీ కోరిన పోలీసులు

బాబా సిద్ధిఖీ హత్య కేసులో ఒక నిందితుడి వయసును ధృవీకరించేందుకు పరీక్ష నిర్వహించాలని పోలీసులు నిర్ణయించారు. నిందితుత వద్ద 28 బులెట్లు లభించాయి. నిందితులను సుమారు ఎనిమిది గంటల పాటు ప్రశ్నించిన అనంతరం వారికి ముంబయిలోని జీటీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత న్యాయస్థానంలో హాజరు పరిచారు. విచారణ నిమిత్తం వారిని 14 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు.





(ఫైల్)

ఎవరీ సిద్ధిఖీ ?

ఈ సంవత్సరం ప్రారంభంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సిద్ధిఖీ ఇటీవలే అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. శాసనసభలో బాంద్రా వెస్ట్ స్థానానికి ఆయన మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. 2014 ఎన్నికలలో బీజేపీ చేతిలో ఓటమి చవిచూశారు. 1992-97 మధ్యకాలంలో ఆయన రెండుసార్లు మున్సిపల్ కార్పొరేటర్‌గా కూడా పనిచేశారు. 2000వ సంవత్సరం ప్రారంభంలో కాంగ్రెస్-ఎన్సీపీ ప్రభుత్వంలో సహాయ మంత్రిగా వ్యవహరించారు. సిద్ధిఖీ రాజకీయ నాయకుడే కాదు. ప్రైవేటు పార్టీలు నిర్వహించడంలోనూ ఆయనకు పేరుంది. బాలీవుడ్ నటులు సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్ మధ్య తలెత్తిన వివాదాన్ని ఆయనే పరిష్కరించారు. వారి మధ్య సంధి కుదిర్చారు. సల్మాన్‌కు సిద్ధిఖీ మంచి మిత్రుడు కూడా.

తెలంగాణ సాధనకు స్ఫూర్తి అలయ్ బలయ్

(మొదటిపేజి తరువాయి)

అభిప్రాయపడ్డారు.

అలయ్ బలయ్ ఐక్యతకు ప్రతీక: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అలయ్ బలయ్ ఐక్యతకు ప్రతీకని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా విజయదశమి పండుగను జరుపుకుంటారన్నారు. అదే స్ఫూర్తితో ఈ కార్యక్రమం మరింత ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ అందరూ కలిసి మెలిసి ఉండాలన్న సంకల్పమే అలయ్ బలయ్ కార్యక్రమమని తెలిపారు. సమాజంలో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హర్యానా గవర్నర్ దత్తాత్రేయ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసిమెలిసి ఉండాలని అభిప్రాయ పడ్డారు. అభివృద్ధిలో రెండు రాష్ట్రాలు దేశంలో నెంబర్‌వన్‌గా నిలవాలన్నారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే ఈ వేడుకను ఒక్క హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ముఖ్య పట్టణాలకు విస్తరింప జేయాలని సూచించారు. ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న ఈ వేడుక భవిష్యత్‌లో మరింత ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్ సింగ్, మేఘాలయ గవర్నర్ విజయ్ శంకర్, రాజస్థాన్ గవర్నర్ హరిభౌ కిషన్‌రావ్ బాగ్డే తమ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా కళాకారుల సంప్రదాయ నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. పోతురాజుల విన్యాసాలు, హైదరాబాదీ సంప్రదాయ వాయిద్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గతానికి భిన్నంగా రాష్ట్రంలోని చేతి వృత్తులైన చేనేత, కమ్మరి, కుమ్మరి, వండ్రంగి తదితర వృత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మంత్రి పొన్నం ప్రభాకర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు వివిధ పార్టీల నుంచి పలువురు నేతలు హాజరయ్యారు. బీజేపీ నుంచి డికే అరుణ, ఈటల రాజేందర్, లక్ష్మణ్, కాంగ్రెస్ నుంచి పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్, వి.హన్మంతరావు, కె.కేశవరావు, బీఆర్‌ఎస్ నుంచి మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాసగౌడ్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, టీజేఎస్ ఎమ్మెల్సీ ప్రొ.కోదండ రాం, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఏపీ మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు.

దారి తప్పుతున్న రాజకీయాలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో రాజకీయాలు దారితప్పుతున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికలప్పుడు రాజకీయాలు, తర్వాత పేద ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టాలి. కానీ ప్రస్తుతం తెలంగాణలో అది లోపించింది. గత కొన్నాళ్లుగా రాజకీయ పార్టీల మధ్య దూషణల పర్వం కొనసాగుతోంది. నేతలు మాట్లాడుతున్న భాషను ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఇప్పటికైనా వారు తమ తీరును మార్చుకోవాలి. దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ అలయ్ బలయ్ ద్వారానైనా వారిలో మార్పు రావాలని కోరుకుంటున్నా" అని వ్యాఖ్యానించారు. అన్ని పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా తమను తాము మార్చుకోవాలని అభిప్రాయపడ్డారు.

ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి..

(మొదటిపేజి తరువాయి)

మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ధర్మబాద్ మండలం నాయ్‌గావ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(37).. తాడ్వాయి మండలం నందివాడకు చెందిన అపర్ణను పదేండ్ల క్రితం పెండ్లి చేసుకొని ఇల్లరికం వచ్చాడు. వీరికి ఇద్దరు కొడుకులు విగ్నేష్ (6), అరవింద్ (4) ఉన్నారు. కాగా దసరా వేడుకల్లో భాగంగా బంగారం (జమ్మి ఆకు) పంచుతానని శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో పిల్లలను తీసుకొని బయటకు వెళ్లాడు. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం ఉదయం గ్రామసమీపంలోని ఓ వ్యవసాయ బావిలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకులు వచ్చి చూడగా.. విగ్నేష్, అరవింద్‌గా గుర్తించారు. కాగా శ్రీనివాస్‌రెడ్డికి చెందిన సెల్‌ఫోన్, చెప్పులు బావి వద్దనే ఉండటంతో ఆయన కూడా బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావించి బావిలోని నీటిని పోలీసులు తోడించడంతో అతని మృతదేహం లభ్యమైంది. కాగా కుటుంబ కలహాలతోనే తన ఇద్దరు కొడుకులను బావిలోకి తోసి ఆయన కూడా ఆత్మహత్య చేసుకొని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డి



(ఫైల్)

డీఎస్పీ శ్రీనివాస్, తాడ్వాయి ఎస్ఐ, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డబ్బుల విషయంలో గొడవలు..?

డబ్బుల విషయంలో కొన్ని రోజులుగా అత్తమామతో పాటు భార్యతో గొడవలు జరుగుతున్నట్టు సమాచారం. వీరి కుటుంబానికి పది ఎకరాల భూమితో పాటు బర్రెలు ఉన్నాయి. అటు వ్యవసాయంతో పాటు ఇటు పశువులను చూసుకుంటూ జీవిస్తున్నారు. ఇల్లరికం వచ్చిన తనను విస్మరిస్తున్నారని, డబ్బులు ఇవ్వడం లేదని పలువురి వద్ద వాపోయినట్టు తెలుస్తోంది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురై తన పిల్లలను తీసుకెళ్లి వారిని బావిలోకి తోసి తాను ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని స్థానికులు తెలిపారు.

ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

(మొదటిపేజి తరువాయి)

గడిపారు. పలుమార్లు దరఖాస్తు పెట్టుకున్నా అటు కేంద్రం ప్రభుత్వం గానీ, ఇటు మహారాష్ట్ర ప్రభుత్వం గాని వైద్య సహాయం అందించకుండా ఇబ్బందులపాల్జేశాయి.

జీవిత చరిత్ర

గోకరకొండ నాగసాయిబాబా 1967లో జన్మించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అమలాపురంలో పేద రైతు కుటుంబంలో జన్మించాడు. ఇంటికి విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఐదేండ్ల వయసులోనే పోలియో సోకి రెండు కాళ్లూ పూర్తిగా దెబ్బతిన్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ, ఢిల్లీ యూనివర్శిటీ (డియూ)లో ఆయన పీహెచ్‌డి పూర్తి చేశాడు.

సవాళ్లు ఎదురైనా పోరాటం ఆపలేదు
తమిళనాడు సీఎం స్టాలిన్

ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతికి సంతాపం తెలియజేస్తున్నా. ఆయన మరణం పౌరహక్కుల ఉద్యమానికి తీరనిలోటు. అణగారినవర్గాలపై జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించారు. తన స్వేచ్ఛకు, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లినా అవిశ్రాంతంగా పోరాడారు. ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

సాయిబాబా మరణం బాధాకరం
బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హక్కుల ఉద్యమకారుడు, ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా అకాల మరణం బాధాకరం. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి. దేశంలోని ప్రజా ఉద్యమాలకు సాయిబాబా మరణం తీరనిలోటు.

మానవతావాది : సీతక్క

ప్రజల పక్షపాతి, పౌరహక్కుల నేత జీఎన్ సాయిబాబా మృతిపట్ల మంత్రి ధనసరి అనసూయ సీతక్క సంతాపం తెలిపారు. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు జీవితాంతం పోరాడిన మానవతావాది సాయిబాబా అని చెప్పారు. తప్పుడు కేసుల్లో సుదీర్ఘకాలం జైల్లో ఉన్నారని గుర్తు చేశారు.

ప్రజాసంఘాల సంతాపం

సాయిబాబా మరణం పట్ల పలు ప్రజా సంఘాలు సంతాపం తెలియజేశాయి. ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని వ్యాఖ్యానించాయి. అంగవైకల్యంతో బాధపడుతూ ప్రజల పక్షాన నిలిచారని గుర్తు చేశాయి. సంతాపం తెలిపిన సంఘాల నాయకుల్లో అఖిల భారత లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర కమిటీ, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ, ప్రధానకార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎం. సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే విద్యావ్యవస్థ నిర్వీర్యం

ఎంపీ మల్లు రవి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

బీఆర్‌ఎస్ హయాంలో విద్యా వ్యవస్తను నిర్వీర్యం చేశారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఎన్ ప్రీతం, బీసీ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో 28 ఇంటిగ్రేటెడ్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులకు ఒకే చోట విద్యను అందించటం మంచి పరిణామమన్నారు. యంగ్ ఇండియా గురుకులాలతో సమాజంలో సమూలమైన మార్పు వస్తుందని చెప్పారు. సంపూర్ణ విప్లవ కేంద్రాలుగా సమీకృత గురుకులాలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు.

మహేందర్ రెడ్డి నియామకం రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజి తరువాయి)

చైర్మెన్ విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వ్యవహరించిందని విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నది. బిల్ పాస్ చేయించడం, ప్రభుత్వ బిజినెస్ జరిగేలా చూడడం చీఫ్ విప్ బాధ్యత. మహేందర్ రెడ్డి ఇప్పుడు ఎవరికి విప్ జారీ చేస్తారు. అధికార పార్టీ సభ్యులకా? ప్రతిపక్ష పార్టీ సభ్యులకా? లేక బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన విప్‌ను పాటిస్తారా? తేలాల్సి ఉంది. ఆయా పార్టీలు తమ పార్టీ ఆదేశానుసారం నడుచుకోమని విప్ జారీ చేస్తాయి. అనర్హత వేటు వేయాల్సిన కౌన్సిల్ చైర్మెన్ స్వయంగా పట్నం మహేందర్‌రెడ్డి చీఫ్‌విప్ ఎంపికైనట్టు బులెటిన్ ఎలా ఇస్తారు" అని హరీశ్ నిలదీశారు. ఎమ్మెల్సీ హోదాలోనే పంద్రాగస్టు, సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగురవేశారని గుర్తు చేశారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర గవర్నర్‌తో పాటు డీవోపీటీకి లేఖ రాస్తామని చెప్పారు. పట్నం మహేందర్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సాహిత్య సృజనలో ఉన్న యువతీయువకులు చాలామంది పాల్గొన్నారు. నవల, కథ, కవిత్వం, పాట, విమర్శ రాస్తున్నవాళ్ళు ఇందులో ఉన్నారు. ఇలా ఒకే వేదిక మీదకి అందుబాటులో ఉన్న వాళ్లందరూ పాల్గొనటం ఎంతో వైవిధ్యంగా అనిపించింది. వాళ్ళ స్వీయ అనుభవాలను, రచనా ప్రయాణాన్ని రికార్డు చేయడం అద్భుతమైన ప్రయోగం. సమాజం, పుస్తకాలు, వ్యక్తులు, సంస్థలు వాళ్లమీద వేసిన ప్రభావాలను వినడం ఎంతో ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. ఇప్పటి యువత రాస్తున్న కవిత్వం మీద మాట్లాడే అవకాశం నాకు వచ్చింది. 1984 తర్వాత పుట్టినవాళ్ల ఒక విభాగంగా, 2000 సంవత్సరం తర్వాత పుట్టిన వాళ్ళు ఒక విభాగంగా చేసుకొని అధ్యయనం చేశాను. మొదటి విభాగం వారిమీద వివిధ సామాజిక ఉద్యమాల ప్రభావం, వారిదైన అందమైన బాల్యం ఉంది. కానీ రెండవ విభాగంవారికి అవి చాలా తక్కువ. ముఖ్యంగా రెండో విభాగం యువతపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ. దృక్పథం స్పష్టత ఉన్నవాళ్లు, లేనివాళ్ళు ఇద్దరూ ఈ రెండు విభాగాల్లో ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒక కొత్త భావచిత్రాల ప్రపంచంలోకి వెళ్లొచ్చిన అనుభూతి ఈ రెండు విభాగాల యువత రాసిన కవిత్వాన్ని చదివితే కలుగుతుందని మాత్రం ప్రకటించగలను.

- డా. ఎస్.చందయ్య , అసిస్టెంట్ ప్రొఫెసర్, నిజాం కళాశాల

అభినందనీయం



సమాజంలో ఒక్కరోజులోనే మార్పు రావాలని కోరుకోవటం అత్యాశే అవుతుంది. అధ్యయనమే సమాజ మార్పునకు మార్గం. శాస్త్రీయ కోణంలో సాహిత్య విశ్లేషణలు ఉండాలని నా ఆకాంక్ష. ఆ దిశగా యువ రచయితలు ముందడుగు వేయాలి. దేనినైనా చేయగలిగే దృఢ సంకల్పం యువతలో ఉంటుంది, సాహిత్యంలో అనేక ప్రయోగాలు చేస్తూ ముందుకెళ్లడం మంచి పరిణామం. తెలంగాణ సాహితి ప్రయత్నం అభినందనీయం. ప్రశంసనీయం. దారితప్పుతున్న సమాజాన్ని తమ సాహిత్యం ద్వారా బాగు చేయాల్సిన బాధ్యత యువతపైనే ఉంది. అనేక కొత్త ఒరవడులు పుట్టుకొస్తున్న తరుణంలో సాహిత్యంలో శాస్త్రీయ దృక్పథాన్ని జొప్పించాలనీ, శాస్త్రీయ కోణంలో విశ్లేషణలు చేయాల్సిన అవసరం మనపై ఉంది. సాహిత్యమనేది సిబ్బి అయితే దాని మీద పొరలుగా పొందికగా సాహిత్యాన్ని (నవల, కథ, విమర్శ, కవిత, పాట) పేర్చడం బతుకమ్మ.

- డా.మామిడి హరికృష్ణ,
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు



నేను రాసిన నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. అయినా ఆ నవల నేపథ్యాన్ని వివరించే అవకాశం నాకు ఈ ఫెస్ట్ ద్వారానే వచ్చింది. ఇంత మంది తమ స్వీయ నవల నేపథ్యాన్ని వివరించడం... గొప్ప అనుభూతిని ఇచ్చింది.

- గడ్డం మోహన్ రావు, నవల రచయిత
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత

యువతిపై గురుతర బాధ్యత ఉంది



రచనకు కావాల్సిన వస్తువును ఎంపిక చేసుకోవడం, బాధ్యతాయుతమైన లక్ష్యం వైపు అడుగులు వేయడం లాంటి గురుతర బాధ్యత యువ రచయితలపై ఉంది. ఉన్నతమైన రచనలు శతాబ్దాన్ని, యుగాన్ని ప్రభావితం చేసే చోదక శక్తులుగా ఉంటాయన్నారు. రచయితలు ఎదుటివారు చెప్పే ప్రతి విషయాన్ని ఓపికగా వినే లక్షణాన్ని అలవర్చుకోవాలి. అంతర్జాతీయ సంస్థల స్థాయిలో వారి రచనలపై వారి మాటల్లోనే తెలియజేయడం అభినందనీయం. ఈ కొత్త ఒరవడికి తెలంగాణ సాహితి బాటలు వేసింది.

- డా.ఎస్. రఘు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం



మనం ఎక్కడో ఉండి రాస్తూ మన పరిధిలోని రచయితలు, వాళ్ల పుస్తకాల వరకు మాత్రమే అవగాహనతో ఉంటాం. కానీ మనకు అవతల చాలామంది ప్రతిభావంతులు ఉన్నారని, ఎన్నో ఏళ్ళుగా సాహితీకృషి చేస్తున్నారని తెలుసుకోవడం అవసరం. అప్పుడే మనల్ని, మన పనిని జాగ్రత్తగా అంచనా వేసుకుంటాం. లేకపోతే మనం మాత్రమే గొప్ప అనే అహంకారపు నీడ మన మీద పడుతుంది. అది చాలా ప్రమాదం. ఇలాంటి కార్యక్రమాల్లో అందర్నీ కలుసుకోవడం, వారి రచనల గురించి తెలుసుకోవడం వల్ల మన ఎక్కడ ఉన్నాం, ఏం రాస్తున్నాం, ఇంకా ఏం రాయాలి.. అనేవి తెలుస్తాయి. ఆ అవకాశం ఈ ఫెస్ట్ ఇచ్చింది. యువతనంతా వేదిక ఎక్కించి, వారి రచనల గురించి వారినే మాట్లాడి, విశ్లేషించుకోమనడం బాగుంది.

- సాయి వంశీ (విశీ), కథా రచయిత

యువత ప్రాపంచిక దృక్పథంతో రచనలు చేయాలి



సమాజం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న తరుణంలో యువత రచనలపై దృష్టి సారించడం ప్రవాహానికి ఎదురు ఈదడమే. తనకేంటి లాభం అని ఆశిస్తున్న కాలంలో సమాజంలోని ప్రజలను చైతన్యపర్చడానికి యువ రచయితలు ముందుకు రావడం అభినందనీయం. మంచి లక్ష్యం, సృజనాత్మకతతో కూడుకున్న రచనలు ఎల్లకాలం నిలబడి ఉంటాయి. ప్రతి రచనకూ భాష ముఖ్యమైనదనీ, రచనలెప్పుడూ ప్రజల భాషలో ఉండేలా యువ రచయితలు నిలబడతారు. ప్రతి రచనలోనూ ప్రాపంచిక దృక్పథం ఉండాలి. గొంతులేని సామాన్య ప్రజానీకానికి ఉపయోగపడేలా రచనలు రావాలని, ఎక్కువ మంది అమ్మాయిలు రచనారంగం వైపు రావటం మంచి పరిణామం.

- కె.ఆనందాచారి, తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి

యూత్ ట్రెండ్ సెట్



యువ కవులకు కవిత్వం పట్ల అభిలాష ఉంది. మారుతున్న కాలంలోనూ కవిత్వం చెప్పడంలో యూత్ ట్రెండ్ సెట్ చేయడం సంతోషంగా ఉంది. యువ కవులు సొంత అనుభవాలను రాస్తూనే, సమాజ సమస్యలతో అనుసంధానం కావాలి. నవల, పాట, కవిత్వం, నాటకం, కథ తదితరాంశాల్లో నోటి మీద చెప్పగలిగే వారున్నారు. సాహిత్యంలో ఏ అంశంపైనైనా తమదైన ముద్ర యువత వేసుకుంటున్నారు. ఇది హర్షించదగ్గ పరిణామం.

- ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ కవి, రచయిత

ఇదిగో యువ సాహిత్యం



ఇది ఒక ప్రయోగం. ప్రయోజనకరమైన ప్రయోగం. తెలుగు నేలపై ఇది నిజంగా తొలి ప్రయత్నమే. యువ కలాలు తమ రచనలపై అంతరంగాన్ని ఆవిష్కరించారు. యువత ఎందులోనూ తీసిపోదు అని నిరూపించింది 'తెలంగాణ సాహితి - డివైఎఫ్ఐ' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ లిటరరీ ఫెస్ట్ -2024. తెలుగు నేలపై యువత సాహిత్య రంగంలో వెనుకబడి ఉంది. సాహిత్యం చదవడం లేదు. సాహిత్య సభలకు రావడం లేదు. యువత తమ సృజనపై సీరియస్‌గా లేరు అనే చర్చలు ఉండనే ఉన్నాయి. మరీ ముఖ్యంగా నలభై ఏండ్ల లోపు వారి రచనలు సీరియస్ ఉండటం లేదు అనే అపవాదు సైతం మోయాల్సి వచ్చింది. కానీ అక్టోబర్ 4,5 తేదీల్లో జరిగిన యూత్ లిటరరీ ఫెస్ట్ - 2024 అలాంటి అపోహలను తొలిగించే ప్రయత్నం చేసింది.


వర్తమాన సమాజం పట్ల నిబద్ధత, రాజకీయ పరిజ్ఞానం, ఉన్నది ఉన్నట్లు మాట్లాడే తత్వం ఇలా సాహిత్య సృజనకు సరిపడా సరంజామా అంతా యువత దగ్గర సిద్ధంగా ఉంది. వస్తు ఎంపిక, నిర్వహణలో సైతం కొత్తదనం సంతరించుకుంది. సాహిత్య రచనలోకి కొత్త కలాలు ప్రవేశంతో వస్తువులో, శిల్పంలో మార్పు వచ్చింది. వ్యక్తీకరణ నైపుణ్యాలు సైతం కొత్తదనాన్ని సంతరించుకుంటున్నాయి. యువ కలాల సృజనాత్మకత మట్టి పరిమళాలతో పులకిస్తుంది. కొత్త ప్రమేయాలు సరికొత్తగా ఆవిష్కరించబడుతున్నాయి. కానీ వారి నైపుణ్యాలను, ప్రతిభా పాటవాలను ప్రదర్శించడానికి సరైన వేదికలు ఉండటం లేదు. తమ వ్యక్తీకరణలో ఉండే లోపాలను సరిదిద్దే శిక్షణ కొరవడుతున్నది. ఫలితంగా సాహిత్య సృజనలోకి 'అ'సాహిత్యం ప్రవేశిస్తుంది.

మరి కొత్త కలాలకు, గళాలకు వేదిక ఇస్తున్న వారెందరున్నారు? అందుకే తెలంగాణ సాహితి ఒక అడుగు ముందుకేసి యువతనే వ్యక్తులుగా ఎంపిక చేసి వారి ద్వారా రచనా మెళకువలు పెంచుకునే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యం నుంచి వచ్చిన కొన్ని ఆలోచనల ఫలితంగానే మొదటిసారి యూత్ లిటరరీ ఫెస్ట్ జరిగింది. అరవై మంది యువ సృజనకారులు నవల, కథ, విమర్శ, పాట, కవిత్వంపై లోతైన విశ్లేషణ చేశారు. మరో వందమంది సృజనకారులు ఈ ఫెస్ట్ లో సామూహిక కవితా పఠనం, గానం చేశారు. కల్చరల్ ఫెస్ట్ సైతం ఆలోచింపజేసింది. ఇన్నిరకాల సాహిత్య సృజనకారులు ఈ వేదిక మీది నుంచి సారవంతమైన ఆలోచనలు పంచుకున్నారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఈ యూత్ లిటరరీ ఫెస్ట్ తొలి అడుగుగా చరిత్రలో నమోదవుతుంది.

ఆ ఒరవడిలో 4,5 అక్టోబర్ 2024న రెండు రోజుల పాటు జరిగిన యూత్ లిటరరీ ఫెస్ట్ వేదిక అయింది. లిటరరీ ఫెస్ట్ ఆలోచనకు, ప్రణాళికకు, ఆచరణకు తెలంగాణ సాహితి మూలధాతువు. దానికి డివైఎఫ్ఐ తోడై నిలిచింది. నిర్దిష్టంగా ఈ రెండు రోజులలో స్వీయ నవలా విశ్లేషణ, స్వీయ కథా విశ్లేషణ, విమర్శపై యువత అవగాహన, సినిమా పాటలపై లోతైన విశ్లేషణ, యువత కవిత్వతత్వం ఇలా ఐదు విభాగాలుగా లిటరరీ ఫెస్ట్ కొనసాగింది. తెలుగుభాష భవిష్యత్ మీద నిర్దుష్ట కార్యక్రమ రూపకల్పన ఈ సమావేశం ప్రధాన లక్ష్యం.

సమాజంలో అనేక తోవలు, కోవలు, పాయలు ఉంటాయి. ఎవరి మార్గంలో నడిచేవారు వారి బాటసారులతో సంభాషించుకోవాలి. అదే సమయంలో ఏదో కూడలిలో కలిసినప్పుడు, ఉమ్మడి ప్రయాణం గురించి, ప్రయాణపు ఉమ్మడితనం గురించి కూడా మాట్లాడుకోవాలి. భాషాసాంస్కృతిక అస్తిత్వం నుంచి చూసినప్పుడు తెలుగువారంతా ఒకటిగా బయటి ప్రపంచానికి కనిపించాలి. ఆ తపనతోనే యూత్ లిటరరీ ఫెస్ట్ నిర్వహించాం. ఈ కూడలిలో కలుసుకున్న యువ సాహిత్యకారులు తమ రచనలపై స్వీయ విశ్లేషణ చేయడం, ఒకరి రచనల గురించి మరొకరితో పంచుకోవడం చూస్తే సాహిత్యం సింగడేసిందా అన్నట్టు సాగింది ఈ యూత్ లిటరరీ ఫెస్ట్ - 2024.

- అనంతోజు మోహన్‌కృష్ణ, 88977 65417



తెలంగాణ సాహితి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అక్టోబర్ 4,5 తేదీల్లో జరిగిన 'యూత్ లిటరరీ ఫెస్ట్' ఓ కొత్త అనుభూతిని కలిగించింది. యువకవులు, రచయితలు తమ తమ అనుభవాలను, జ్ఞాపకాలను పంచుకోవడానికి ఓ వేదికనిచ్చింది. పాట, కవిత్వం, కథ, విమర్శ, నవల ప్రక్రియల్లో రచనలు చేస్తున్న ఎంతోమంది యువకవులకు, రచయితలకు అసలు సిసలైన చర్చావేదికలా నిలిచిందని చెప్పవచ్చు. ముఖ్యంగా నేను సభాధ్యక్షత వహించిన పాటల సెషన్‌లో నాతో పాటు పాల్గొన్న చాలామంది గీతరచయితలు తమ పాటల ప్రస్థానాన్ని గురించి చెప్పుకునే అవకాశం దొరికింది. వారి వారి సాధక బాధకాలను గురించి, సినీరంగంలో నేడు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి, సన్నివేశానికి అనుగుణంగా, బాణీకి తగ్గట్టుగా పాట రాయడానికి వారు పడే కష్టం గురించి.. ఇలా ఎన్నో విషయాలు ఒకరినొకరు పంచుకోవడానికి అవకాశాన్నిచ్చింది తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ ఇలా యువకవులతో, రచయితలతో కార్యక్రమాలు చేయడం వల్ల వాళ్ళలోని క్రియేటివిటీని వెలికితీయడానికి అవకాశముంటుంది. యూత్ కి తమ భావాలను స్వేచ్ఛగా వేదికపై వినిపించుకోవడానికి అవకాశముంటుంది.

- డా. తిరునగరి శరత్ చంద్ర, కవి, సినీగీతరచయిత



తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యూత్ ఫెస్ట్ ఎంతో మందిలో ఆలోచనను రేకెత్తించింది. కొత్తగా కవిత్వం, కథ, నవల, పాట రాసేవాళ్ళకు కావలసిన మెలకువలెన్నో నేర్పింది. నలభై సంవత్సరాల లోపు యువకులను వేదికకు పిలిచి వారి స్వీయ అనుభవాలను పంచుకోమని చెప్పి వారి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఈ ఫెస్ట్ లో భాగంగా కవిత్వ విభాగంలో నేను పాల్గొన్నాను. నా సాహితీ ప్రయాణాన్ని, నాకు తెలిసిన కవిత్వానుభవాలను పంచుకున్నాను. తోటి కవుల సాహితీ ప్రస్థానాన్ని తెలుసుకునే అవకాశం కలిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కథకులు, నవలాకారులు, విమర్శకులు, సినీ గీతరచయితల అనుభవాలను వినటమే కాకుండా ఆ మిత్రులందరిని కలుసుకునే అవకాశం కలిగింది. అన్ని ప్రక్రియల మీద సాధికారికంగా చర్చ జరిగింది. తెలిసిన విషయాలు పంచుకున్నాం. తెలియని విషయాలను ఎన్నో తెలుసుకున్నాం. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. యువకులకు మార్గదర్శనం చేయటంలో ఈ ఫెస్ట్ విజయవంతమయింది.

- తండ హరీష్, యువకవి, విమర్శకులు



మనకు తెలియని ఒక ఉద్వేగానికి గురైనప్పుడు రాసేదే కవిత్వం. వర్తమాన కవులు రాస్తున్న కవిత్వంపై ఒక పరిశీలన చేస్తే యువత ఉద్యమ కవిత్వం, సంఘటనాత్మక కవిత్వం, మైనారిటీ కవిత్వం, దళిత కవిత్వం, స్త్రీ వాద కవిత్వం ఇలా ఏ అంశంల నైనా తమదైన ముద్ర వేసుకుంటున్నారు. ఇలాంటి వేదికలు ఆ కృషిని మరింత బలోపేతం చేస్తాయని చెప్పడం అతిశయోక్తి కాదు.


- తగుళ్ళ గోపాల్,
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత



యువ కథకులు వాళ్ల కథ నేపథ్యాన్ని వివరిస్తూ కథ రాయడానికి ఎదురైన సందర్భాలను, తమ చుట్టూ వున్న సామాజిక విషయాలు అధ్యయనం చేయడం, ఇవన్నీ అందరితో పంచుకోవడం, వారి నుండి నేనూ నేర్చుకోవడం బాగుంది. ఇంత మంచి అవకాశం యువ కథా రచయితలకు ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్నందుకు తెలంగాణ సాహితీ టీంకి అభినందనలు.

- శ్రీ ఊహ, కథా రచయిత్రి

భాషా, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ, ఉద్యమ భావజాల వ్యాప్తికి నవల గొప్ప కాన్వాస్. ఈ నేల బిడ్డల అమరత్వాన్ని, గోసతో తండ్లాడిన బడుగు బతుకుల్ని, మట్టిమనుషుల తత్వాన్ని, ప్రేమను చిత్రికగట్టుటకు నవల ఒక వేదిక. నవల రాయడమంటే గిజిగాడు గూడు కట్టిన విధం, అవ్వ శిబ్బి అల్లిన రీతి. తెలంగాణలో సాకబోసిన అక్షర కన్నీళ్ళతో నవల ఊరబోనం అవుతుంది. అస్తిత్వాన్ని



కాపాడుకోడానికి, వృత్తికులాల ఉనికికి నవల రాయడం అవసరం. ప్రజలమనిషి నుండి పొత్తి దాకా తెలంగాణ నవలలు దారి పొడవునా అల్లబడిన చైతన్యపాఠాలు, మరిచిన త్యాగాలను రికార్డ్ చేసిన పతాకాలు. తెలంగాణ సాహితి నిర్వహించిన ప్రతీ కార్యక్రమంలో యువత భాగస్వామ్యం అత్యధికం. అది సముచితం. రెండు రోజుల లిటరరీ ఫెస్ట్ యువ రచయితలకు, కవులకు లభించిన అరుదైన ప్లాట్ ఫామ్. కొత్త రచనా దారికి ఇది వినూత్న పాదు. యువసృజనకు నాడీకేంద్రం. ఇదొక కార్యశాల, సాహితీకర్మాగారం.

- డా. నర్రా ప్రవీణ్ రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు,
నర్రా ఫౌండేషన్, తెలంగాణ తెలుగు పరిశోధక మండలి



ఈ తరం యువకులను, వారి సాహిత్యాన్ని, ఆ సాహిత్యం మీద చర్చాగోష్టిని ఒకే వేదిక మీద చూడటం చాలా సంతోషంగా అనిపించింది. అత్యంత కష్టసాధ్యమైన పనిని సఫలీకృతం చేసినందుకు నిర్వాహకులకు శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో సినీ గీత రచయితగా పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉంది.

- డా. మల్లెగోడ గంగా ప్రసాద్, సినీగీతరచయిత




ఏదో ఊహాలోకంలో ఉండి పట్టీ పట్టనట్లు ట్రాన్స్‌లో రాసేవి కాదు ఆ కథలు. పూర్తి హోష్‌లో ఉండి జోష్‌తో రాస్తుంది. తెలియని జీవితాలు, వాటి నేపథ్యాలు తెలియపర్చడం తన దృక్పథం. రచనలో చదువరులు లీనమై ఎక్కడో ఒక దగ్గర తమను తాము చూసుకోగలగాలి. సొంత గాథలను వినిపించే సాహసం చేయాలి అనేది నా ప్రగాఢ భావన.

- మానస ఎండ్లూరి



లిటరరీ ఫెస్ట్ కవులు, కళాకారులకు మంచి అనుభూతిని మిగిల్చిన సమ్మేళనం. పాటలపై స్వీయ విశ్లేషణలో పాల్గొనడం, మాట్లాడడం చాలా ఆనందాన్ని మిగిల్చిన సందర్భం. పాట రాయడం వెనుక ఉన్న అంతరంగాన్ని, రాసిన తర్వాత ఆ పాట ఒప్పించడానికి నడిపే తతంగాన్ని తెలియజేయడం ఈ సభలో ముఖ్య ఘట్టం. తత్కారాల మేళవింపులో, ఛీత్కారాల, అవమానాల భారాలను అధిగమించి పాటల పూదోటలు పూయిస్తున్న ఈ తరం సినీ గేయరచయితల అంతరంగాలను ఆవిష్కరించినందుకు తెలంగాణ సాహితికి అభినందనలు. **- నాగరాజు కువ్వారపు, సినీ గేయ రచయిత**



సినిమా అనగానే దర్శక, నిర్మాతల పేర్లే గుర్తు పెట్టుకుంటారు కాని గీతరచయితల పేర్లు గుర్తు పెట్టుకోకపోవడం ఒకింత బాధాకరం. సినిమాపాటలు రాస్తాం.. కాని విడుదలవ్వడానికి చాలా కాలం పడుతుంది.. సినీరంగంలో గుర్తుండిపోయే పాటలు రాసిన కవే నిలబడతాడు.

- కదలి సత్యనారాయణ, సినీగీతరచయిత



ఒక పాట సృష్టికి సంగీత దర్శకుని తర్వాత ముఖ్య భూమిక పోషించేది గేయ రచయిత. కానీ తను కనపడడు, వినపడడు. కేవలం యూట్యూబ్‌లో పేరు వరకే పరిమితమౌతాడు. అలాంటి గేయ రచయితలను ఒకచోట కలిపి, వాళ్ళనోట పాటగురించి, వాళ్ళకష్టాలు, అవమానాలు, ప్రశంశలు, విమర్శలు విజయాలు అందుకుంటున్న తీరు నలుగురితో పంచుకునే అవకాశం కల్పించడం గొప్ప విషయం. దీని వలన ఎందరో మిత్రులతో పరిచయాలు, ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు ఆత్మస్థైర్యం కూడా పెంపొందించుకునే అవకాశం కలిగింది. నిర్వాహకులకు ధన్యవాదాలు


- గడ్డం వీరు



సినిమాపాట అనగానే చాలామందికి చిన్న చూపు ఉంది. కాని సినిమా పాట రచన అనేది చాలా కష్టతరమైనది. అది అనుకున్నంత ఈజీ కాదు. ఎంతో కష్టపడి ప్రయాణం చేసేవాళ్ళకు సినిమాపరిశ్రమ ఎప్పుడూ స్వాగతం చెబుతుంది. నా అనుభవాలను పంచుకోవడానికి ఓ వేదికను కల్పించిన తెలంగాణ సాహితికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఎంతోమంది లబ్ధ ప్రతిష్ఠులతో కలిసి వేదికను పంచుకోవడం సంతోషంగా ఉంది. **- పూర్ణాచారి, సినీగీత రచయిత**



తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ యూత్ ఫెస్ట్-2024 చాలా బాగా జరిగింది. సాహిత్య కార్యక్రమాలు చాలా జరుగుతుంటాయి కానీ ఇందులో యూత్ కోసం యువతనే ముందుపెట్టి రెండు రోజుల పాటు వివిధ అంశాల (నవల, కథ, కవిత్వం, పాట, విమర్శ) మీద ఫెస్ట్ నిర్వహించడం సాహిత్య రంగంలో కొత్త సాంప్రదాయానికి నాంది. వారి వారి అంశాలను విశ్లేషించే వ్యక్తులతో పాటు, సభాధ్యక్షులు కూడా యువతే ఉండటం ఇక భవిష్యత్తు మీదే అని నిర్దేశించినట్టుగా ఉంది. దీని ద్వారా భవిష్యత్తులో ఎలాంటి కార్యక్రమాలు జరిగినా సభను సజావుగా నిర్వహించే వీలు ఉంటుంది. ఇందులో యువత ఎవరు రాసిన రచనల మీద వారే విశ్లేషణ చేయడం ద్వారా వారి రచనా నేపథ్యం, ఎలాంటి సందర్భంలో రాశారు, వేటిని ఆధారం చేసుకొని రాశారనే అంశాలు తెలిశాయి. కొత్తగా రేసేవారు, కొన్ని రాసి ఆగినవారికి ఈ ఫెస్ట్.. స్ఫూర్తి దాయకం. ఈ ఫెస్ట్ వల్ల వెంటనే ఫలితం కాకున్నా దీనిలో దీర్ఘకాలిక ప్రయోజనం దాగి ఉందని నా అభిప్రాయం. **- బద్ది గణేశ్, యువ కథా రచయిత**



విరామం లేని ప్రయత్నాలే యువ రచయితల విజయానికి సోపానాలు. సోషల్ మీడియా మీద అతిగా ఆధారపడొద్దు. ఏది మంచి ఏది చెడు అని విశ్లేషించుకోవాల్సిన అవసరం రచయితలపైన వుంది.

- నస్రీన్‌ఖాన్, ప్రముఖ రచయిత్రి




రచయితలు, కవులు తమ రచనల ద్వారా సమాజానికి మార్గ నిర్దేశం చేస్తారు. అందులో ఇంతమంది యువత వుండడం స్ఫూర్తిదాయకం. యువ తరచయితలను ప్రోత్సహించడంలో డివైఎఫ్ఐ సైతం ఎప్పుడూ ముందు వరుసలో వుంటుంది.

-అనగంటి వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి



తెలంగాణ సాహితీ, డివైఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహించిన యూత్ లిటరరీ ఫెస్ట్ యువ రచయితలకు ఎంతగానో తోడ్పడుతోంది. నవల, కథ, కవిత, పాట, విమర్శల్లో స్వీయ విశ్లేషణా కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఉపయోగకరం. కొత్తవారికి, ఇప్పటికే రాస్తున్న యువతకి రచనా నిర్వహణకి సంబంధించిన మెలకువలు, వస్తువు ఎంపిక చేసుకునే పద్ధతులు, నిర్వహణలో బిగువు, రచనకి దృక్పథం కలిగి ఉండాల్సిన అవసరం అర్థం చేయించేలా ఫెస్ట్ జరిగింది. సుమారు అరవై మందికి పైగా యువ సృజనకారులను ఒకే చోట పోగేసి మాట్లాడించించిన తీరు అద్భుతంగా అనిపించింది. దీనికి ప్రధానంగా కృషి చేసిన తెలంగాణ సాహితీ యువ సమన్వయకర్త అనంతోజు మోహన కృష్ణని అభినందించాల్సిందే. తెలంగాణ సాహితీ, డివైఎఫ్ఐ కి జేజేలు.

- ఎం. విప్లవకుమార్



సాహిత్య విమర్శ చాలా స్పష్టంగా ఉండాలి. వ్యక్తులను బట్టి విమర్శ ఉండదు. నిస్సందేహంగా రచనలపై భిన్న పార్శ్వాలు బయటకు రావాలి. అలా విమర్శ చేసినప్పుడే మంచి రచనలు బయటకు వస్తాయి. యువత తమ రచనలను మెరుగు పరుచుకోవడానికి ఇలాంటి చర్చలు నిరంతరం జరగాల్సిన అవసరం ఉంది.

- బందారి రాజ్ కుమార్, యువకవి, విమర్శకులు



యువత సాహిత్య అభిప్రాయాలు పంచుకోవడమే అరుదైన విషయం. అలాంటిది మా రచనలపై మాతోనే మాట్లాడించడం గొప్ప అనుభూతిని ఇచ్చింది. కొత్త రచయితలు తయారు కావడానికి ఇదొక మంచి వేదిక.

- మన్ ప్రీతమ్ కె.వి. యువ కథా రచయిత



కొత్త రచనలకు, కొత్త రచయితలకు చక్కని మార్గాన్ని సూచించే విధంగా ఉంది. కేవలం పెద్ద రచయితలకే కాకుండా నవతరానికి, వారి ఆలోచనలను ప్రపంచానికి చాటి చెప్పే విధంగా, వారి రచనలను మరింత మెరుగు పరుచుకునే అవకాశం కూడా ఉంటుంది. యువత సాహిత్యంలోకి రావాలంటూ వేదికల మీద చెప్తూ, యువత రచనల్లోని తప్పులను మాత్రమే వెలికి తీసి దానిని సరిదిద్దుకునేల చేయకుండా, వారు చేస్తున్న తప్పేంటో చెప్పకుండా ఉంటున్న తరుణంలో యువతకు మంచి ప్రోత్సాహంలా నిలిచింది తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ. ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు

- కెపి లక్ష్మీనరసింహ

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

- నాడు అవమాన భారంతో భార్య...
- అనాథలుగా మిగిలిన కుమారుడు, కుమార్తె..



నవతెలంగాణ-బోనకల్

మూడు నెలల క్రితం అవమానభారంతో భార్య ఆత్మహత్య చేసుకుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భర్త పది రోజుల క్రితం పురుగుమందు తాగాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రావినూతల గ్రామంలో చోటుచేసుకుంది. ఈ విషాద సంఘటనతో కుమారుడు, కుమార్తె అనాథలుగా మిగిలారు.

గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు సైదులు(45), రాధ భార్యాభర్తలు. వీరికి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమారుడు హేమంత్, ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కుమార్తె గౌతమి ఉన్నారు. ఈ క్రమంలో భార్య రాధపై భర్త సైదులు మూడు నెలల క్రితం ఆమెపై అనుమానం వ్యక్తం చేశాడు. దీంతో ఇద్దరి మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నట్లు తెలిసింది. తనను భర్త అనుమానించటంతో తీవ్ర మనస్థాపానికి గురైన రాధా మూడు నెలల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆ రోజు నుంచి సైదులు కూడా తీవ్ర మనస్థాపానికి గురై మద్యానికి బానిసగా మారాడు. భార్యను అనవసరంగా అనుమానించడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందనే బాధ సైదులలో ప్రతిరోజు కనిపిస్తుండేదని గ్రామస్తులు అంటున్నారు. దీంతో సైదులు తీవ్ర మనస్థాపనకు గురై పది రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. ఆ తర్వాత స్థానికుల గమనించి బంధువులు సమాచారం అందించడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లు బోనకల్ ఎస్సై కడగండ్ల మధుబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు నెలల క్రితం తల్లి... నేడు తండ్రి...

తల్లి చేబ్రోలు రాధ మూడు నెలల క్రితం ఆత్మహత్య చేసుకోవటం నేడు తండ్రి సైదులు కూడా ఆత్మహత్య చేసుకోవడంతో వారి పిల్లలు హేమంత్, గౌతమి అనాధలుగా మిగిలాయ్యారు. తండ్రి మృతదేహంపై కుమారుడు, కుమార్తె రోదిస్తున్న తీరు ప్రతి ఒక్కరిని కన్నీరు పెట్టించింది. ఈ హృదయ విషాద సంఘటన రావినూతల గ్రామస్తులందరినీ కలిచి వేసింది.




ట్రాక్టర్ మార్కెట్‌లోకి తొలి ఏసి కేబిన్ జాన్‌డీర్

నవతెలంగాణ- ఖమ్మం

జాన్ డీర్ కంపెనీ వారు తమ ట్రాక్టర్ కస్టమర్‌ల కోసం మొట్ట మొదటి సారిగా ట్రాక్టర్స్ మార్కెట్లో తొలి ఏసి క్యాబిన్‌తో సౌకర్యవంతమైన, పవర్ ఫుల్ ఇంజిన్‌తో జాన్‌డీర్ 5405 ఏసి పవర్ టెక్ ట్రాక్టర్‌ను అధీకృత డీలర్ వివిసి ట్రాక్టర్స్ ద్వారా ఖమ్మం మార్కెట్‌లోకి ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రమణమూర్తి మాట్లాడుతూ ట్రాక్టర్లు నడిపేటప్పుడు రైతులు, డ్రైవర్స్ అలసిపోకుండా పవర్ స్టీరింగ్, కంఫర్ట్ సీట్స్ అని ఎన్నో సదుపాయాలు వచ్చాయని, ఇప్పుడు జాన్ డీర్ వారు ఏసి క్యాబిన్ కూడా తీసుకురావడం సంతోషం అని అన్నారు. ముఖ్యంగా ట్రాక్టర్లు నడిపేటప్పుడు డ్రైవర్స్ చాలా జాగ్రత్తగా ఉండాలని, లైసెన్స్, ఇన్సూరెన్స్ కాగితాలు లేకుండా వాహనాలు నడపవద్దని కోరారు. అన్ని ముఖ్య కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు భారీగా చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా మొదటి ట్రాక్టర్‌ని వివిసి ట్రాక్టర్ కస్టమర్ మడుపల్లి గ్రామ నివాసి పగడాల శ్రీనివాసరావు కొనుగోలు చేశారు. వివిసి ట్రాక్టర్లు ఎమ్‌డి వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జాన్ డీర్‌లో ఉన్న ట్రాక్టర్లు దేనికదే పోటీ అని, అన్ని రకాల నేలకు అనుకువగా ఉండి, ఎక్కువ మైలేజ్‌తో, మెయింటెనెన్స్ తక్కువగా ఉండి రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటున్నాయని అన్నారు. తమ వివిసి ట్రాక్టర్స్‌కి తెలంగాణ వ్యాప్తంగా సుమారు 40 బ్రాంచెస్, 45 వేలు పైగా కస్టమర్స్ ఉన్నారని, రైతుల నమ్మకమే మా విజయమని అన్నారు. ఇప్పుడు ట్రాక్టర్ మార్కెట్లో తొలి ఏసి ట్రాక్టర్ జాన్ డీర్ 5405 ఏసి పవర్ టెక్ ట్రాక్టర్‌ను కూడా రైతులు ఆదరిస్తారని, తమ వివిసి ట్రాక్టర్స్ నమ్మకమని, ఎందుకంటే ఇది 63 హెచ్పీతో, 2100 ఆర్పిఎంతో పవర్ స్టీరింగ్‌తో , డీజిల్ ట్యాంక్ సుమారు 82 లీటర్ల కెపాసిటితో, 5 సంవత్సరాలు లేదా 5 వేల గంటల(ఏది ముందు ఐతే) వారంటీతో లభ్యమవుతుందని అన్నారు. తమ వివిసి ట్రాక్టర్లు తెలంగాణ వ్యాప్తంగా కొన్ని రోజుల క్రితం తమ అన్ని షోరూంలలో స్పెషల్ సర్వీస్ క్యాంపు నిర్వహించామని, దానికి మంచి స్పందన వచ్చినదని, కానీ క్యాంపునకు రాలేని కొంతమంది కస్టమర్లు కోరిక మేరకు మరల తమ అన్ని షోరూంలలో క్యాంపు నిర్వహిస్తామని, వివరాలకు దగ్గరలో ఉన్న తమ వివిసి ట్రాక్టర్స్ షోరూంలలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జాన్ డీర్ కంపెనీ ప్రతినిధులు, వివిసి ట్రాక్టర్స్ జనరల్ మేనేజర్, ఉద్యోగులు, రైతులు, వివిసి ట్రాక్టర్స్ కస్టమర్స్ పాల్గొన్నారు.

జిమ్ సెంటర్‌ను ప్రారంభించిన ఆర్జేసి కృష్ణ

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని గొల్లగూడెం రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫిట్ నెస్ హేవన్ జిమ్ సెంటర్‌ను డిసిసిబి మాజీ చైర్మన్ కురాకుల నాగభూషణం, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్‌లతో కలిసి ఎస్‌బిఐటి, ఆర్జేసి విద్యా సంస్థల అధినేత గుండాల కృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక దారుఢ్యంతో మానసిక దారుఢ్యం అనుసందానంగా ఉంటుందని, అందుకే ప్రతీ ఒక్కరూ శారీరక దారుఢ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిమ్ సెంటర్ ద్వారా ఆరోగ్యం పెంచుకోవాలని సూచించారు. ఈ జిమ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల పరికరాలు మన శరీరంలోని అణువణువును కదిలింప చేసి ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. జిమ్ సెంటర్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నిర్వాహకులు గుండాల అఖిల్ మట్లాడుతూ ఈ సెంటర్‌లో వ్యక్తిగత శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు.



మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

మొన్న వచ్చిన వరదల్లో కష్టపడి పని చేసిన మున్సిపల్ కార్మికులకు 35వ డివిజన్‌లో గరికపాటి వెంకట్రావు, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో సన్మానం చేసి దసరా పండగ సందర్భంగా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వరదలు వచ్చిన సందర్భంగా డివిజన్ మొత్తంలో ప్రతి ఇంట్లో నుండి బురద తొలగించడానికి మున్సిపాలిటీ కార్మికులు చాలా శ్రమించారన్నారు. ఇంట్లోకి చేరిన బురదను మొత్తం తొలగించడంలో మున్సిపల్ కార్మికులు ఎంతో కృషి చేశారని, వారి శ్రమ అభినందనీయమన్నారు. అదే విధంగా భవిష్యత్తులో కూడా ఎలాంటి అవసరం ఉన్నా డివిజన్ ప్రజలకు అలాగే సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తమ్మినేని రంగారావు, నల్లమల్ల శ్రీను, చలుమూరు శ్రీను, బాలిని శ్రీను, వల్లూరు పల్లి వెంకటరెడ్డి, చిట్టూరి బాబు, నల్లమల్ల గోపి, తోట ఉపేందర్, అయితగాని కృష్ణ, పులుసు సత్యం, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్య కారణంతో ....

వృద్ధ దంపతుల ఆత్మహత్య

నవతెలంగాణ-ఎర్రుపాలెం





ఎర్రుపాలెం గ్రామంలో శనివారం అనారోగ్య కారణాలతో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై పి.వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు రేమిడిచర్ల గ్రామానికి చెందిన వీరు ఎర్రుపా లెం గ్రామంలో నివాసం ఉంటున్నారు. సీనియర్ మండల కాంగ్రెస్ నాయకుడు, సొసైటీ మాజీ అధ్యక్షులు ధనేకుల సాంబశివరావు (72), భార్య ధనేకుల సరోజిని (65) వృద్ధ దంపతులు. అనారోగ్య కారణంగా ఇబ్బందులు పడుతున్నామని తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసిపెట్టి తమ స్వగృహంలో శనివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకు న్నారన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషాద సంఘటన పట్ల పలువురు రాజకీయ నాయకులు, గ్రామస్తులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టు దేశానికి ఆదర్శం కావాలి

- పాలశీతలీకరణ కేంద్రం ప్రారంభోత్సవం
- ఇందిరా మహిళా డెయిరీ అనే పేరు ప్రారంభోత్సవ శిలాఫలకంపై లేకపోవడంపై అధికారులపై ఆగ్రహం,
- ఆ శిలాఫలకాన్ని తొలగించి వేరే శిలాఫలకాన్ని పెట్టాలని ఆదేశం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-ఎర్రుపాలెం



రాష్ట్రంలోనే విజయదశమి రోజున ప్రారంభించిన ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టు విజయవంతమై దేశానికి ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం విశ్రాంతి ఉద్యోగుల భవనం పక్కన ఏర్పాటు చేసిన పాల డెయిరీని ప్రారంభించారు. పాల శీతలకరణ కేంద్రం ప్రారంభ శిలాఫలకంపై ఇందిరా మహిళా డైరీ అనే పేరు లేకపోవడంతో అధికారులపైన ఆగ్రహించారు. ఆ శిలాఫలకాన్ని తొలగించి వేరే శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి మాట్లాడుతూ మహిళలతో నిర్వహించే ఇందిరా మహిళా డెయిరీ పరిశ్రమను సందర్శించడానికి దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి అధికారులు, మహిళా సంఘాల సభ్యులు క్యూ కడుతారని అన్నారు. ఇందిరా మహిళ డెయిరీ ఏర్పాటుతో మధిర నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులను వ్యాపారవేత్తలుగా ప్రజాప్రభుత్వం తయారు చేయబోతున్నదని, మహిళలతో కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి ఇందిరా మహిళా డెయిరీని చాలా పకడ్బందీగా నిర్వహిస్తామని అన్నారు. పాల ఉత్పత్తి, పాల సేకరణ, పాల అమ్మకాల ద్వారా వచ్చే ప్రతి పైసా మహిళా సభ్యులకే చెందే విధంగా ప్రాజెక్టును రూపకల్పన చేశామని, పాల ఉత్పత్తి చేయడానికి నియోజకవర్గంలో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ప్రభుత్వం రెండు గేదెలను పంపిణీ చేస్తుందని, మండలంలో ఉన్న నిరుద్యోగులను ఎంపిక చేసుకొని వారికి కార్పొరేషన్‌లు ద్వారా రుణాలు ఇప్పించి గేదెలకు కావలసిన వరి గడ్డి, పచ్చి మేత, దాణాను ఇంటింటికి సరఫరా చేసే విధంగా ప్రణాళికలను రూపొందిస్తామని అన్నారు. పశువులకు కావలసిన మందులు పంపిణీ చేయడంతో పాటు అత్యవసర సమయాలలో పశువులకు వైద్య సేవలు అందించేందుకు ప్రతి మండలంలో అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి గేదెకు హెల్త్ కార్డు ఏర్పాటు చేయించి సక్రమంగా వైద్యం అందే విధంగా చర్యలు చేపడతామన్నారు. ధృఢమైన సంకల్పంతో మీరందరూ సమిష్టిగా పనిచేస్తే ఈ ప్రాజెక్టు విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు.

మధిర నియోజకవర్గంలోని 238 గ్రామ సంఘాలు 5884 స్వయం సహాయక సంఘాల గ్రూపులు, 61,409 మంది సభ్యులు ఏదో ఒక వ్యాపారం చేసే విధంగా వడ్డీ లేని రుణాలను ఇచ్చి ఆర్థికంగా నిలబెట్టడానికి ప్రజాప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రతి సంవత్సరం 20వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

కార్యక్రమంలో డిఆర్‌డిఓ సన్యాసయ్య, ఆర్డీవో గణేష్, తహసిల్దార్ మన్నే ఉషా శారద, ఎంపీడీవో సురేందర్, ఐకెపి ఎపిఎం వెంకటేశ్వర్లు, డిసిసిబి డైరెక్టర్ ఐలూరు వెంకటేశ్వర్‌రెడ్డి, పిసిసి సభ్యులు సేలం ప్రతాపరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సంబంధిత అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మృతికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సంతాపం

నవతెలంగాణ-ఖమ్మం

ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్, ప్రముఖ మేధావి డాక్టర్ జి.ఎన్.సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు.

90 శాతం అంగవైకల్యం వున్నా పట్టుదలతో ఉన్నత చదువులు చదివి సమాజంలో వున్న అసమానతలకు వ్యతిరేకంగా ప్రజల తరపున పోరాడారని అన్నారు. దళిత, గిరిజన, ఆదివాసి, వికలాంగుల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేసి అనేక మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్రమంగా 10 ఏండ్ల పాటు నాగపూర్ సెంట్రల్ జైల్లో నిర్బంధించిందని గుర్తు చేశారు. జైల్లో కనీస సౌకర్యాలు కల్పించలేదని, వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అనేక చట్టాలు చెప్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. అంగ వైకల్యం వున్న ఒక వికలాంగుణ్ణి వేధించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేసి జైలుకు పంపినా, ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా ప్రజల కోసం నిలబడ్డారన్నారు. జైల్లో అనేకసార్లు అనారోగ్యం బారిన పడినా కనీసం వైద్య సహాయం అందించలేదని, కేంద్ర ప్రభుత్వం, జైలు అధికారుల నిర్లక్ష్యం వల్లనే నేడు సాయిబాబా మృతి చెందారని అన్నారు. సాయిబాబా మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని స్పష్టం చేశారు. అత్యంత క్రూరంగా వ్యవహరించిన వారికి సైతం బెయిల్ లభించినప్పటికీ, సాయిబాబాకు బెయిల్ ఇవ్వకపోవడం ప్రభుత్వ కక్ష సాధింపుకు నిదర్శనమని అన్నారు. మేధావులను బందీలుగా మార్చటం ప్రజా చైతన్యాన్ని అడ్డుకోవడమేనన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించాలని నున్నా అన్నారు. సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నట్లు నున్నా తెలిపారు.

హక్కులను రక్షించుకునేందుకు పోరాటం చేద్దాం

నవతెలంగాణ- వేంసూరు

భవన నిర్మాణ కార్మిక రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందజేస్తున్న పథకాలను ప్రైవేటు రంగానికి అప్పగించే ఆలోచనలు ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి పిల్లి భాస్కర్ అన్నారు. ఆదివారం లక్ష్మీనారాయణపురం, కొత్తూరు గ్రామాలలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డును కాపాడుకునేందుకు కార్మికులందరూ ఐక్యంగా పోరాడి రక్షించుకుందామని, గత నెల రోజులుగా సర్వర్ పనిచేయకపోవడం మూలంగా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల నమోదుకు అవకాశాలు లేకుండా పోయాయని తమ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు పద్మ, రమ్య, లక్ష్మి, అనసూయ, కృష్ణవేణి, రాము, రామారావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులున్నారు.



శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ట శంకుస్థాపన

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణంలోని హనుమాన్‌నగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ట శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ పాల్గొన్నారు. ఎన్నో వందల సంవత్సరాల నాటి ఈ ఆలయాన్ని పునప్రతిష్టించడం అభినందనీయమన్నారు. ఆలయ నిర్మాణానికి స్థలాన్ని నరుకుళ్ల వెంకయ్య నరసమ్మ, నరుకుళ్ల రామయ్య, చిట్టెమ్మ ఇవ్వడం జరిగిందని వారి వారసులు నరుకుళ్ల సతయారాయణ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చల్లగుండ్ల నరసింహారావు, వందనపు సత్యనారాయణ (గ్యాస్), మొండెద్దు కృష్ణారెడ్డి (టెక్స్‌మో), నరుకుళ్ల శ్రీను, గాదె సురేశ్, కోనా శ్రీనివాసరావు, మిరియం సురేశ్, నరుకుళ్ల సత్యనారాయణ, చల్లగుళ్ల శ్రీనివాస్, చలసాని సాంబశివరావు, అద్దాల మీరా, హకీం, కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి పాల్గొన్నారు.

వీలైతే నాలుగు మాటలు....కుదిరితే కప్పు కాఫీ..!

- విజయదశమి వేళ నాయకుల ఇళ్లకు మంత్రి పొంగులేటి
- వారి కుటుంబ సభ్యులకు ఆప్యాయ పలకరింపు....
- మంత్రి రాకతో నాయకుల ఇళ్లల్లో అవధుల్లేని ఆనందం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



'వీలైతే నాలుగు మాటలు.... కుదిరితే కప్పు కాఫీ'ని స్వీకరిస్తూ శనివారం విజయదశమి పర్వదినం వేళ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలువురు నాయకుల ఇళ్లకు వెళ్లారు. సరదా కబుర్లు చెబుతూ ఆయా నాయకుల ఇళ్ళ వద్ద కాసేపు కాలక్షేపం చేశారు. పండుగ వేళ అనుకోని అతిథిగా శ్రీనివాసరెడ్డి రావడంతో నాయకులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆనందాలకు అవధులు లేవు. వారి కుటుంబ సభ్యుల్లోని ప్రతి ఒక్కరినీ పలరిస్తూ మంత్రి పొంగులేటి వారికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అశ్వారావుపేటలో కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆలపాటి రాము, వైరాలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బొర్రా రాజశేఖర్, ఖమ్మంరూరల్ మండలంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ధరావత్ రామ్మూర్తి నాయక్,. కూసుమంచి మండలంలో దండ్యాల లక్ష్మణరావు ఇంటికి వెళ్లి వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. పండుగ రోజు కుటుంబ సభ్యులతో కాకుండా ఆత్మీయ నాయకుల మధ్య మంత్రి గడపడంపై పలువురు ఆసక్తికరంగా చర్చించుకున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో ...వ్యక్తికి గాయాలు

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటనపై ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామానికి చెందిన బొడ్డు శ్రీను తన ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి ఖమ్మం వెళ్తుండగా మార్గమధ్యలో గుర్రాలపాడు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో శ్రీనుకి తీవ్ర గాయాలయ్యాయి.

రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆయుధపూజ

ప్రజల సోదరభావంతో మెలగాలి : ఇన్స్పెక్టర్ రాజు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయుధపూజ నిర్వహించారు. ఇన్స్పెక్టర్ రాజు, సిబ్బంది అంత కలిసి ఆయుధ పూజ నిర్వహించారు. తమ ఆయుధాలకు పని కల్పించవద్దని, నేరాల సంఖ్య తగ్గాలని, శాంతిభద్రతలు అదుపులో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా కులమతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలని పూజలు చేసినట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

శాతవాహన ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు కృషి


నవతెలంగాణ - బోనకల్

బోనకల్ రైల్వే స్టేషన్‌లో శాతవాహన ఎక్స్ ప్రెస్ నిలుపుదాలకు కృషి చేస్తానని బిజెపి రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద రావు మండల ప్రజలకు హామీ ఇచ్చారు. తాండ్ర వినోద్ రావు, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణతో కలిసి మండలంలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. మండలంలో సభ్యత్వ నమోదు గురుంచి వివిధ గ్రామాలలో పర్యటించి గ్రామ నాయకులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు వీరపనేని అప్పారావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు నాగేశ్వరావు, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు సురేష్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జంపాల రవికుమార్, యువ మోర్చా మండల అధ్యక్షులు కాలసాని పరశురామ్, మండల నాయకులు బోయినపల్లి గోపాల్, బోయినపల్లి సైదులు, భూక్య సైదా తదితరులు పాల్గొన్నారు..

ఇందిరమ్మ పాలనలోనూ దోపిడీ కొనసాగింపు

- ఐదేళ్లలో రోడ్డెక్కకుండా వేతనాలు ఎరగని మిషన్ భగీరథ కార్మికులు
- ఉద్యోగ భద్రత లేదు..ఉద్యోగోన్నతి ముచ్చట లేదు
- ఈఎస్ఐ జాడే లేదు..ప్రమాద బీమా ఊసే లేదు
- ప్రభుత్వం మారినా వెతలు మారని భగీరథ కార్మికుల గోడు


నవతెలంగాణ-వైరా



రాష్ట్రంలో మిషన్ భగీరథ ప్రారంభమై గత నెల 18వ తేదీ నాటికి ఐదేళ్లు నిండినవి. బిఆర్ఎస్ ప్రభుత్వం తన మానస పుత్రికగా చెప్పుకుని వేల కోట్ల రూపాయల వ్యయంతో ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇచ్చే ఉద్దేశంతో నిర్మించిన మిషన్ భగీరథకు నిర్మాణ సంస్థలు ఎన్ని ఉన్నా దాని నిర్వహణలో మాత్రం కార్మికులదే కీలక పాత్ర. రాష్ట్రంలో భగీరథ ప్రాజెక్టులో 18 వేల మంది స్కిల్డ్, అన్ స్కిల్డ్, సేమీ స్కిల్డ్ కార్మికులు, 3 వేల మంది సూపర్ వైజర్లు పని చేస్తున్నారు. గత ఐదేళ్లలో ఏ ఒక్క నెల కూడా అందరి ఉద్యోగుల్లా మొదటి వారంలో వేతనాలు అందుకోలేని దయనీయ స్థితి. కార్మికులు రోడ్డెక్కందే, స్కీంలు బంద్ చేయందే, వందల, వేల గ్రామాల ప్రజలను ఇబ్బందికి గురి చేయకుండా వేతనాలు పొందలేదని కార్మికులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథను వివిధ నిర్మాణ సంస్థలచే నిర్మించింది. ఆ తర్వాత ఐదేళ్ల వారంటీతో నిర్వహణ బాధ్యతలను కూడా నిర్మాణ సంస్థలకే అప్పగించింది. నిర్మాణ సంస్థ ల్లో సింహ భాగం లార్సో అండ్ టర్బో (ఎల్అండ్‌టి), నాగార్జునా కనస్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సిసి) లదే. కంపెనీ స్థాయిని బట్టి కార్మికులు కూడా పై రెండు సంస్థలలోనే ఎక్కువ మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో ఎల్‌అండ్‌టి, ఎన్‌సిసి, గజా, ఎస్‌కె ఎలక్ట్రికల్ కంపెనీలు మిషన్ భగీరథ స్కీంను నిర్వహిస్తుండగా రాష్ట్రంలోపై కంపెనీలతో పాటు మెగా, కోయా, చందమామ, పివిఆర్, రాఘవ ఇలా మొత్తం 15 కంపెనీలు నిర్వహిస్తున్నవి. వీటిలో పని చేస్తున్న సుమారు 18 వేల మంది కార్మికులకు, 3 వేల మంది సూపర్వైజర్లకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు ఇస్తున్నా వాటిని పైన పేర్కొన్న నిర్వహణ సంస్థలకు చెల్లిస్తుంది. ఆ సంస్థలు కార్మికులకు ఆయా కంపెనీలు నిర్ణయించిన ప్రకారం వేతనాలు చెల్లిస్తుంది. ఎల్అండ్‌టి ప్రతి కార్మికుడికి రూ.10,500లు, సూపర్ వైజర్లకు రూ15,000లు ఇస్తున్నారు. ఈ సంస్థ మాత్రమే ఓటికి డబుల్ మస్టర్, జాతీయ పండగలకు సెలవు దినాలలో నాలుగు రోజుల వేతనం ఇస్తుంది. ఇవన్నీ కలిపితే రూ.14,500 రూపాయలు వస్తున్నవి. మిగిలిన ఏ సంస్థా ఇవి కూడా ఇవ్వటం లేదు. ప్రభుత్వం మారినా దోపిడీ మారలేదు.....రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల ఒక్కొక్కరికి ప్రతి నెలా 18 వేల నుండి 26 వేల రూపాయలు వేతనంగా చెలిస్తున్నా, కంపెనీలు కార్మికుల కడుపులు కొడుతూ 10,500, 9వేలు ఇస్తున్నవి. కార్మికులకు ఆయా కంపెనీలు పిఎఫ్ 2000 చెల్లించాల్సి ఉండగా కొన్ని కంపెనీలు కేవలం 900 రూపాయలు మాత్రమే ఇస్తున్నవి. ఎల్అండ్‌టి మాత్రం 2000 రూపాయలు పిఎఫ్ కడుతున్నట్లు తెలిసింది. సబ్‌స్టేషన్‌లలో పని చేస్తున్న ఆపరేటర్లకు ఎస్‌కె ఎలక్ట్రికల్ రూ 9వేలు, 10వేల రూపాయలు ఇస్తున్నది. కార్మికులకు ఓటి కూడా ఇవ్వటం లేదు. మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులు అందరూ ఒకే రకం పని, ఒకే సమయం పనిచేస్తున్నా కంపెనీలు రకరకాలుగా వేతనాలు చెల్లిస్తున్నవి. ఇలా ప్రభుత్వం నుండి కార్మికుల వేతనం పేరుతో కంపెనీలు పొందుతున్న సొమ్ము ఒకటి, కార్మికులకు ఇస్తున్నది మరొకటి. రాష్ట్రంలో 18వేల మంది కార్మికులకు ప్రతి నెలా ఒక్కొక్కరికీ 6వేల రూపాయలు కోత విధించి ఇస్తున్నవి అంటే 18వేల మంది నుండి పదికోట్ల ఎనభై లక్షల రూపాయలను కంపెనీలు దోచుకుంటున్నవి. అంతే గాక రాష్ట్రంలోని 3 వేల మంది సూపర్ వైజర్లకు 30 వేలకు గాను 15 వేలు ఇస్తున్నారు. వీరి నుండి.నాలుగు కోట్ల యాభై లక్షలు దోచుకుంటున్నవి. భగీరథ ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికీ ప్రవేట్ సంస్థల దోపిడీకి కార్మికులను అప్పగించి చోద్యం చూస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ భద్రత లేదని, ప్రమాద భద్రత లేదని, రక్షణ పరికరాలు లేవని విమర్శిస్తున్నారు. ఉద్యోగ భద్రత విషయమై సిఐటియు ఆధ్వర్యంలో నాలుగైదు సార్లు ఈఎన్‌సి కార్యాలయం ముట్టడించినా అధికారుల్లో స్పందన లేదనే విమర్శలు ఉన్నవి. సిఐటియుతో పాటు ఖమ్మం, నల్లగొండ జిల్లాలోని బిఆర్‌కెవి, నూతనముగా ఖమ్మం జిల్లాలో ఐఎన్‌టియుసి ఏర్పాటైంది. యూనియన్లన్నీ గత గురువారం మూడు నెలల పెండింగ్ వేతనాల కోసం వైరా ప్రాజెక్టు వద్ద గల భగీరథ హెడ్ రెగ్యులేటర్ వద్ద ధర్నా నిర్వహించి ఆకస్మిక సమ్మెకు దిగి జిల్లాలో మొత్తం స్కీంను నిలిపివేశారు. సుమారు 600 మంది కార్మికుల సమ్మెతో జిల్లాలో నీటి సరఫరా నిలిచిపోయింది. ముగ్గురు మంత్రులున్న జిల్లాలో నీటి సరఫరా నిలిచిపోవటంతో అధికారులు ఉరుకులు పెడుతూ యూనియన్లను చర్చలకు పిలిచి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సమక్షంలో చర్చించారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలలో ఒక నెల వేతనం ఈ నెల 16న చెల్లిస్తామని, నవంబర్ 10న, నవంబర్ 30న మిగిలిన నెలలకు వేతనం చెల్లిస్తామని మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివం, ఎల్అండ్‌టి మేనేజర్ టిఎల్‌కె రెడ్డి హామీ ఇవ్వటంతో కార్మికులు శుక్రవారం సాయంత్రం సమ్మె విరమించారు. ప్రతినెలా 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని ఒప్పందం ఉన్నా నెలల తరబడి వేతనాలు పెండింగ్ పెట్టి కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక వేతనాలు పొందటానికి కార్మికులు రోడ్డెక్కకుండా, స్కీంలు బంద్ చేయకుండా వేతనాలు పొందలేకపోతున్నట్లు వాపోతున్నారు.

నెలల తరబడి పెండింగ్‌లో వేతనాలు

పాపగంటి రాంబాబు, మిషన్ భగీరథ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి



ఒప్పందం ప్రకారం ప్రతినెలా 7వ తేదీ లోపు వేతనాలు ఇవ్వరు. నెలల తరబడి వేతనాలు పెండింగ్ పెడతారు. గత్యంతరం లేక సమ్మెకు దిగవలసిన పరిస్థితులు మిషన్ భగీరథ నిర్వహణ కంపెనీలే కల్పించి కార్మికులను, జిల్లా లో మంచినీటి వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఐదేళ్లుగా నిత్యావసర వస్తువుల రేట్లు ఎన్ని సార్లు పెరిగినా రెట్లకనుగుణంగా. వేతనాలను రివైజ్ చేయటం లేదు. కనీస వేతనాలు అమలు చేయాల్సిన ప్రభుత్వాలు వాటిని అసలు పట్టించుకోవటం లేదు. పెరిగిన రేట్ల ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నాను.



పటిష్ట ఏర్పాట్లతో నిమజ్జనం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

మున్నేరు ఘాట్ వద్ద దుర్గ భవాని అమ్మవారి నిమజ్జనం కోసం క్రేన్లు, స్విమ్మర్లను ఏర్పాటు చేసి ప్రజల భద్రత కోసం బార్గెట్లను ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు నిర్వహించారు. రాత్రి సమయంలో ఇబ్బంది పడకుండా ఫ్లడ్ లైటులను ఏర్పాటు చేసి పారిశుధ్య ట్రాక్టర్లు, సిబ్బందిని పెట్టి నిమజ్జనం ఏర్పాట్లు పూర్తిచేశారు. నిమజ్జనం ఏర్పాట్లను ఇంజనీరింగ్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిమజ్జనం ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు.

పడకంటి మురళికి మాతృవియోగం

- నివాళులర్పించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-మధిర





సీపీఐ(ఎం) నాయకులు, సీఐటీయూ జిల్లా నాయకులు పడకంటి మురళి తల్లి సత్యవతి(65) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. సత్యవతి అంత్యక్రియలు వారి స్వగృహం వేంసూర్ మండలం అడవి రామన్నపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మధిర నాయకులు శీలం నరసింహారావు, మందా సైదులు, తేలప్రోలు రాధాకృష్ణ, డీ.వీరయ్య, వడ్రాణపు మధు, నాయుడు శ్రీరాములు, విల్సన్, చంద్రశేఖర్ తదితరులు సత్యవతి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎగుమతి, దిగుమతి పనులు లోకల్ వాళ్ళకే ఇవ్వాలి

- కార్మికులకు అండగా సీఐటీయూ
- రాష్ట్ర నాయకులు యర్రా శ్రీ కాంత్

నవతెలంగాణ-చింతకాని



పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు డంపింగ్ ఎగుమతి దిగుమతి చేసుకునే విధంగా అభివృద్ధి చెందుతున్న దశలో పనులు లోకల్ వాళ్ళకే ఇవ్వాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఖమ్మం నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్‌లో పని చేసే వాళ్ళు ఇక్కడకు పనికోసం వస్తున్నారని, ఇక్కడ లోకల్ వాళ్ళం ఉన్నామని, స్థానికులమైన రామకృష్ణాపురం, పందిళ్ళపల్లి, గాంధీనగర్, బస్వాపురం, లచ్చగూడెం గ్రామాల వాళ్ళు మిరియాల నరసింహారావు ఆధ్వర్యంలో హమాలీ సంఘంగా ఏర్పడ్డారు. దసరా పండుగను పురస్కరించుకుని పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్ వద్ద సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, భూక్యా శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ కార్మికులకు అండగా ఎప్పుడూ సీఐటీయూ ఉంటుందని తెలిపారు. కార్మికుల సమస్యల కోసం, కార్మికుల పిల్లలు భవిష్యత్తు కోసం, కుటుంబాలకు అండగా, రాజకీయాలకు అతీతంగా గ్రామాల ప్రజలు ఉండాలని, కార్మికులంతా ఐక్యంగా ఉండి పోరాటం చేసి లోకల్ వాళ్ళు సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు, సీపీఐ(ఎం) చింతకాని మండల కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వత్సవాయి జానకీరాములు, గండారపు రామారావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



వస్త్రాలను పంపిణీ చేసిన ఎంపీ వద్దిరాజు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

దసరా పర్వదినాన బాబా వారు సమాధి అయిన రోజు సందర్భంగా గాంధీచౌక్ శ్రీ వరప్రదాత షిర్డిసాయి బాబా మందిరంలో పేదలకు చీరలు, లుంగిలు, టవల్‌లు ఎంపీ వద్దిరాజు రవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, అర్వపల్లి నిరంజన్, కురువెళ్ళ వెంకట జగన్‌మోహన్‌రావు, పీవీడీ ప్రసాద్, కాకరపర్తి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలో సెప్టిక్ ట్యాంక్ వెస్ట్

- వరి పంటకు నష్టం.. రైతు ఆందోళన

నవతెలంగాణ-కల్లూరు



పంట పొలాల్లో సెప్టిక్ ట్యాంక్ వెస్ట్‌ని గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన సంఘటన మండల పరిధిలో జరిగింది. మండలంలోని పేరువంచ గ్రామ పంచాయితీ చిల్లంపల్లి చెరువు ఆయకట్టు ఆర్ అండ్ బి రోడ్డు పక్కన బడుగు వెంకటేశ్వర్ రావు అనే రైతు ఇచ్చిన వివరాల ప్రకారం.. బడుగు వెంకటేశ్వరరావు అనే రైతు వ్యవసాయ భూమి ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే అనుకుని ఉంది. దానిలో వరి పంట వేశారు. వరి పొలంలో గుర్తు తెలియని సెప్టిక్ క్లీనర్ ట్యాంకర్ వాళ్ళు డస్ట్‌ని పంట పొలాలో వదిలి పంటను కలుషితం చేశారు. దీంతో పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్ట పడి పెట్టుబడి పెట్టి చేతికి వస్తున్న పంటను సెప్టిక్ ట్యాంకర్ వాళ్ళు పంట పొలాలలో వదిలి వెళ్లే వ్యర్థల వల్ల వరి పంట ఎండి పోతున్న వైనం గతంలో కూడా జరిగింది. ఇలా చేస్తే పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించి తగు చర్యలు తీసుకున్నారు ఐనా తంతూ మారడం లేదు. రోడ్డు పైన వెళుతున్న ప్రయాణికులకు సైతం దుర్గం ఇబ్బంది పెడుతుంది. ముఖ్యంగా ఆ పరిసరాల రైతులు ఇబ్బందులు అంతా ఇంత కాదు అని రైతులు తెలియచేస్తున్నారు. పంచాయతీ అధికారులు, ఎంపీడీఓ, పోలీస్, రెవిన్యూ వారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

నిశ్చయ తాంబూలాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని కేశపురం గ్రామంకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నంశెట్టి శ్రీనివాసరావు కుమారుడు కృష్ణకాంత్, దివ్య నిశ్చయ తాంబూలాల కార్యక్రమం ఆదివారం అంకమ్మ తల్లి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాప సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గర రఘుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కట్టి కిరణ్, బీసీ సెల్ వేంసూర్ మండల అధ్యక్షులు తోట సత్యనారాయణ, కాపా మహేష్, దుగ్గి దేవర రవీంద్ర, షేక్ జమాల్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు ఆహ్వానం

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని గంగాదేవి పాడు సహకార సంఘం నూతన భవన ప్రారంభోత్సవానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయిని సొసైటీ చైర్మెన్ తూము వీరభద్ర రావు ఆదివారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కలకొడుమ సహకార బ్యాంక్ చైర్మెన్ దిరిశాల నరసింహారావు, తల్లాడ సొసైటీ మాజీ చైర్మెన్ దున్నటి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ కోటరు శరత్, లక్ష్మీనారాయణ, తెలుగు మాటి రమేష్, దొండపు ఆంజనేయులు, తూము నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

19 న బాలికల ఖో ఖో పోటీలు

నవతెలంగాణ-కల్లూరు

ఉమ్మడి జిల్లా స్థాయి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలికలకు ఈనెల 19న ఖో ఖో పోటీలు కల్లూరులోని మినీ స్టేడియం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డివైఈవో రవి బాబు, కుతుం బాక శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ గౌట్ జూనియర్ కాలేజ్ కల్లూరు అండర్ 19 ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎండీ.మూసా కలీం, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపికలు నిర్వహణ కార్యదర్శి పసుపులేటి వీర రాఘవయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతూ 01/01/2008 తరువాత జన్మించి వారు అర్హులని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న వారు, ప్రభుత్వ గుర్తింపు పొందిన జూనియర్ కళాశాలలో చదువుతున్న వారు, కేజీబీవీ జూనియర్ కాలేజ్, ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్, సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్, మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే ఈ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న బాలికలకు మాత్రమే నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. బాలికలు ఎస్ఎస్సి మెమో, షార్ట్ ఆర్ లాంగ్, బోనఫైడ్ సర్టిఫికెట్ అట్టేషటెడ్ బై ప్రిన్సిపాల్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని 19 న 9 గంటలకు హాజరు కావాలి కోరారు.

ఈశ్వర్ జ్యూలర్స్ ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని రోటరీ నగర్ పెరుమాళ్ళ పెట్రోల్ బంక్ ప్రక్కన ఈశ్వర్ జువెల్లర్స్ వెండి, బంగారు డైమండ్స్ ఆభరణాల షోరూంని తెలంగాణ పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షులు, 16వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి దంపతులు, 12వ కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీ నాగేశ్వరరావు దంపతులు కలిసి ఆదివారం ప్రారంభించారు .ఈ సందర్భంగా కమర్తపు మురళి మాట్లాడుతూ ఈశ్వర్ జువెల్లర్స్‌లో వెండి, బంగారం, డైమండ్స్ ఆభరణాలు మంచి నాణ్యత కలిగి కొత్త కొత్త మోడల్స్ ఉన్నాయని, అంతేకాక వీరు మంచి మంచి స్కీమ్స్ పెట్టారని, ఈ సదవకాశాన్ని ఖమ్మం ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షోరూం ప్రొప్రైటర్ తురికేపల్లి సుజాత, తురికేపల్లి లత, శరబలింగం, గుండారపు రమ్య, గూడూరు వరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నెలనెలా వైద్య శిబిరం విజయవంతం

- 151 మంది రోగులకు వైద్య సేవలు

నవతెలంగాణ-నేలకొండపల్లి



సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన 22వ నెల నెల వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 151 మంది రోగులకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో షుగర్, బీపీ, చెవి ముక్కు గొంతు సమస్యలకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. నెలకు సరిపడా మందులను కేవలం 100 రూపాయలకే అందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కొల్లి అనుదీప్(ఎండి జనరల్ మెడిసిన్), డాక్టర్ హస్నద్ బాబా (ఎంబీబీఎస్) చెవి ముక్కు గొంతు సమస్యల రోగులకు వైద్య సేవలు అందించారు. 95 మంది బిపి షుగర్ వ్యాధులకు ఎనిమిది మంది రోగులకు చెవి ముక్కు గొంతు సమస్యలకు 48 మందికి ఖమ్మం శరత్ మాక్స్ విజన్ వారిచే కంటి సమస్యలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎన్జీఆర్ ఫౌండేషన్ కన్వీనర్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ నెల నెల వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరానికి కూడా అధిక సంఖ్యలో హాజరయ్యారన్నారు. సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలను కూడా విస్తృతంగా చేపట్టాలనే లక్ష్యంతో ప్రతి నెల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో వీటికి అనుబంధంగా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వైద్య శిబిరానికి విరాళాలు అందించిన దాతలు, సహకరించిన సిబ్బంది, వాలంటీర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి నెల రెండవ ఆదివారం షుగర్ బిపి జనరల్ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలకు బీపీ చెకప్, మాత్రలు వేసుకునే విధానంలో సేవలందించిన గ్రామీణ వైద్యులు బండి పుష్పలత, బండారుపల్లి నాగేశ్వరరావు, డాక్టర్ తానిషా వసుంధర ఒకేషనల్ విద్యార్థులకు, ఎన్జీఆర్ ఫౌండేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఆర్ ఫౌండేషన్ సభ్యులు కెవి.రామిరెడ్డి, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, మారుతి కొండలరావు, వల్లంచట్ల భాస్కరరావు, కొంగర నారాయణరావు, చెరువు నరసింహారావు, డి. సుధాకర్, వాలంటీర్లు షేక్ అబ్దుల్, షేక్ రహీం, డి.నాగేశ్వరరావు, ఎస్‌కె.జమాల్, మంకెనపల్లి నరసింహారావు, దండా సూర్యనారాయణ, దండా సైదారావు, వల్లంచెట్ల భాస్కరరావు, సామల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి అంత్యక్రియలు చేసిన తనయ

నవతెలంగాణ-కల్లూరు



అంబేద్కర్ నగర్‌కు చెందిన ఖమ్మం వాసి, సీపీఐ(ఎం) సాను భూతిపరుడు దామాల ప్రేమ్ గుండెపోటుతో శనివారం రాత్రి హైదరాబాదులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రేమ్ మృతదేహాన్ని ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామం కల్లూరు తీసుకొచ్చారు. బంధువులు, స్నేహితులు కడసారి సందర్శించారు. అనంతరం ఆయన కుమార్తె ఆహలి తండ్రికి అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఐ(ఎం) కల్లూరు టౌన్ కార్యదర్శి గంపల శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని కప్పల బంధం గ్రామానికి ప్రభుత్వ పాఠశాలలో 1957-2024 వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సుమారు 67 సంవత్సరాల పాటు ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించి వివిధ హోదాలలో పూర్వ విద్యార్థులందరూ ఒకచోటకు చేరి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సమ్మేళన కార్యక్రమానికి చేయూతనిచ్చిన పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్త కర్నాటి వెంకటరెడ్డి, గురుకుల విద్యాలయాల సంస్థ విశ్రాంత జాయింట్ సెక్రెటరీ ఎం.పుల్లయ్య, పూర్వ విద్యార్థులు ఎస్‌కే.ఇస్మాయిల్, కర్నాటి అప్పిరెడ్డి, జయబాబురెడ్డి, జే.కృష్ణారెడ్డి, తలపురెడ్డి రత్నాల రెడ్డి, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం



విజయదశమి పండుగ సందర్భంగా ఖమ్మం నగర యువజన విభాగ ఉపాధ్యక్షుడు బలుస మురళీకృష్ణ 52వ డివిజన్ పారిశుధ్య కార్మికులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ బుర్రి వెంకట్, బలుసు మురళీకృష్ణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను అభినందించారు. ఎండనక, వాననక శ్రమిస్తూ ప్రజలందరినీ సురక్షితంగా, నగరాన్ని శుభ్రపరుస్తూ రోజు తెల్లవారకముందే విధుల్లోకి వచ్చి చెత్తాచెదారాలను తొలగిస్తున్న పారిశుద్ధ కార్మికుల సేవలు ఎన్నటికీ మరువలేనివి అన్నారు. వారికి మున్ముందు కూడా అండగా ఉంటామని తెలిపారు.

మండల కేంద్రంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- బస్టాండుకు బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి
- బోనకల్ స్టేషన్‌ను ప్రత్యేక పంచాయతీ చేయాలి

నవతెలంగాణ-బోనకల్



బోనకల్ మండల కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బస్టాండ్‌కు బస్సులు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, బోనకల్ స్టేషన్‌ను ప్రత్యేక పంచాయతీగా చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను టిడిపి నాయకులు కోరారు. మధిర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనటానికి శనివారం వచ్చిన తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను శనివారం బోనకల్ మండల తెలుగుదేశం నాయకులు కలసి పలు సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో మూడో రైల్వే లైన్ నిర్మాణం జరుగుతుండటంతో ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, ప్రజల సౌకర్యార్థం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, గత కొన్ని రోజులుగా బస్టాండ్ కు బస్సులు రావడం లేదని, బస్టాండ్ కి బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, రావినూతల గ్రామంలోని వాగు వద్ద నుంచి రైల్వే గేటు వద్ద ఉన్న ట్యాంకు వరకు నూతన మిషన్ భగీరథ పైప్ లైన్ ను ఏర్పాటు చేయాలని, రావినూతల11,12వ వార్డులు, బోనకల్ గ్రామపంచాయతీ లో గల 11, 12 వార్డులను కలిపి బోనకల్ స్టేషన్ నూతన గ్రామ పంచాయతీ గా ఏర్పాటు చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు. దీంతో మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు తెలుగుదేశం మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ తెలిపారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో టిడిపి జిల్లా కార్యదర్శి సాదినేని హనుమంతరావు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి మైనేని రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



- టీజీఈజేఏసీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఖమ్మం

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టిజిఈజేఏసి ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని టిఎన్జీవోస్ భవన్‌లో జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ కో - కన్వీనర్ కొనిదెన శ్రీనివాస్ అధ్యక్షతన తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ అండ్ పెన్షనర్స్ (టిజిఈజేఏసి) ఖమ్మం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా జేఏసీ పునర్ నిర్మాణం గురించి చర్చించడం జరిగిందని, దానితో పాటు ఉద్యోగులకి పెండింగ్లో ఉన్న డిఏలు పిఆర్సి, హెల్త్ కార్డుల, పలు సమస్యలపై గురించి చర్చించామని తెలిపారు. ఈ సమావేశంలో టిజిఈజేఏసి రాష్ట్ర కమిటీ వైస్ చైర్మెన్ అండ్ ఎస్‌టియు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు, పిఆర్టియు యూనియన్ అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాయల నరసింహారావు, యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జీవి.నాగమల్లేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు దొడ్డ పుల్లయ్య తెలంగాణ పిఆర్టియు అధ్యక్షులు కొమ్మినేని అనిల్ కుమార్, ఎం.సురేష్ కుమార్, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మామునూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు విప్లవ జోహార్లు



నవతెలంగాణ-ఖమ్మం

అట్టడుగు వర్గాల ప్రియతమ నేత ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఆదివారం నగరంలోని లెనిన్‌నగర్‌లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో సాయి బాబా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాముల మోహన్‌రావు మాట్లాడారు. అనేక దశాబ్దాలుగా పీడిత వర్గాల హక్కుల కోసం పోరాడిన విప్లవ మేధావి ప్రొఫెసర్ సాయిబాబా మరణం భారత దేశ విప్లవోద్యమానికి తీరని లోటు అన్నారు. సాయి బాబా ఆశయాలను కొనసాగించడమే తనకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు చిర్రా రవి, పీడీఎస్‌యూ మాజీ నాయకులు భోగగిరి, న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు వివి.రావు, చప్పిడి వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్, అధ్యక్షులు క్రాంతి, ఐఎఫ్టియు మాజీ నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో...

ప్రొఫెసర్ సాయిబాబా శాస్త్ర చికిత్స కోసం హైదరాబాదులో నిమ్స్ హాస్పటల్లో గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం దేశానికి, పౌరులకు, ఆదివాసులకు, దళితులకు, మైనారిటీలకు, పేద వర్గాలకు, కార్మిక వర్గానికి తీరని నష్టమని, ఆయన మృతికి "సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.



సీపీఐ ఆధ్వర్యంలో..

ప్రముఖ మేధావి, ప్రొఫెసర్ సాయిబాబా మృతిపట్ల భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిశ్చితార్థంలో పాల్గొన్న సీపీఐ(ఎం), కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తల్లాడ



సీపీఐ(ఎం) మండల నాయకులు గుంటుపల్లి వెంకటయ్య కుమారుడు భాను సాయి నిశ్చితార్థ వేడుకలు ఆదివారం చెన్నూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం), కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆశీర్వదించారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అయిన రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, పులి వెంకట నరసయ్య, పొన్నం కృష్ణయ్య, కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ పోరాట పాట ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం

పీడీఎస్‌యూ 50 ఏండ్ల సందర్భంగా పీడీఎస్‌యూ పోరాట చరిత్ర పై ప్రముఖ ప్రజా రచయిత కోమిరా వెంకన్న రాసిన పాటను ఆదివారం ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు నాగన్న, కాకి భాస్కర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల అశోక్, రాయల రవి కుమార్, మనోహర్, విజయ్, సుగుణ రావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, ప్రస్తుత పిడిఎస్‌యూ తెలంగాణా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంపటి పృథ్వి, మాజీ రాష్ట్ర కోశాధికారి మంద సురేష్, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో ఉద్యోగాలు.. సన్మానించిన సొసైటీ చైర్మెన్ తుపాకుల

నవతెలంగాణ-ముదిగొండ



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన వనంవారికిష్టాపురం గ్రామానికి చెందిన పనితి జయంతి, వాడపల్లి శ్రీనులను ముదిగొండ సొసైటీ చైర్మెన్ తుపాకుల యలగొండస్వామి ఆదివారం శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీచర్స్ ఆయన జయంతి, శ్రీనులను ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్సీలో ఉద్యోగం సాధించిన న్యూలక్ష్మీపురం గ్రామానికి చెందిన అల్లాడి పూర్ణచంద్రరావును హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ సభ్యులతోపాటు,గ్రామస్తులు అభినందించి శాలువతో సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | అక్టోబర్ 14, 2024 | www.navatelangana.com

సోలార్ పవర్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ఇవ్వాలి

- సీఐటీయూ వినతి



నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సోలార్ కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్‌ను ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సింగరేణి పర్సనల్ మేనేజర్ మోహన్ రావుకు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర నేత అబ్దుల్ నబి, సీఐటీయూ జిల్లా నేత తాళ్లూరి కృష్ణలు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఇతర ప్రాంతాల్లో థాడ్ పార్టీ కాంట్రాక్టు పద్ధతుల్లో పనిచేస్తున్న అనేక మంది కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చే 5 వేల బోనస్‌ను ఇచ్చారని ఇక్కడ కూడా సోలార్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. సింగరేణి యాజమాన్యం స్పందించకుంటే దీనిపై ఆందోళనకు సిద్ధమవుతున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ సింగ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

15, 16న కంపెనీ స్థాయి క్రీడలు : జీఎం



నవతెలంగాణ-ఇల్లందు

వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఏరియా వారి ఆధ్వర్యంలో 15, 16న కంపెనీ స్థాయి క్రీడలు నిర్వహించినట్టు జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రవర్తనలో వివరాలు వెల్లడించారు. స్థానిక వైసీఓఏ క్లబ్, 24 ఏరియా, సింగరేణి స్కూల్ గ్రౌండ్, జేకే కాలనీ కంపెనీ స్థాయి బాస్కెట్ బాల్, లాన్ టెన్నిస్ క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా (6) రీజియన్ లెవల్‌లో ఎంపిక అయిన క్రీడాకారులు ఇల్లందు ఏరియాలో జరిగే కంపెనీ స్థాయి పోటిలలో పాల్గొంటారని తెలిపారు. ఈ క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులు కోల్ ఇండియా లెవెల్‌కు సెలెక్ట్ అవుతారని తెలిపారు. ఇతర ఏరియా నుండి వచ్చే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పర్సనల్, సివిల్, వర్క్ షాప్ ఇతర విభాగాల అధికారులకు ఆదేశాలు జారీచేసారు.



లలితా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించిన న్యాయమూర్తులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పట్టణంలోని శాంతినగర్ కాలనీలో కొలువుతీరి ఉన్న శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సీనియర్ సివిల్ జడ్జ్ ఎం.వెంకటేశ్వర్లు, మరో సీనియర్ న్యాయమూర్తి దేవరపల్లి నాగేశ్వరరావులు ఆదివారం సందర్శించి అమ్మవారికి ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరువురు న్యాయమూర్తులను ఆలయ కమిటీ అధ్యక్షులు రాజు పీఏసీఎస్ సొసైటీ చైర్మెన్ అభినేని శ్రీనివాసరావులు శాలువతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఇరువురు న్యాయమూర్తులు మాట్లాడుతూ... దేశం సుభిక్షంగా ఉండాలని శాంతి సామరస్యంతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నామని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా విజయదశమి వేడుకలు నిర్వహించుకుంటామని గుర్తు చేశారు. ఆధ్యాత్మికత ఒట్టిపడేలాగా ఆలయాన్ని తీర్చిదిద్ది నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసిన శాంతినగర్ లలిత పరమేశ్వరి ఆలయ కమిటీ వారికి ఈ సందర్భంగా న్యాయమూర్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎన్.వి.రమణ రావు, గోడపర్తి నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు బండారు నాగా చలపతి, కోట్ల దుర్గ, కొండవీటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన మోడెం వంశి అనే పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు సౌత్ ఆఫ్రికాలోని సన్ సిటీలో అక్టోబర్ 4వ తారీఖు నుండి 13 వరకు జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఇండియాకు బంగారు పతకం సాధించడం జరిగింది. ఈ పోటీలలో పాల్గొని మొత్తం 677.5 కేజీల బరువు ఎత్తడం జరిగింది. స్ట్రాంగెస్ట్ మాన్ ఆఫ్ వరల్డ్ మెరిట్ సర్టిఫికెట్‌ను కూడా ఇచ్చారు. బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్, స్క్వాట్ విభాగాలలో మూడు బంగారు పతకాలతో పాటుగా పవర్ లిఫ్టింగ్‌లో ఉత్తమ ప్రతభ కనపరిచినందుకు నాలుగో బంగారు పతకం సాధించాడు. ఈ మోడెం వంశీ అనే గిరిజన క్రీడాకారుడు గతంలో కూడా యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని ఇండియాకు బంగారు పతకాలు సాధించాడు. ఈ బంగారు పతకాలు సాధించిన మోడెం వంశీని రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.మల్లేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, పలు క్రీడా సంఘాలు, రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, పట్టణ ప్రముఖ సంఘ సేవకులు గాదె మాధవరెడ్డి, మోడెం వంశీని అభినందించారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేసిన యూత్ లీడర్ నరేష్



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని జానికిపురం గ్రామాల్లో జేపీ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా ఫైనల్ మ్యాచ్ ఆదివారం నిర్వహించారు. విన్నర్‌గా అన్నపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిడ్నీ సిక్సరస్ జట్టు నిలవగా, రన్నర్‌గా అదే గ్రామానికి చెందిన సీపీఎస్ పోర్స్ జట్టు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల యువజన నాయకులు వేముల నరేష్ బాబు మెదటి స్థానం సాధించిన జట్టుకి రూ.12000 నగదును బహుమతిగా అందజేశారు. ద్వితీయ బహుమతి జేపీ యూత్ కమిటీ వారు రూ.8000 నగదు అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ బాబు మాట్లాడుతూ మండలంలో క్రీడా నైపుణ్యం పెంచేందుకు జానికిపురం గ్రామంలో జెపి యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం చాల సంతోషం అని అన్నారు. క్రీడల వలన శారీరక బలంతో పాటు మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుందని, రానున్న రోజుల్లో మండలంలో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని, మహిళకు కూడా సంక్రాంతి సమయంలో ముగ్గులు పోటీలు వంటి కార్యక్రమాలు యూత్ ఆధ్వర్యంలో చేపడతాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసు, రామకృష్ణ, బాలాజీ, ఈశ్వర్, సుధాకర్, చెన్నా, విజయ్, నవీన్, ఇబ్రహీం, వంశి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలంలోని పాత ఎల్ఐసీ ఆఫీసు ఎదురుగా ఆల్ పెన్షనర్స్అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో శరత్ మాక్సివిజన్ కంటి ఆసుపత్రి వరంగల్ వారిచే నిర్వహించనున్నట్టు నిర్వహకులు తెలిపారు. అదే రోజు క్యాటరాక్ట్ కలిగిన వారిని వారి వాహనములలో వరంగల్ ఆసుపత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్లు చేస్తారని, ఆపరేషన్లు అనంతరం తిరిగి మన ఆఫీసు వద్ద దించుతారని తెలిపారు. వీరికి ఉచిత మందులు రవాణా సౌకర్యం భోజన వసతి కల్పిస్తారు. శిబిరమునకు వచ్చువారు హెల్త్ కార్డు తీసుకుని రాగలరు.

ఉద్యమకారులు మరణిస్తున్నా...ప్రభుత్వ సాయం లేదు

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో తొలి, మలితరం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆనాటి తెలంగాణ ఉద్యమకారులు ఒక్కరొక్కరుగా మృతి చెందుతున్నప్పటికీ గత, తాజా ప్రభుత్వాలు వారికి ఎలాంటి మేలు చేసింది లేదని తెలంగాణ తొలి, మలి 1969 ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రావణ బోయిన నర్సయ్య అన్నారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ ఉద్యమ కారుడు అల్లి భాస్కర్‌రావు సంతాప సభ ఆదివారం జరిగింది. ముందుగా భాస్కర్‌రావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నర్సయ్య మట్లాడారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాలు పంచుకున్న ఉద్యమకారులను కేసీఆర్ ప్రభుత్వం విస్మరించిందని, నేటి రేవంత్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తొలి, మలి 1969 ఉద్యమ కారులను పట్టించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.వళీబాబ, శ్రీపాద విజయ సత్యనారాయణ, కాకెల్లి సైమన్, దమర కొండ మల్లయ్య, సప్తర బేగ్, దేవుల పల్లి రామ్మూర్తి తదితరు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం పరిశ్రమ అనుబంధ విద్యుత్ కేంద్రం ప్రారంభం విజయవంతం

- హాజరైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

నవతెలంగాణ-అశ్వారావుపేట

టీజీ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయిల్ ఫాం పరిశ్రమ అనుబంధంగా రూ.36 కోట్లు వ్యయంతో నిర్మించిన 2.5 మెగావాట్ల బయోమాస్ విద్యుత్ కేంద్రం ప్రారంభోత్సవం విజయవంతంగా ముగిసింది. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో శనివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన విద్యుత్ కేంద్రం ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి, ఫైనాన్స్, ప్లానింగ్, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు హాజరై లాంచనంగా ప్రారంభించి, ఆయిల్పెడ్‌కు అంకితం చేసారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ, గృహ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల, నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, వైరా, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్, కూనంనేని సాంబశివరావు, జారే ఆదినారాయణ, మట్ట రాగ మయి, ఆయిల్ ఫెడ్, నీటిపారుదల అభివృద్ధి, వేర్ హౌస్, మార్క్ ఫెడ్ కార్పొరేషన్‌ల చైర్మెన్‌లు జంగా రాఘవరెడ్డి, మువ్వా



విజయ్ బాబు, రాయల నాగేశ్వరరావు, కొత్వాల శ్రీనివాసరావులు, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానశాఖ కార్యదర్శి, ఆయిల్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యస్మీన్ భాషా, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు బాబూరావు, మధుసూధన్ రావు, జే.కిషోర్(ఇన్‌చార్జి), ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగుపల్లిలో ఎమ్మెల్యే జారే మార్నింగ్ వాక్



నవతెలంగాణ-దమ్మపేట

అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఆదివారం మండల పరిధిలోని నాగుపల్లి గ్రామంలో పర్యటించి ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పానుగంటి వెంకయ్య, దేశిరెడ్డి మాధవరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. అనంతరం మారగాని నాగేశ్వరరావుకు అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1లక్ష ఎల్ఓసీ మంజూరి చేయించి చెక్కును ఇంటికి వెళ్ళి అందజేశారు. అనంతరం పెరాలసిస్‌తో బాధపడుతున్న ఆంగోతు రాంబాబును పరామర్శించి వారికి ఎమ్మెల్యే జారే స్వయంగా ఫిజియోథెరపీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేపించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఇస్లావత్ నాగేశ్వరావు,



చల్లా పున్నయ్య, టి.డేవిడ్, చల్లా బాబూరావులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వం నుండి మంజూరి కాబడిన సిఎంఆర్ఎఫ్ చెక్కులను నూజివీడు విజయలక్ష్మి, రంగు మాధవాచారిలకు అందజేశారు. అక్కడ నుండి ధరావత్ ప్రసాద్ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

- సీపీఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రభుత్వ వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న వైద్యులతో పాటు సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గౌరవరం గ్రామంలో అమరజీవి సీతారాం ఏచూరి నగర్‌లో జరిగిన శాఖ మహాసభలో పార్టీ సీనియర్ నాయకులు మడకం ఆదెయ్య జెండా ఆవిష్కరించారు. మడకం నారాయణ అధ్యక్షతన జరిగిన శాఖ మాసభలో యలమంచి వంశీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ...



ఎంతో అభివృద్ధి సాధించామని చెబుతున్న పాలకులు ఏజెన్సీలో వైద్యం అందక ఆదివాసుల ప్రాణాలు గాలిలో కలిసిపోవటాన్ని ఏ అభివృద్ధి కింద చూడాలని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయి వైద్యులు లేక అనేక అవస్థలు పడుతున్న ఏజెన్సీ ప్రజల పట్ల చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. ఇద్దరు ప్రభుత్వ వైద్యులు ఉండవలసిన ములకపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో నేటికీ ఒక వైద్యుడు మాత్రమే అందుబాటులో ఉంటున్నారని దీనివలన వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడవలసి వస్తుందని ఆయన అన్నారు. ఇద్దరు వైద్యులు ఉండి ఉంటే ఉయిక సమ్మక్క ప్రాణాలు కోల్పోయేది కాదని వెంటనే రెండో వైద్యుని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మర్మం చంద్రయ్య,, గోవర్ధన్, రమేష్, గోపాల్, కణితి లలిత, సోంది రాజమ్మ ఆదయ్య, నారాయణతదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ కల్లోజి శ్రీనివాస్‌కు మాతృవియోగం

- ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టులు, ప్రముఖులు నివాళి



నవతెలంగాణ-కొత్తగూడెం

సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే 143 యూనియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్‌కు మాతృ వియోగం జరిగింది. శ్రీనివాస్ తల్లి జయమ్మ (80) గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, శ్రీనివాస్ సన్నిహితులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వగ్రామం లక్ష్మీదేవిపల్లి మండలం, హేమచంద్రాపురం గ్రామంలోనివారి స్వగృహంలో జయమ్మ భౌతికకాయాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), నాగ సీతారాములు, బిక్కసాని నాగేశ్వరరావు, తూము చౌదరి, గుండ్ల నరసయ్య, మండే హనుమంత రావు, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, పలువురు ప్రముఖులు, జర్నలిస్ట్ లు భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నివాళులర్పించిన సీపీఐ జిల్లా కార్యదర్శి

కళ్ళోజి జయమ్మ భౌతికాయాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబిర్ పాషా సందర్శించి నివాళులర్పించారు. జయమ్మ మృతి పట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, గేద్దాడ నగేష్, నేరేళ్ల రమేష్, రాజు, యెల్లావుల ఉపేందర్ తదితరులు ఉన్నారు.

ప్రాఫెసర్ సాయిబాబా మరణానికి మోడీ ప్రభుత్వం బాధ్యత వహించాలి

- సీపీఐ(ఎం) జిల్లా నేత అబ్దుల్ నబి



నవతెలంగాణ-ఇల్లందు

మావోయిస్టు సాహిత్యం కలిగి ఉన్నాడనే అనుమానంతో ప్రొఫెసర్ సాయిబాబాను కేంద్ర ప్రభుత్వం టాడా చట్టం కింద అరెస్టు చేసి 9 ఎండ్లపాటు విచారణ లేకుండా జైలులో ఉంచింది. ఆయన మరణానికి కేంద్ర బీజేపీ నరేంద్రమోడీ ప్రభుత్వం బాధ్యత వహించాలని సీపీఐ(ఎం) జిల్లా నేత అబ్దుల్ నబి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సాయిబాబా మరణానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాట్లాడారు. 90 శాతం వికలాంగుడైన డిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ చిత్రహింసలకు గురిచేశారని అన్నారు. దాన్ని ముంబై హైకోర్టు తప్పు బడుతూ ఈ మధ్య విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, ఆలేటి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం విప్లవోద్యమానికి తీరనిలోటు : మధు

పౌరహక్కుల నేత, మేధావి ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం భారత విప్లవోద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం న్యూడెమోక్రసీ కార్యాలయంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలువేసి నివాళి అర్పించిన అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి కొక్కు సారంగపాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు డి.మోహన్ రావు, రామిశెట్టి నరసింహారావు, మండల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరు మృతి

నవతెలంగాణ-కరకగూడెం

అతివేగంతో ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ అదుపు తప్పడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రేగళ్ళ-మద్దలగూడెం ప్రధాన రహదారిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వలస ఆదివాసీ రేగాళ్ళ గ్రామ పంచాయతీ మదన్న గిరిజన గ్రామానికి చెందిన మండకం భద్రయ్య (60), హెమ్ల దేవ(28) ఛత్తీస్‌గఢ్, దంత వాడ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ద్విచక్ర వాహనం అతివేగంతో అదుపుతప్పి రోడ్డు పక్కనపడి ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రత్యేక ప్రోత్సాహక బోనస్‌లు అందరికీ చెల్లించాలి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి ప్రత్యేక ప్రోత్సాహక బోనస్‌లు అందరికీ చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఐఎఫ్‌టీయూ మణుగూరు ఏరియా అధ్యక్షులు ఆంగోత్ మంగీలాల్ కోరారు. ఆదివారం మధ్యాహ్నం మణుగూరు దుర్గా ఇన్ ఫ్రా మైనింగ్ ప్రయివేట్ లిమిటెడ్ (డీఐఎంపీఎల్‌ఈ) కంపెనీలో జరిగిన ఓబి వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఓబి వర్కర్లు జి.శ్రీధర్, శేఖర్, సతీష్, నాగరాజు, కార్తీక్, ప్రవీణ్, కే.రాజు, రమణ, శ్రీనివాస్ రెడ్డి, పవన్, సాజుద్దీన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- సాగులో మెలుకువలతో నీటి ఆదా
- పలు అంశాలు పై ఉద్యాన నిపుణులు ప్రసంగాలు

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆయిల్పాం పరిశ్రమ అనుబంధ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ఆయిల్ ఫాం సాగు దారుల అవగాహనా సదస్సు రైతులకు ఎంతో ఉపయుక్తంగా సాగింది. ఇందులో పలువురు ఉద్యాన శాస్త్రవేత్తలు ఆయిల్ ఫాం సాగులో మెలుకువలు, నీటి తడులు నిర్వహణ, చీడపీడలు అధిగమించే పద్ధతి, ఆయిల్ ఫాంలో అధిక దిగుబడులు అనే అంశాలు సోదాహరణంగా వివరించారు. స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జే.హేమంత్ కుమార్ వ్యాఖ్యాన ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయిల్ ఫాం పంటను ఆశించే కీటకాలు గెలలు ఉత్పత్తిలో వాటి పాత్ర పై భారతీయ ఆయిల్ ఫాం పరిశోధనా కేంద్రం పెదవేగి సీనియర్ సైంటిస్ట్ ఏఆర్ఎన్ఎస్ సుబ్బన్న, ఆయిల్ ఫాం సాగులో నీటి తడులు నిర్వహణ, ఫలదీకరణంలో వ్యవహరించాల్సిన యాజమాన్యం పద్దతులు పై ఉద్యాన సాంకేతిక సలహాదారు డాక్టర్ బీఎన్ రావు, ఆయిల్ ఫాం సాగులో అంతర పంటలు, సాగు నిర్వహణ పై శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన, పట్టు విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.రాజశేఖర్, ఆయిల్‌పై ఫాం సాగు కై మొక్కలు ఎంపిక, నాటే పద్ధతులు పై ఉద్యాన పరిశోధనా సైతాను అశ్వారావుపేట సీనియర్ సైంటిస్ట్ జి.విజయ్ క్రిష్ణ, ఆయిల్ ఫాం పంటను సోకే చీడపీడలు, నివారణ పద్ధతులు పై వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్ కుమార్‌లు బోధించారు. అనంతరం రైతులు సందేహాలను నివృత్తి చేసారు.

సరస్వతీ పుత్రులు ఈ సోదరులు..!



ప్రభుత్వ కొలువులు సాధించిన ప్రయివేట్ అధ్యాపకులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సాధారణ దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి అక్షరాలే ఆయుధంగా ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా ఎన్ని అవరోధాలు ఎదురైనా అధికమిస్తూ శ్రమదే అంతిమ విజయం అని నిరూపించిన భద్రాచలం పట్టణానికి చెందిన పోలిశెట్టి సాయిరాం కృష్ణ, పోలిశెట్టి నరేష్ బాబులను సరస్వతీ పుత్రులు అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. పట్టణంలో పలు ప్రయివేట్ పాఠశాలలో గణితం ఫిజికల్ సైన్స్ బోధిస్తూనే స్వతగా సుభాష్ అకాడమీని ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థులకు విద్యనందిస్తూ తమ లక్ష్యసాధనలో ఏమాత్రం వెనుకడుగు వేయకుండా కటోర దీక్షతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ విజయం సాధించిన సాయిరాం కృష్ణ, నరేష్ బాబులు 2024 డీఎస్సీ ఫలితాలలో జిల్లా స్థాయి నాలుగు ఐదవ ర్యాంకులు సాధించి ప్రభుత్వ ఉపాధ్యా యులుగా ఎంపికయ్యారు. గణిత విభాగంలో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లా స్థాయి నాలుగో ర్యాంకు సాధించిన సాయిరాం కృష్ణ 2008వ సంవత్సరంలో నిర్వహించిన డీఎస్సీలో క్వాలిఫైడ్ లిస్టులో ఉన్నప్పటికీ ఫలితాల జాప్యంతో ఉద్యోగాన్ని పొందలేకపోయారు. అయినను ఎక్కడా విశ్వాసాన్ని కోల్పోకుండా పట్టు వదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నం కొనసాగిస్తూనే పట్టణంలో ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందిస్తూ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన 2024 డీఎస్సీ ఫలితాలలో విజయం సాధించి ఉపాధ్యాయుడుగా కొలువుని దక్కించుకున్నారు. సాయిరాం కృష్ణ సోదరుడైన సరేష్ బాబు సైతం ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లా స్థాయి ఐదవ ర్యాంకు సాధించి తన ప్రభుత్వ ఉపాధ్యాయ కలను సహకారం చేసుకున్నారు. అన్నదమ్ముల పిల్లలైనా వీరు చిన్ననాటి నుండి కుటుంబ కష్టాలను అధిగమిస్తూ విద్యపై ఆసక్తిని కనబరుస్తూ నేడు ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో పట్టణంలోని పలువురు విద్యావేత్తలు వారిని అభినందిస్తున్నారు.

సాయిరాం కృష్ణ, సురేష్ బాబులు పట్టణంలో పలు ప్రయివేటు విద్యాసంస్థలలో విద్యను బోధిస్తూనే సుభాష్ అకాడమీ ట్యుటోరియల్స్ నెలకొల్పి ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించిన వీరు ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో పలువురు విద్యార్థులు వీరిని అభినందిస్తున్నారు.

నిరంతరం విద్యా బోధనతోనే ఈ విజయం సాధించాను



ఆశయ సాధనలో కుటుంబంతో పాటు స్నేహితులు శ్రేయోభిలాషుల ప్రోత్సాహం మరువలేనిది. చదువు పూర్తి అయినాక వేరే రంగం వైపు వెళ్లకుండా ఎలాగైనా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగాలని లక్ష్యంతో ప్రయివేట్ పాఠశాలలతో పాటు సొంత ట్యుటోరియల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు నిరంతరం విద్యా బోధన చేయటం డీఎస్సీలో విజయం సాధించడానికి కలిసి వచ్చింది. చదవడంతోపాటు ఇతరులకు చెప్పడం ద్వారా విజ్ఞానం పెరుగుతుంది అనడానికి నేను సాధించిన విజయమే ప్రత్యక్ష ఉదాహరణగా నా విద్యార్థులకు తెలియజేస్తాను. నాకు వచ్చిన ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ ప్రతి విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దేందుకు నా వంతు కృషి చేస్తాను.

- పోలిశెట్టి నరేష్ బాబు

విద్యపై ఉన్న మక్కువే ఈ విజయానికి కారణం



2008 డీఎస్సీలో విజయం సాధించినప్పటికీ జరిగిన అనివార్య కారణాలతో కొలువును సాధించ లేకపోయా, అయినప్పటికీ ఎక్కడా నిరుత్సాహవడకుండా విద్యారంగంలోనే కొనసాగాను. విద్యపై ఉన్న అమితమైన ఇష్టం గౌరవంతో ఎలాగైనా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని నిరంతరం అధ్యయనం పైనే దృష్టి పెట్టి ఈ సంవత్సరం డీఎస్సీలో విజయం సాధించగలిగాను. జిల్లాకి ఎక్కువ పోస్టులను కేటాయిస్తూ డీఎస్సీ విడుదల చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకువెలెందుకు శక్తివంచలేకుండా కృషి చేస్తాను.

- పోలిశెట్టి సాయిరాం శంకర్ కృష్ణ

నవతెలంగాణ 8
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం అక్టోబర్ 14, 2024 www.navatelangana.com




శబరి స్మృతి యాత్రకు రండి..!

- తాజా, మాజీ ఎమ్మెల్యేలకు ఆహ్వానం అందించిన ఆలయ ఈవో

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన ఆధ్వర్యంలో ఈనెల 17న నిర్వహించిన శబరి స్మృతి యాత్ర వేడుకకు హాజరుకావాలని కోరుతూ భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు, అటవీశాఖ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మెన్ పొదెం వీరయ్యలకు రమాదేవి నేతృత్వంలో దేవస్థానం అధికారులు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా తెల్లం వెంకటరావు, వీరయ్యలకు ఆలయ ఈవో ఎల్.రమాదేవి శబరి స్మృతి యాత్ర నిర్వహణకు సంబంధించిన విషయాలు కులం కుశంగా వివరించారు. ఆదివాసీ గిరిజన ప్రాంతమైన భద్రాచలంలో కొలువై ఉన్న భద్రత రామయ్యకు శబరి అత్యంత ప్రీతి పరమైన భక్తురాలని ప్రతి సంవత్సరం ఆమె పేరుతో గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆదివాసి గిరిజనులతోనే శబరి స్మృతి యాత్రను నిర్వహించడం జరుగుతుందని అత్యంత ప్రాధాన్యత గల ఈ కార్యక్రమానికి ప్రజాప్రతిథులైన మీరు తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆలయ అధికారులతో శాసనసభ్యులు తెల్ల వెంకటరావు కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యలు మాట్లాడుతూ... ఎంతో చారిత్రాత్మ గల భద్రాచలం రామాలయానికి రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రామాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆలయ అభివృద్ధి కోసం ఇప్పటికే కార్య చరణ ప్రారంభించామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ రవీంద్రనాథ్, సూపరెంటెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అంబరాన్నంటిన దసరా సంబరాలు

- ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్

నవతెలంగాణ-మణుగూరు

దసరా ఉత్సవాల వేడుకల సందర్భంగా మణుగూరు ఏరియా పీవీ కాలనీ కాలనీ, భద్రాద్రి స్టేడియంలో మణుగూరు ఏరియా ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వారి సౌజన్యంతో శనివారం రాత్రి దసరా మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ప్రసంగిస్తూ నేటి విజయదశమి వేడుకలు ఇంత ఘనంగా జరిగేందుకు సింగరేణి సంస్థతో పాటు చేయి చేయి కలిపి ఈ కార్యక్రమం ఇంత భారీ ఎత్తున నిర్వహించటానికి ప్రతి ఉద్యోగి తమ వేతనముల నుండి రూ.2 వేలు నిధులు సమకూర్చిన మణుగూరు ఏరియా ఉద్యోగులకు, మణుగూరు ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వారికి ఈ సందర్భంగా నా అభినందనలు తెలియజేశారు. అనంతరం అంతర్జాతీయ శాస్త్రీయ నృత్య కళాకారిని డా.సీతా ప్రసాద్ బృందంచే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, జబర్దస్త్ బృందం కుడుబ్బించే నవ్వులు, మానస ఆచార్య కిరణ్ చే పాడిన సినీ పాటలు, ఇతర రాష్ట్ర స్థాయి కళాకారులచే, స్థానిక కళాకారులు ప్రదర్శించిన నృత్య కళాప్రదర్శనలు ఆహుతాలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏటీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, డీఎస్పీ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ రాఘవ రెడ్డి, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస చారి, ఏరియా ఇంజినీర్ ఆర్ శ్రీనివాస్, ఏరియా అధికారి వెంకట్ రమణారావు, ఏజెంట్ (కొండాపురం) వీరభద్ర రావు, డీజీఎం (పర్సనల్) యస్ రమేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరి వై.రాంగోపాల్, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ వి.కృష్ణం రాజు, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం, టీబీజీకేఎస్ నాయకులు నాగెల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని చాటిన నవరాత్రి ఉత్సవాలు

- ఉత్సవాల నిర్వహణలో యువకుల పాత్ర అభినందనీయం
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్ పాషా

నవతెలంగాణ-కొత్తగూడెం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ ఆటపాటలు ప్రజల్లో ఉత్సాహాన్ని నింపటమే కాకుండా మత మతసామరస్యాన్ని చాటి చెప్పాయని సిపిఐ భద్రాద్రి జిల్లా ఎస్.కె సాబీర్ పాషా అన్నారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా విద్యానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపంలో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని సాబీర్ పాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణలో యువత పాత్ర కీలకంగా నిలిచిందని, మంటపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు నిరంతరం శ్రమించి ప్రజలను ఒకే తాటిపైకి తెచ్చారని అన్నారు. బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశాలు, సూచనమేరకు మున్సిపల్, గ్రామ పంచాయతీ శాఖలు చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని, అదేవిధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ చేపట్టిన బందోబస్తు ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలు, ప్రభుత్వ శాఖల అధికారులు కలిసి ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి మురళి, పోలిన శ్రీను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాధాకృష్ణ, గెద్దాడ నగేష్, వాసిరెడ్డి ప్రసాద్, రామారావు, కృష్ణమోహన్, చావా శ్రీను, అమర్ నాథ్, భాగం మాధవరావు, నేరేళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్ కాలనీ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి నూతన వస్త్రాల వితరణ

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం, శ్రీనగర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు విజయ దశమి సందర్భంగా ఆదివారం నూతన దుస్తులు అందజేశారు. స్వర్గీయ బత్తుల సరోజిని జ్ఞాపకార్థం శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్, లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీనగర్ అధ్యక్షులు బత్తుల కృష్ణయ్య పారిశుధ్య సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని, ప్రతిరోజు ఇంటింటికి తిరుగుతూ చెత్తని సేకరిస్తూ మురుగునీటి కాలువలని శుభ్రపరుస్తూ ప్రజల ఆరోగ్యం కాపాడడంలో ఎంతో శ్రమిస్తున్నారన్నారు. వారిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాళ్లూరి వెంకటేశ్వరరావు, లైన్స్ క్లబ్ సభ్యులు కోనేరు పూర్ణచంద్రరావు, మాజీ ఉప సర్పంచ్ లగడపాటి రమేష్ చంద్, వట్టి కొండ సాంబశివరావు, శివ , వీరభద్రం, డాక్టర్ రామారావు, రామచంద్ర కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు, నూకల ప్రవీణ్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల సేనాని 'సాయిబాబా' : సీపీఐ

కొత్తగూడెం : అనగారిన వర్గాలను పోరాటం వైపు నడిపించిన సేనాధిపతి సాయిబాబా అని, ఆయన మృతి పౌరహక్కుల ఉద్యమానిక్ తీరని లోటని సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా అన్నారు. పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ సాయి బాబా మృతిపై ఆదివారం ఆయన స్పందిస్తూ సాయిబాబాది సాధారణ మృతికాదని కేంద్రం చేసిన హత్య అని ఆరోపించారు. 90శాతం అంగవైకల్యంతో ఉన్న ఆయనపై మావోయిస్టుగా ముద్రవేసి ఉపా చట్టం కింద ఏండ్ల తరబడి జైల్లో పెట్టి దుర్మార్గంగా వ్యవహరించిందని, అందువల్లే ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించి మృతిచెందారన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సాయిబాబా పోరాడాడని, వికలాంగులకు, దళితులకు, గిరిజనులకు, వెనుకబడిన వర్గాలకు అండగా, వారి హక్కులకోసం పోరాడిన సాయిబాబా మృతి ప్రజా పోరాటాలకు తీరనిలోటని, మృతిపట్ల సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

ఎర్రగుట్ట ప్రాంత పొలాల్లో చిరుత సంచారం

- చేనులో కట్టి వేసిన కుక్కను ఎత్తుకు వెళ్ళినట్టు అనుమానం



నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు, ఏన్కూరు సరిహద్దు ప్రాంతమైన ఎర్రగుట్ట సమీపంలో ఉన్న పొలాల్లో చిరుత సంచరిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే భీమ్లాతండాకు చెందిన భూక్య మాన్సింగ్ తన పొలంలో కోతుల బారి నుండి పొలాన్ని కాపాడేందుకు ఓ కుక్కను పొలం వద్దకు తీసుకువెళుతుంటాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కుక్కను పొలంలో వదిలేసి వచ్చానని ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్ళగా కుక్కను ఏదో అడవి జంతువు గుట్ట పైకి ఈడ్చుకు వెళ్ళినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయని చెబుతున్నారు. జూలూరుపాడు, ఏన్కూరు అటవీ ప్రాంతాలు కావడం ఎర్రగుట్ట సమీపంలో రైతులకు పొలాలు ఉండడం పొలాల్లో చిరుత సంచరిస్తున్నట్లుగా అనుమానిస్తున్నారు. రైతులు పొలాల్లో కొన్ని పాదముద్రలను గుర్తించారు. అవి చిరుతపులి అడుగులా, పెద్దపులి అడుగులా అనేవి అటవీ శాఖ వారు నిర్ధారించాల్సి ఉంది. ఏదేమైనా పొలాల్లో చిరుత సంచరిస్తుందని అనుమానంతో ఒంటి గుడిస, బద్రు భీమ్లా తండా పరిసర ప్రాంత రైతులు ఒక ఇంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు ఉమాదేవి అకాల మృతి

నివాళులు అర్పించిన పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

నవతెలంగాణ-కొత్తగూడెం



సీపీఐ(ఎం) సానుభూతి పరురాలు డి.ఉమాదేవి (50) శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆనార్యోగంతో బాధపడుతూ స్థానిక డాక్టర్ నాగరాజు హాస్పటల్లో చికిత్స పొందుతూ మరణించారు. మరణించిన వార్త తెలుసుకున్న పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబా, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్యలు కొత్తగూడెంలోని ఉమాదేవి నివాసం చేరుకొని, ఆమె భౌతిక కాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ కామ్రేడ్ ఉమాదేవి మరణ వార్త వినగానే దిగ్భ్రాంతికి లోనయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి ఉద్యమంలో మా తరం నాయకులుగా పనిచేసిన సందర్భంలో ఉమాదేవి ఇంట్లోనే విద్యార్థి ఉద్యమ కేంద్రం నడిచేదని గుర్తు చేశారు. అన్ని రకాలుగా ఎస్ఎఫ్ఐ సంఘం నిర్వహించే కార్యక్రమాలకి అండగా నిలబడి సహకరించే వారని తెలిపారు. ఉమాదేవి ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి నాయకుడు, ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్గా పనిచేస్తున్న జాస్తి రమేష్కి సోదరి. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి విద్యా సంస్థల చైర్మన్ గొల్లపూడి జగదీష్, నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎం.వి చౌదరి, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు మేక ఈశ్వరయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, మండల కార్యదర్శి ఉద్దనపల్లి నాగేశ్వరావు, కె.హెచ్ ప్రసాద్, మన్నెం జవహర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఉన్నారు.



సబ్సిడీ విద్యుత్ మోటార్లకు దరఖాస్తు చేసుకోండి

- మాజీ మంత్రి జలగం ప్రసాదరావు

నవతెలంగాణ-చర్ల



ఏజెన్సీ అభివృద్ధి ప్రదాత, చర్ల మండలంలో తాలిపేరు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి స్వర్గీయ సివికే రావు ప్రతిపాదన మేరకు కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ జలగం వెంగళరావు స్ఫూర్తితో ఆయన కుమారుడు మాజీ మంత్రివర్యులు తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన జలగం వెంగళరావు మారక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏజెన్సీలోని గిరిజన రైతుల అభివృద్ధి కోసం, వారి పంటలకు సాగునీరు అందించే సదుద్దేశంతో విద్యుత్ మోటార్లను సబ్సిడీ ద్వారా అందిస్తున్నారు. గతంలో చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన గిరిజన రైతులకు ఈ కార్యక్రమంలో మోటార్లను అందజేశారు. ఈ సంవత్సరం కూడా జలగం వెంగళరావు స్మారక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యుత్ మోటార్లను ఇవ్వనున్నట్లుగా మాజీ మంత్రి జలగం ప్రసాదరావు తెలిపారు. విద్యుత్ మోటార్లు కావలసిన గిరిజన రైతులు అక్టోబర్ 14వ తేదీన చర్ల మండలం రైసుపేట గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు స్వర్గీయ సివికె రావు స్వగృహం శైలజా విహార్కు వచ్చి తమ దరఖాస్తులను ఇవ్వవలసిందిగా ఆయన కోరారు. మండల పరిధిలో పూసుగుప్ప, వద్దిపట, ఉంజుపల్లి, కుర్నపల్లిలో విద్యుత్ మోటార్లను సబ్సిడీపై అందించడం జరిగిందని ఆయన తెలిపారు. విద్యుత్ మోటర్లు కావలసినవారు ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్తో పాటు పాస్ ఫోటోలు తీసుకొని రైస్ పేటలో ఉన్న సివికే రావు స్వగృహం శైలజ విహార్కి కావాలని ఆయన తెలిపారు.

ఐటీసీ యాజమాన్యానికి ధన్యవాదాలు

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల

నవతెలంగాణ-బూర్గంపాడు



కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు ప్రతి నెల పదో తారీకు లోపు ఇచ్చినందుకు ఐటీసీ యాజమాన్యానికి ధన్య వాదాలు తెలుపుతున్నట్లు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ శాఖ సమావేశం సారపాక పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల తరుపున ఐటిసి పిఎస్పీడీ మేనేజ్మెంట్కు కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెల పదో తారీకు లోపు వేతనాలు ఇవ్వాలని పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మేనేజ్మెంట్ దృష్టికి గతంలో తీసుకెళ్లడం, కరపత్రాలు పంచటం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో పదో తారీకు లోపు వేతనాలు వేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారని ఆయన అన్నారు. అదేవి ధంగా ఈనెల అక్టోబర్ 10వ తేదీన కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు మేనేజ్మెంట్ వేయించడం వల్ల మేనేజ్మెంట్కు పార్టీ మండల కమిటీ కార్మికులు తరపున ధన్యవాదాలు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్లైకే అప్పారావు, శ్రీనివాస్, కందుకూరి నాగేశ్వరావు, సిహెచ్ రమణయ్య, ఆదూరి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు విప్లవ జోహార్

నవతెలంగాణ-కొత్తగూడెం



ప్రొఫెసర్ సాయిబాబా మరణం అనే మాటున చంపబడ్డాడు అని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కొత్తగూడెం డివిజన్ నాయకులు పెద్ద బోయిన సతీష్ అన్నారు. ఆదివారం ప్రకట విడుదల చేశారు. రాజ్యపు పరోక్ష హత్యఅని పేర్కొన్నారు. ప్రజల హక్కు ల కోసం నిలబడి నందుకు, వామపక్ష విప్లవ మేధావి గా ఉన్నందుకు ఆయనను అక్రమ కేసుల్లో ఇరికించి 3588 రోజులు నాగపూర్ అండా సెల్లో నిర్బం ధించారని తెలిపారు. 90 శాతం వికలాంగుడు అయినా ప్రొఫెసర్ సాయిబాబాను వికలాంగుడు అని కనీసం కనికరం లేకుండా మోడీ, అమిత్ షా ప్రభుత్వం అత్యంత కర్కశంగా వ్యవహరించి జైల్లో నిర్బంధించి,ఆయన మరణానికి కారణమైందని ఆరోపించారు. సాయిబాబాకు విప్లవ జోహార్లు, ఆయన కుటుంబానికి సంతాపం, సానుభూతి తెలిపారు.

తెలంగాణ జన సమితి...

రాజ్యం కక్ష గట్టి సాయిబాబా మానసికంగా, శారీరకంగా హింసిస్తూ తొమ్మిది సంవత్సరాలు చీకటి రోజులతో నిర్బంధించారని తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్లెల రామనాధం అన్నారు. సాయిబాబ మృతికి తీవ్ర సంతాపం, సానుభూతి తెలిపారు. ప్రొఫెసర్ సాయిబాబా సమాజా రుగ్మతులను అధ్యయనం చేసిన గొప్ప సిద్ధాంత వేత్త అని, అందుకే ఈ రాజ్యానికి భయం, రేపటి వెలుగు కోసం, తన జీవితాన్ని కొవ్వొత్తులా కరిగిపోతూ, త్యాగాల ధన్యజీవిగా అమరులైన ప్రొఫెసర్ జిఎన్. సాయిబాబాకి జోహార్లు అర్పించారు.

విప్లవాల ధ్రువతార సాయిబాబా

టేకులపల్లి : పౌరహక్కుల నేత, విప్లవ మేధావి ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం భారత విప్లవోద్య మానికి తీరని లోటని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ అన్నారు. ఆదివారం టేకులపల్లిలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ...ప్రొఫెసర్ సాయిబాబాను మతోన్మాద మోడీ ప్రభుత్వం ఏడు సంవత్సరాలకు పైగా మహారాష్ట్ర జైలులో నిర్బంధించిందన్నారు. సాయిబాబా మృతికి ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూగులోత్ రామచందర్, బానోతు వెంకట్రాం, ఎట్టి నరసింహారావు, ధరావత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ పరిశ్రమ విద్యుత్ కేంద్రంలో అపశ్రుతులు

- విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఒకరికి అస్వస్థత
- భోజనం వడ్డన జాప్యంతో గలాటా

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆయిల్ పాం పరిశ్రమ అనుబంధ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభోత్సవం శనివారం విజయవంతంగా ముగిసినప్పటికీ చిన్న చిన్న అపశృతులు చోటు చేసుకున్నాయి. నిర్ణయించిన సమయానికి మంత్రులు రాకలో జాప్యం జరగడంతో రైతు సదస్సుకు హాజరైన సాగు దారులు ఆకలికి తట్టుకోలేకపోయారు. రైతు సదస్సు ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సి ఉంది. కానీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొంచెం ఆలస్యంగా వచ్చారు. మరి కొంత సేపటికి రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి వచ్చారు. భోజన సమయం తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హాజరు అయ్యారు. ఈ క్రమంలో భోజనం వడ్డనలో తీవ్ర జాప్యం జరగడంతో ఆకలి భరించలేని కొందరు భోజనం వడ్డించాలని గలాటా సృష్టించారు. అప్రమత్తం అయిన సీఐ కరుణాకర్ అక్కడకు చేరుకుని గొడవను సద్దుమణిగించారు. విధులకు హాజరైన పోలీస్ సిబ్బంది ఒకరు ఉదయమే అనారోగ్యంతో అస్వస్థతకు లోనయ్యారు. సీఐ హుటాహుటిన పోలీస్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. తర్వాత కోలుకున్న పోలీస్ కానిస్టేబుల్. ఇవి మినహా విజయవంతంగా ప్రారంభోత్సవం ముగిసింది.



కోదండ రామాలయ కమిటీ ఏకగ్రీవం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని రాజపురం గ్రామంలో గల కోదండ రామాలయం నందు దసర సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మెన్గా చిలుకూరి ఉపెందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ రామిశెట్టి వెంకటేశ్వరావు, సభ్యులుగా కొదుమూరి సత్యనారాయణ, పుచ్చకాయలు వెంకటరెడ్డి, బన్నె కృష్ణయ్య, నల్లమోతు రాములు, గాదె సుధాకర్ రెడ్డి, మదిరాజు వెంకటకృష్ణ, కంటే కృష్ణర్జునరావు, దుబాకుల వెంకటేశ్వర్లు, బండి సత్యనారాయణరెడ్డి, భూక్యా సిద్ధు, భీమిరెడ్డి గోవర్ధన్ శివనాగిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారికి గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇనగంటి ప్రసాద్, లీలాకుమార్ రెడ్డి, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆయుర్వేద మందులు

- 400 మందికి పంపిణీ
- మానవత్వం చాటుకున్న గౌరిశెట్టి శ్రీనివాసరావు, బాబు సేటు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



జ్వరం వచ్చి తగ్గాక వచ్చే కీళ్ల, కాళ్ల, ఒంటి నొప్పులు, వాపులతో తీవ్రంగా బాధపడుతున్న సుమారు 400 మంది బాధితులకు మండల కేంద్రంలోని యూనియన్ (పాత ఆంధ్ర) బ్యాంక్ ఎదురుగా ఆదివారం ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేసి, స్థానిక ప్రముఖ వ్యాపారస్తులు గౌరిశెట్టి శ్రీనివాసరావు, బాబు సేటు (ఎండీ.అబ్దుల్ హకీమ్)లు మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీనివాసరావు తల్లిదండ్రులు జి.నాగభూషణం, భారతిలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు, అధికారులు హాజరయ్యారు. మందుల పంపిణీ నిర్వహణ కమిటీగా స్థానిక రెండు ప్రెస్ క్లబ్ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గత నెలలో తనకు జ్వరం వచ్చి, తగ్గాక తీవ్రంగా నొప్పులు, వాపులతో శారీరకంగా, మానసికంగా వేదనకు గరయ్యానన్నారు. చికిత్స కోసం కొత్తగూడెం, ఖమ్మం పట్టణాలు, హైదరాబాద్ నగరానికి వెళ్లానని, సుమారు రూ.50 వేలకు పైగా ఖర్చు అయ్యాయని, కానీ, నొప్పులు, వాపులు నయం కాలేదన్నారు. చివరగా బంధువులు సూచన మేరకు హైదరాబాద్లో ఓ ఆయుర్వేద వైద్యుడి వద్ద నాలుగు రోజులకు అవసరమైన మందులు తీసుకుని, 5 రోజులు పత్యం చేస్తూ వేసుకున్నానన్నారు. కోర్సు ముగిసే లోపు దాదాపు నొప్పులు, వాపులు మటుమాయం అయ్యాయని తెలిపారు. జ్వరం తగ్గాక నొప్పులు, వాపులతో తను 25 రోజుల పాటు అనుభవించిన మానసిక, శారీరక క్షోభను మండలంలో మరెవరూ పడకూడదని బాధితులకు ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు వెంకట్ రెడ్డి, రాజేశ్వర్రావు, వివిధ పార్టీల నాయకులు ఎండీ.అతహర్, రేసు ఎల్లయ్య, వాసం శ్రీకాంత్, సయ్యద్ హఫీజ్, రెండు ప్రెస్ క్లబ్ సభ్యులు ఎం.డీ.ఫయీమ్, బి.బిక్షం, టి.శ్రావణ్, కె.చంద్రశేఖర్, టి.శేఖర్, కె.వెంకటేశ్వర్లు, ఎస్.యోగేందర్, ఎండీ.ఖలీల్, పి.ప్రభాకర్, జి.నవీన్, కోటేశ్వరరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో ఘనంగా పుణ్యతిథి వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా వారి మందిరంలో విజయదశమి రోజున శ్రీ షిరిడి సాయిబాబా వారి పుణ్యతిది బాబా వారు మహాసమాధి చెందిన రోజు పురస్కరించుకొని ఉదయం బాబా వారికి పాలతో అభిషేకం జరిపారు. నూతన వస్త్రాలు అలంకరించి స్వర్ణాభరణాలు దరింపచేసి హారతి పాడారు. శ్రీ షిరిడి సాయిబాబా వారు విజయదశమి పర్వదినాన సమాధి చెందిన రోజు కావున భద్రాచలం బాబా ఆలయంలో పుష్పాలతో బాబా వారి సమాధి అలంకరణ ఏర్పాటు చేశారు. భక్తులు బాబా వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం చిత్తజల్లు నాగ రమేష్ జ్ఞాపకార్థం వారి కుమార్తెలు అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి చారు గుండ్ల సుబ్రహ్మణ్యం, కోశాధికారి కుంచాల రమేష్, సభ్యులు గొర్ల వెంకటేశ్వరరావు, నాగరాజు, అబ్బినేని శ్రీనివాసరావు, తదితర పాల్గొన్నారు.

పర్ణశాల రామాలయంలో వైభవంగా శమీ పూజలు, రావణ దహనం

నవతెలంగాణ-దుమ్ముగూడెం



భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శనివారం శమీ పూజలు, రావణ దహన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో సంప్రోక్షణ ప్రత్యేక పూజలు అనంతరం సాయంత్రం ఐదు గంటలకు స్వామివారిని గ్రామ పురవీధుల్లో మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా విశ్రాంతి మండపం వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం అర్చక స్వాములు భక్తజన సందోహం మధ్య శమీ పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో రావణ దహన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇంచార్జ్ అనిల్ కుమార్, అర్చక స్వాములు భార్గవచార్యులు, నరసింహచార్యులు, వెంకటాచార్యులతో పాటు ఆలయ సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సాగర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

- సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్

నవతెలంగాణ-బూర్గంపాడు

కానిస్టేబుల్ సాగర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధారావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం సేవాలాల్ సేన మండల అధ్యక్షులు సీతారాం నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. భూక్యా సాగర్ నాయక్ బూర్గంపాడు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కొంతమంది పోలీస్ అధికారులు తనను గంజాయి కేసులో ఇరికించారని, అవమానాల గురి చేశారని మనస్థాపానికి గురై పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, మండల ప్రధాన కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, మండల యువసేన అధ్యక్షులు బానోతు సురేష్ నాయక్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పూర్ణచంద్రారెడ్డి సేవలు అభినందనీయం

అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని

నవతెలంగాణ-ఎర్రుపాలెం

సొంత నిధులతో పుట్టిన ఊరు కోసం యరమల పూర్ణ చంద్రారెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని అన్నారు. భీమవరం గ్రామానికి విచ్చేసిన మల్లు నందినికి కేపిఆర్ హెూమ్స్ అధినేత పూర్ణచంద్రారెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున మేళతాళాలు, గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆమె గ్రామంలోని మహిళలతో కలిసి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బతుకమ్మ ఆటలు ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గ్రామంలోని పేదలకు పూర్ణచంద్రారెడ్డి తన సొంత స్థలాన్ని ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పున 8మంది పేదలకు ఇళ్లస్థలాల పట్టాలను మల్లు నందిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీమవరం గ్రామంలో వర్గ విభేదాలు ఉద్రిక్తతలు ఉంటాయని, అలాంటి గ్రామంలో విజయదశమి రోజు ప్రశాంతంగా గ్రామస్తులందరూ కలసి ఇంత మంచి కార్యక్రమాలను నిర్వహించుకోవడం శుభ పరిణామం అన్నారు. ప్రతి ఒక్కరికి జీవితంలో సొంత ఇంటి కల ఉంటుందని అలాంటి కలను పూర్ణచంద్రారెడ్డి తాను పుట్టిన ఊరిలోని బల హీనవర్గాల పేదవారికి తన సొంత స్థలంలో ఇంటపట్టాలను అందించడమే కాకుండా చుట్టూ ప్రహరీని నిర్మించి, బోరు వేయించి మౌలిక వసతులను అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. భూమి వాటాల విషయంలో, గట్ల వద్ద అన్నదమ్ములు సైతం గొడవపడే ఈ రోజులలో ఇలాంటి వ్యక్తులు ఉండటం అరుదు అన్నారు. ఇళ్ళ పట్టాలు పొందిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని మాట ఇచ్చారు. గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రజానీకం చాలా ఇబ్బందులు పడ్డారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ, మ హిళలకు పెద్దపీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, పావలా వడ్డీ రుణాలతో పాటు భట్టి విక్రమార్క కలల ప్రాజెక్టు ఇందిరా డెయిరీనీ కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి పథకాలతో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ తాను పుట్టిన ఊరు బాగు కోసం రాజకీయాలకు అతీతంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయటం జరుగుతుందన్నారు. పేద ప్రజల అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు, శీలం శ్రీనివాసరెడ్డి, బండారు రామారావు, వేజెండ్ల సాయి, శీలం శారద, శ్రీదేవి, గుర్రాల శ్రీనివాసరెడ్డి, యరమల శ్రీనివాసరెడ్డి, శీలం లిం గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ గడవటం కష్టంగా ఉన్న కొప్పెర ధనమ్మ కుటుంబానికి బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎస్‌కె.గౌసుద్దీన్, నగదుతోపాటు పాటి నిత్యావసర వస్తువులను అందజేశారు. ఆదివారం కారేపల్లి 1వ వార్డులో ఉంటున్న ధనమ్మ ఇంటికి వెళ్ళిన గౌసుద్దీన్ ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధనమ్మకు ఆర్థిసాయం చేసిన గౌసుద్దీన్ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో వార్డు మాజీ స్యులు గంగరబోయిన సత్యనారాయణ, ఖలీలూల్లాఖాన్, పెద్దలు అబ్దుల్ హయత్, బాణాల రాము, గంగరబోయిన లక్ష్మికాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల కాన్వాయికి ప్రమాదం

నవతెలంగాణ-కారేపల్లి

వైరా, ఇల్లందు ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్‌నాయక్, కోరం కనకయ్యల కాన్వాయికి ఆదివారం ప్రమాదం జరిగింది. కోటమైసమ్మతల్లి జాతరకు ఇల్లందు మీదిగా వైరా, ఇల్లందు ఎమ్మెల్యేలు ఇద్దరు కలిసి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కారులో వస్తున్నారు. ఈక్రమంలో ఉసిరికాయలపల్లి సోలార్ ప్లాంట్ మూల మలుపు వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు కనిపించటంతో ఎమ్మెల్యేలు ప్రయాణిస్తున్న కారు స్లో అయింది. వెంటనే వెనకనే ఉన్న కాన్వాయిలోని కార్లు నాల్గు ఒకటి దాని వెనక ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇల్లందు ఎమ్మెల్యే కారు వెనక బంపర్ ఇరిగింది. మిగితా మూడు కార్లు ధ్వంసం అయ్యాయి. ఈప్రమాదంలో ఎవరికి ఏమి గాయాలు కాకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు. ధ్వంసమైన మహేంద్ర కారును క్రేన్ వెహికిల్ ద్వారా ఖమ్మం తరలించారు.

కారేపల్లి సంతలో తేనేటీగల దాడి

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి శ్రీ వేంకటేశ్వర దేవస్థానం వారాంతపు సంతలో ఆదివారం తేనేటీగలు దాడి చేశాయి. సంత జరుగుతుండగా తేనేటీగలు ఒక్కసారిగా జనాల, సంతకు వచ్చిన మేకలు, గొర్రెల మీదకువచ్చి దాడి చేశాయి. ఈ దాడి నండి రక్షించుకోవాటానికి సంతకు వచ్చిన జనాలు, దుకాణాదారులు పరుగులు తీశారు. తేనేటీగలు దాడిలో రెండు మేకలు అక్కడిక్కడే మృతి చెందగా సంతకు వచ్చిన నల్గురు వ్యక్తులకు గాయాలు అయ్యాయి. గాయాలైన వారికి స్థానిక పీహెచ్‌సీ తరలించి చికిత్స నిర్వహించారు. సంతలో ఎవరో ఆకతాయిలు తేనే తుట్టెను కదిపి ఉంటారని భావిస్తున్నారు. గాయపడిన వారిలో తులిశ్యాతండాకు చెందిన వాంకుడోత్ సుక్యా, గుంపెళ్ళగూడెంకు చెందిన దారావత్ లాలు, కారేపల్లికి చెందిన అజ్మీర జూంకీలాల్, ఏన్కూర్ మండలం రాజలింగాలకు చెందిన కొమ్మినేని శ్రీనివాస్ లు ఉన్నారు.



పోరాట పటిమరాలు ఎర్రబెల్లి సీతమ్మ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం గుంపెళ్లగూడెంకు చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎర్రబెల్లి లక్ష్మయ్య మాతృమూర్తి, పార్టీ సానుభూతిపరురాలు ఎర్రబెల్లి సీతమ్మ పోరాట పటిమరాలు అని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, మండల కార్యదర్శి కే.నరేంద్రలు అన్నారు. ఆదివారం సీతమ్మ సంస్మరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ గుంపెళ్ళగూడెం ప్రాంతంలో కూలి పోరాటాలలో సీతమ్మ ముందుండి మహిళలను నడిపించారన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాటాలలోను సీతమ్మ పాత్ర మరవలేనిదన్నారు. సీపీఐ(ఎం) వెంటే ఉంటూ తన కుటుంబాన్ని సైతం ఆ పార్టీ వెన్నంటే ఉండేలా ప్రొత్సహించిన ఉద్యమశీలి అని సీతమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు తుమ్మోజు రామ్మూర్తి, ఎర్రబెల్లి లక్ష్మయ్య, గుర్రం వెంకన్న, ఎర్రబెల్లి సతీష్, బోడమోహన్ కృష్ణ, కళాకారుడు టీ.నాగేందర్ తదితరులు ఉన్నారు

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - బోనకల్

మండల కేంద్రంలో గల మార్కెట్ సబ్ యార్డు నందు సోమవారం ఉదయం 11:30 గంటలకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఐకెపి ఎపిఎం యద్దనపూడి పద్మలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజ లు నిర్వహించిన మల్లునందిని

నవతెలంగాణ - బోనకల్

మండల కేంద్రంలోని గిరిజన కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి పూజ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క ఆదివారం రాత్రి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మ వారికి పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. కోలాట దళ సభ్యులతో కలిసి కొద్దిసేపు కోలాటం వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకుడు బిపి నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు కాంగ్రెస్ రావినూతల గ్రామ అధ్యక్షుడు వట్టికొండ రామకృష్ణ, బోనకల్ మాజీ సర్పంచ్ భూక్యా సైదా నాయక్, గాంధీ పదం మధిర నియోజకవర్గ కన్వీనర్ పాసంగులపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న భట్టి

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో నిర్వహించబడుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు భట్టికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో గల శ్రీ మహాగణపతి, శ్రీ ఆంజనేయ స్వామి, అలివే లు అమ్మ వారి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పాడి పంటలతో రాష్ట్రం విలసిల్లాలని, సుఖ సంతోషాలతో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ వెంకటేశ్వర స్వామి గర్భాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో భట్టికి వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇండ్లకు తక్షణం మరమ్మతులు చేయించండి

- ఎవరికి బడితే వాళ్లకి పనులు అప్పగించొద్దు
- టెండర్ పిలిచి కాంట్రాక్ట్ ఇవ్వండి: ఇది వెంటనే జరగాలి
- సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌కు డిప్యూటీ సీఎం ఆదేశం

నవతెలంగాణ-సత్తుపల్లి



సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ కారణంగా దెబ్బతిన్న ఇండ్లకు తక్షణమే మరమ్మతులు చేయించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌ను ఆదేశించారు. శనివారం సాయంత్రం డిప్యూటీ సీఎం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, సీఎండీ బాలరాం నాయక్, జీఎం షాలేంరాజుతో కలిసి వెంగళరావునగర్‌లో దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి మాట్లాడారు. బాంబుల కారణంగా ఇండ్లు భారీగా దెబ్బతిన్నయన్నారు. వర్షం వచ్చిన సమయాల్లో ఆ ఇండ్లలో ఉండటానికి భయపడే పరిస్థితి ఉందని ప్రత్యక్షంగా చూసిన తరువాత నాకు అర్థంమైందని భట్టి అన్నారు. సంస్థకు చెందిన సీనియర్ అధికారులతో కమిటీ వేయించి ఆ కమిటీ ద్వారా దెబ్బతిన్న ఇండ్లను గుర్తించి మరమ్మతుల అంచనాలను తయారు చేయాలన్నారు. గతంలో ఊరూపేరు లేనివాళ్లకు కాంట్రాక్ట్ ఇచ్చిన క్రమంలో వాళ్ల ఇష్టారాజ్యంగా నాసిరకంగా ఇండ్ల మరమ్మతులు చేపట్టగా అవి చేసినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఇప్పుడలా కాకుండా పారదర్శకంగా టెండర్ పిలిచి గుర్తింపు ఉన్న కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి నాణ్యతతో మరమ్మతులు చేయించాలన్నారు. పనులు ఎవరు చేస్తున్నారు, వారిపేరు, అంచనా వ్యయం ఇతరత్రా సమాచారాన్ని పనుల ప్రదేశాల వద్ద ప్రదర్శించాలన్నారు. పనులు చేపట్టే కాంట్రాక్టర్ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఆయన ఫోన్ నెంబరు కూడా ప్రజలకు తెలిసేలా ప్రదర్శన బోర్డులో ఉండాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. ఇక్కడి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉన్న దృష్ట్యా శుద్ధజల యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో నిర్వహణ కోసం కాంట్రాక్ట్ ఉద్యోగిని ఏర్పాటు చేయాలన్నారు. సింగరేణి సీఎండీ బలరాం నాయక్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు చెప్పిన పనులన్నీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలేంరాజు, జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ తోట సుజలరాణి, ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ నాయకులు శివా వేణుబాబు, ఉడతనేని అప్పారావు, గాదె చెన్నారావు, కమల్‌పాషా, మురళీరెడ్డి, మానుకోట ప్రసాద్, కౌన్సిలర్లు దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి, కంటె నాగలక్ష్మి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

బండి చిన్ననారాయణ, ధనమ్మల జీవితం ఆదర్శం

- పదో వర్ధంతి సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా

నవతెలంగాణ-ముదిగొండ



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి, ప్రజలకు అనేక సేవలందించి, గ్రామ అభివృద్ధికి పాటుపడిన బండి చిన్ననారాయణ, ధనమ్మల జీవితం ఆదర్శమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, తొలితరం కమ్యూనిస్టు యోధులు, అమరులు బండి చిన్ననారాయణ, ధనమ్మల పదోవ వర్ధంతి సభ మండల పరిధిలో చిరుమర్రిలో పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి సామినేని రామారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బండి చిన్న నారాయణ యుక్త వయసులోనే కమ్యూనిస్టు భావజాలాన్ని అలవర్చుకొని ప్రజల కోసం పనిచేశారన్నారు. తొలితరం కమ్యూనిస్టు నాయకుల్లో బండి చిన్ననారాయణ ఒకరన్నారు. తను నమ్మిన సిద్ధాంతం కోసం బండి చిన్న నారాయణ ఏనాడు పదవి ఆశించకుండా తన అనుచరులను గెలిపించి, గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తూ కాలనీని నిర్మించారన్నారు. బండి చిన్ననారాయణ ప్రజా జీవితంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారన్నారు. బండి చిన్న నారాయణ సతీమణి ధనమ్మ భర్త అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచారన్నారు. బండి చిన్ననారాయణ ధనమ్మ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీమని నున్నా నాగేశ్వరరావు చెప్పారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ కుమారులు బండి రమేష్, కోడలు బండి పద్మ, సిపిఐ(ఎం) జిల్లా నాయకులుగా ఎదిగి ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తున్నారన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బండి చిన్న నారాయణ, ధనమ్మల జీవితం ఆదర్శవంతమైందన్నారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి, ప్రజా అభివృద్ధికి కృషి చేశారన్నారు. బండి చిన్ననారాయణ ధనమ్మల వారసులగా వారి మనవరాలు, మనవడు బండి రచన, సందీప్ గ్రామ హైస్కూల్‌కు టీవీ, కంప్యూటర్, బల్లాలు వితరణగా అందజేశారని ఆయన వారి సేవలను కొనియాడారు. కరోనా సమయంలో గ్రామంలో బాధితులకు నెలరోజులపాటు, భోజనాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని పొన్నం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అనంతరం బండి చిన్ననారాయణ, ధనమ్మల చిత్రపటాలకు పుష్పగుచ్ఛాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బండి రమేష్, జిల్లా నాయకులు బండి పద్మ, వాసిరెడ్డి వరప్రసాద్, చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు కోలేటి ఉపేందర్ రావు, కోలేటి అరుణ, మందరపు వెంకన్న రాయల శ్రీనివాసరావు, చాగంటి నారాయణ, సామినేని రాంబాబు, ఉన్నం కోటేశ్వరరావు, చావగాని మాధవరావు, బండి శేఖర్, గ్రామ శాఖల కార్యదర్శులు గండు ఉపేందర్, మోర రామకృష్ణ, ఇనుప ఉపేందర్, బండి చిన్ననారాయణ, ధనమ్మల మనవడు, మనవరాలు బండి సందీప్, బండి రచన, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సామినేని నాగేశ్వరరావు, తెదేపా గ్రామ నాయకులు మండేపూడి నరసింహారావు, బండి చిన్ననారాయణ, ధనమ్మల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వింజరం సర్పంచ్ మృతి

నవతెలంగాణ-అశ్వారావుపేట

ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయిన ప్రమాదం వింజరం సర్పంచ్ మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం గ్రామ సర్పంచ్ జగిడి బాలరాజు(34) అశ్వారావుపేట మండలం నందిపాడు నుంచి తన స్వగ్రామం బర్లమడుగుకు ద్విచక్రవాహనం పై వెళ్తుండగా మార్గ మధ్య లోగల తెలంగాణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం నందిపాడు పంచాయతీ, కుడుములపాడు సమీపంలో కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై యయాతి రాజు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. వైఎస్సార్ సీపీ పార్టీకి చెందిన బాలరాజు మూడు సార్లు సర్పంచ్‌గా గెలుపొందారు. మృతుడికి భార్య పుష్పాంజలి, తల్లిదండ్రులు లక్ష్మయ్య, రామమ్మ ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భార్య కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్వగ్రామం బర్లమడుగు,వింజరం పంచాయతీలో విషాదం నెలకొంది.

సైదులు మృతితో శోకసముద్రంలో మిత్ర బృందం

బోనకల్ : మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు సైదులు (45) మరణించారు. ఆయన మిత్రబృందం నివాళులర్పించారు. సైదులు మృతదేహాన్ని మాజీ జడ్పీటిసి బానోతు కొండ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బానోతు కొండ మాట్లాడుతూ సైదులు అతి చిన్న వయసులోనే మరణించడం చాలా బాధాకరమని, చిన్ననాటి నుంచి నాకు పరిచయస్తుడని, గతంలో సిఐటియులో ఎంతో చురుకుగా పనిచేస్తూ ఎంతో ఉత్సాహంగా ఉండేవాడు అన్నారు. నివాళులర్పించిన వారిలో సైదులు మిత్రబృందం బాధావతు హుస్సేన్, నీలకంఠ రాము, తేలూరి రమేష్, రంగా, జనార్ధన్‌రావు, అంతోటి ఆదినారాయణ, గోంగూర రమేష్, మోదుగుల శ్రీనివాసరావు, నిమ్మ తోట రమేష్, ఆవుల నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

గంజాయి తాగుతున్న యువకులు అరెస్టు

పెనుబల్లి : మండలంలోని వి.ఎం.బంజర్ సాగర కాలవ కట్టపై కొంతమంది యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కొప్పుల శివశంకర్ అలియాస్ శివ, టేకులపల్లి, రంగారావు బంజరకు చెందిన పొదిలి రాజేష్ అలియాస్ రాజు, ముదురుకోళ్ల వీరబాబు, గౌర్రాజు హరికృష్ణ అనువారు గత కొంతకాలంగా గంజాయి తాగడానికి అలవాటు పడి రోజు మాదిరిగానే ఎన్ఎస్పి కెనాల్ కట్టు వద్ద గంజాయి తాగుతున్నారు. వారి వద్ద నుండి సుమారు 170 గ్రాముల గంజాయిని స్వాధీన పరుచుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

విద్యుత్ లైన్‌ల మార్పిడి పట్ల రైతులు హర్షం

నవతెలంగాణ-దమ్మపేట



పామాయిల్ తోటలో విద్యుత్ లైనులు మార్పిడికి రైతులకు వెసులుబాటు కల్పించే విధంగా ఉప ముఖ్యమంత్రి, విద్య శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటన చేయడం పట్ల పామాయిల్ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పామాయిల్ అడ్వైజర్ బోర్డు కమిటీ సభ్యులు పామాయిల్ సంగం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి ప్రసాద్ తెలిపారు. ఆదివారం నాచారంలో జరిగిన సమావేశంలో ఆలపాటి రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ....పామాయిల్ రైతులకు మేలు చేసే విధంగా పామాయిల్ రైతు సదస్సు, రైతులకు, శాస్త్రవేత్తలు, సలహాలు, సూచనలు ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణకు రైతుల కృతజ్ఞతలు తెలిపారు. రైతు సదస్సును విజయవంతం చేసినందుకు రైతులను అభినందించారు. ఈ సమావేశంలో దమ్మపేట సొసైటీ ఛైర్మన్ రాఘవరావు, కొయ్యల అచ్యుతరావు, కెవి సత్యనారాయణ, ఎర్ర వసంతరావు, చీకటి శ్రీనివాసరావు, గూడపాటి వెంకటరావు, ఎర్ర గొర్ల రాజయ్య, నరుకుల భాస్కరరావు, కాసా నాగప్రసాద్, అప్పారావు తదితరులు ఉన్నారు.

మల్లు నందినిని కలిసిన మంగీలాల్ నాయక్

నవతెలంగాణ-జూలూరుపాడు



మధిర క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మెన్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మల్లు నందినిని కాంగ్రెస్ పార్టీ జూలూరుపాడు మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్, ఓ బిసి సెల్ మండల అధ్యక్షులు గోపు రామకృష్ణ, సేవాదళ్ మండల అధ్యక్షులు వాంకుడోత్ కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గ అమ్మవారి విగ్రహాల నిమజ్జనం

నవతెలంగాణ-బోనకల్



మండల వ్యాప్తంగా కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాల నిమజ్జనం శనివారం, ఆదివారం వివిధ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో నవరాత్రి ఉత్సవాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలో లక్ష్మీపురం గ్రామంలోని సత్యసాయి కోలాట బృందంచే మహిళా భక్తుల కోలాటం ప్రజలను విశేషంగా ఆకర్షించాయి. లక్ష్మీపురం గ్రామ రామాలయంలో సత్యసాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అదే గ్రామానికి చెందిన భక్తులు కోలాటంతో అలరించారు. తొమ్మిది రోజులు దేవీ నవరాత్రుల ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించి చివరి రోజున వివిధ గ్రామంలో అమ్మవారి ఊరేగింపును నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను సమీప చెరువులలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాలలోని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లక్ష్మీపురంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మెన్, ధర్మకర్త కిలారి రామకోటేశ్వరరావు, పురోహితుడు మేడేపల్లి రామకోటయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు రామారావు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ గుడ్డురి ఉమ, టిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు బెజవాడ మల్లికార్జునరావు, సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి గుడ్దూరి వెంకట నరసయ్య, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో వివిధ మండపాలలో కొలువై ఉన్న దుర్గాదేవి అమ్మవారి నవరాత్రి సంబరాలు, దసరా సందర్భంగా పాండవులు, ఆయుధాలు విశేష పూజలు జరుపుకొని శనివారం శోభాయాత్ర కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి. పాండవుల వద్ద విశేష పూజలో పాల్గొని ఈ శోభాయాత్ర నిమజ్జన కార్యక్రమాలను పలువురు ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : దసర పండుగ సందర్భంగా మండలంలో పలు చోట్ల బతుకమ్మలను పెట్టి రంగు రంగుల పూలతో బతుకమ్మలను శుక్రవారం సాగనిపంగా పలు గ్రామాల్లో కనదుర్గమ్మ విగ్రహాలను ఏర్పాటు చేసి ఆదివారం ఎంతో ఘనంగ ఊరేగింపు చేశారు. రాజపురం గ్రామంలో మెదర్ బజార్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మను ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి సాంప్రదాయ నృత్యాలతో గ్రామంలో ఊరేగింపు చేసి స్థానక రాముడు చెరువులో పోయి రావమ్మా కనకదుర్గమ్మ అంటూ నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, వెంకటేశ్వర్లు, చెన్నారావు, రావు, లక్ష్మి, త్రివేణి, నందిని, సంధ్య, సోని, వెంకటలక్ష్మి, రేణుక, నాగేశ్వరావు, తరుణ్, లక్ష్మీనారాయణ, నరేష్, పుల్లారావు, మరేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జూలూరుపాడు

ఏన్కూరు మండల కేంద్రానికి చెందిన భూక్యా సాగర్ బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కొంతమంది పోలీస్ అధికారులు తనను గంజాయి కేసులో ఇరికించి అవమానాలకు గురి చేశారని మనస్థాపానికి గురై పురుగుమందు సేవించి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. హైదరాబాద్‌లో ప్రముఖ ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్నాడు. గ్యారెంటీ చెప్పలేము అని వైద్యులు చెబుతున్నారని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. ఆత్మహత్యకు కారకులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం డిమాండ్ చేస్తుంది. ఆత్మహత్యకు కారకులపై వెంటనే పోలీసు ఉన్నంత అధికారులతో సమగ్ర విచారణ జరిపించి కఠినమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి భానోత్ మధు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారులు సరైన పద్ధతిలో స్పందించకపోతే ఆందోళన చేపడుతామని వారు తెలిపారు. సాగర్‌కు ఏమైనా జరిగితే వాంగ్మూలంలో ప్రకటించిన పేర్లు వారే బాధ్యత వహించాలని తెలిపారు.

గౌరారం టోల్ ప్లాజా సిబ్బంది మెరుపు సమ్మె

సమస్యలుపరిష్కరించాలని డిమాండ్

నవతెలంగాణ-పెనుబల్లి

తమ సమస్యలు పరిష్కరించాలని టోల్ ప్లాజా సిబ్బంది శనివారం ఆందోళన చేపట్టారు. పెనుబల్లి మండలం గౌరారం టోల్ ప్లాజాలో పనిచేస్తున్న సిబ్బంది గత పది నెలలుగా జీతాలలో నుండి పిఎఫ్, ఈఎస్ఐలకు తమ అకౌంట్లో నుండి అమౌంట్ కట్ చేసుకుని ప్రభుత్వానికి జమ చేయడం లేదని ఆందోళన చేపట్టారు. టోల్ ప్లాజా యాజమాన్యానికి పలుమార్లు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని సిబ్బంది వాపోయారు. ప్రతి సంవత్సరం బోనస్ ఇస్తామని యాజమాన్యంతో అగ్రిమెంట్ చేసుకున్నామని ఇంతవరకు బోనస్ ప్రకటించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం టోల్ ప్లాజాలోని విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. వాహనాలు హెూల్ ప్లాజా రుసుము చెల్లించకుండానే టోల్ ప్లాజాను దాటి వెళ్లాయి. టోల్ ప్లాజా యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని మేనేజర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కానిస్టేబుల్ సాగర్‌కి న్యాయం చేయాలి

నవతెలంగాణ-బూర్గంపాడు

గతంలో బుర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో పని చేసిన కానిస్టేబుల్ భూక్యా సాగర్ శనివారం ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై విచారణ నిర్వహించి న్యాయం చేయాలని ఆదివాసీ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కనితి కృష్ణ అన్నారు. ఆత్మహత్యకు పాల్పడే ముందు సెల్ఫీ వీడియో ద్వారా విడుదలైన వీడియో అత్యంత దురదృష్ట కరమని ఆయన అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గంపూడి కృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. గిరిజన బిడ్డ అయిన సాగర్‌కు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని అన్నారు. బాధ్యులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లూరు చక్రవర్తి, మహమ్మద్ ఖాన్, బెల్లంకొండ వాసు, కైపు శ్రీనివాసరెడ్డి, ఇంగువ రమేష్, ఎడమ కంటి సుధాకర్‌రెడ్డి, నిమ్మల హరీష్, మంద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యా యత్నం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండల పరిధిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిమిగూడెం గ్రామానికి చెందిన పాయం వెంకన్న, సడలమ్మ దంపతుల పెద్ద కుమారుడు పాయం మనోహర్ హైదరాబాద్‌లోని బస్ ట్రావెల్స్‌లో పని చేస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన క్రమంలో ఆదివారం మధ్యాహ్నం శీతల పానీయంలో పురుగుల మందు కలిపి తాగాడని తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మనోహర్‌ను వెంటనే 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వం వైద్యశాలకు తీసుకువచ్చారు. వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మనోహర్ పరిస్థితి కొంత విషమంగా ఉందని వైద్య సిబ్బంది సూచనాప్రాయంగా తెలిపారు. మనోహర్ బలవన్మరణానికి యత్నించడానికి కారణాలు తెలియాల్సి ఉంది.


అన్నదానం

నవతెలంగాణ-కల్లూరు



పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజున ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కమిటీ సభ్యులు దయాకర్‌రెడ్డి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. మహానదాన కార్యక్రమానికి ప్రకటించిన 30 వేల రూపాయలను కమిటీ సభ్యులకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల ప్రెసిడెంట్ అనుములు శ్రీనివాసరావు, విగ్రహ దాత మోటమర్రి ప్రభాకర్‌రావు, పసుమర్తి చందర్‌రావు, దారా సురేష్, వేణు, గుర్రం గోవర్ధన్, చుండూరు నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం



చిరంజీవి


రామ్‌చరణ్ కోసం..

చిరంజీవి నటిస్తున్న సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వంలో యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి దసరా సందర్భంగా టీజర్‌ని లాంచ్ చేశారు. సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని భారీస్థాయిలో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' రిలీజ్ కోసం ఈ సినిమా విడుదలని వాయిదా వేశారు.

ఈ సందర్భంగా నిర్మాత విక్రమ్ మాట్లాడుతూ,"విశ్వంభర' ఎప్పుడు వస్తే అప్పుడే పండగ. రామ్ చరణ్ కోసం దిల్ రాజు అడగడంతో 'విశ్వంభర' విడుదల వాయిదా వేశాం. సినిమా షూటింగ్ కూడా అనుకున్న ప్రకారమే పూర్తయింది' అని అన్నారు.

'టీజర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. సినిమా ఆల్మోస్ట్ కంప్లీట్ అయిపోయింది. ఒక సాంగ్ బ్యాలెన్స్ ఉంది. అది త్వరలోనే చేస్తాం. చాలా బిగ్ స్కేల్ ఉన్న సినిమా ఇది. చిరంజీవితో వర్క్ చేయడం చాలా ఎగ్జైటింగ్ ఫీలింగ్. ప్రేక్షకులు, అభిమానులు అంచనాలు మించేలా 'విశ్వంభర' ఉంటుంది' అని దర్శకుడు వశిష్ట తెలిపారు.

ఈశ్వర్ రీ-రిలీజ్‌కి రెడీ



ప్రభాస్

హీరో ప్రభాస్ 'ఈశ్వర్' మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రభాస్ బర్త్ డే సందర్భంగా ఈశ్వర్ మూవీని రీ-రిలీజ్ చేయనున్నారు. ఈనెల 23న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. ఈ నేపథ్యంలో మూవీ ట్రైలర్‌ను అదిరిపోయేలా కట్ చేసి రిలీజ్ చేశారు. రీ ఇంట్రడ్యూసింగ్ ప్రభాస్ అంటూ విడుదలైన ఈ ట్రైలర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది.

'నీ చేతిలో డబ్బుంటే.. నా ఛాతిలో దమ్ముంది' అంటూ ప్రభాస్ చెప్పిన మాస్ డైలాగ్స్, యాక్షన్ సీక్వెన్స్, కామెడీ, రొమాంటిక్ సాంగ్స్ ఇలా అన్నింటినీ ట్రైలర్‌లో పొందు పర్చారు. ఈ మూవీని జయంత్ సీ పరాన్జీ తెరకెక్కించారు. కె.అశోక్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని లక్ష్మీ నరసింహా మూవీస్ సంస్థ రీ- రిలీజ్ చేస్తోంది. ప్రస్తుతం ప్రేక్షకులు, ఆయా హీరోల అభిమానులు రీ-రిలీజ్‌లను ఓ పండుగలా సెలెబ్రేట్ చేసుకుంటున్నారు. ఇక ఇప్పుడు ప్రభాస్ బర్త్ డేని కూడా 'ఈశ్వర్' రీ-రిలీజ్‌తో గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేసుకునేందుకు ఆయన ఫ్యాన్స్ రెడీగా ఉన్నారు. అయితే ప్రభాస్‌కి ఇప్పుడు పెరిగిన ఫాలోయింగ్, ఫాలోవర్లకు తగ్గట్టుగా 'ఈశ్వర్'ను భారీ స్థాయిలో రీ-రిలీజ్ చేస్తున్నారు. వింటేజ్ ప్రభాస్ మేనియాను డార్లింగ్ ఫ్యాన్స్ అంతా ఇప్పుడు ఈశ్వర్ 4కే సెలెబ్రేట్ చేసుకోబోతోన్నారు అని లక్ష్మీ నరసింహా మూవీస్ అధినేత తెలిపారు.

వాటికి మించి సీజన్ 4



బాలకృష్ణ మోస్ట్ ఎవైటెడ్ అన్‌స్టాపబుల్ సీజన్ 4ను ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్ శనివారం అనౌన్స్ చేసింది. వ్యాఖ్యాతగా బాలకృష్ణను ప్రజెంట్ చేసే అద్భుతమైన ఫస్ట్‌లుక్, 3డీ యానిమేటెడ్ ప్రోమోని లాంచ్ చేసింది.

అల్లు అరవింద్ (ఆహా డైరెక్టర్), అనిల్ రావిపూడి (డైరెక్టర్), తేజస్విని నందమూరి (అన్‌స్టాపబుల్ క్రియేటివ్ ప్రొడ్యూసర్), అజిత్ ఠాకూర్ (ఆహా డైరెక్టర్), రవికాంత్ సబ్నవిస్ (ఆహా సిఇఓ), రాజీవ్ చిలక (గ్రీన్ గోల్డ్ యానిమేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్) సహా పలువురు ప్రముఖులు ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు.

బాలకృష్ణ మాట్లాడుతూ, 'అన్‌స్టాపబుల్ మొదలవ్వడమే ఒక విస్ఫోటనం. నాన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ఈ ప్రోగ్రామ్ చేశాను. ఈ షో కూడా వేరే ఎవరైనా అడిగి ఉంటే చేసేవాడిని కాదు. కేవలం అరవింద్ కోసమే అంగీకరించా. మా టీమ్ కష్టానికి ఫలితమే అన్‌స్టాపబుల్ సక్సెస్. ఐఎండీబీ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఈ షో 18వ స్థానంలో ఉంది. మన దేశంలోనే రీజినల్ లాంగ్వేజ్‌లో నెంబర్ వన్ షోగా నిలిచింది. ఎంతో మంది హీరోలు, దర్శకులు, ప్రొడ్యూసర్లు మొదటి మూడు సీజన్స్‌కి వచ్చి, వాళ్ళ మనసుల్లో మాటని ఎంతో ఓపెన్‌గా పంచుకున్నారు. ఈ షో విజయంలో వారి పాత్ర కూడా ఉంది. నా చిన్న కూతురు తేజస్విని క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఈ షోలో భాగం కావడం ఆనందంగా ఉంది. 'అన్‌స్టాపబుల్' మూడు సీజన్లు సక్సెస్ అయ్యాయి. అందుకే సీజన్-4 కొత్తగా అందించాలన్న ఉద్దేశంతో యానిమేషన్ రూపంలో ట్రైలర్ తీసుకొచ్చారు. సీజన్ 4 చాలా అద్భుతంగా వస్తుంది' అని అన్నారు.

సర్‌ప్రైజ్ చేసే.. డియర్ కృష్ణ



పీఎన్ బీ సినిమాస్ బ్యానర్ పై తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'డియర్ కృష్ణ'. పీఎన్ బలరామ్ రచయితగా, నిర్మాతగా ఈ సినిమా ద్వారా పరిచయం అవుతున్నారు. ఈ కథకు దినేష్ బాబు డైలాగ్స్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించారు.

అక్షయ్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో 'ప్రేమలు' చిత్ర ఫేమ్ మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఐశ్వర్య కూడా మరో హీరోయిన్‌గా కనిపించనున్నారు.

రియల్ ఇన్సిడెంట్స్‌ను ప్రేరణగా తీసుకొని పీఎన్ బలరామ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రాసుకున్నారు. హృదయాన్ని బరువెక్కించే ఓ విషాద సంఘటన, శ్రీకృష్ణుడిని నమ్మే ఒక భక్తుడు ఆ భారం అంతా ఆయనపై వేశారు. డాక్టర్లు కూడా ఏం చేయలేమన్న పరిస్థితుల్లో ఒక మిరాకిల్ జరిగింది. ఇలాంటి అద్భుతమైన ఇతివృత్తంతో, నమ్మలేని నిజాలు కాదు ఎవరూ ఊహించలేని స్క్రీన్‌ప్లే రాసిన ఆ భగవంతుడు శ్రీ కృష్ణుని దయతోనే ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత పీఎన్ బలరామ్ పేర్కొన్నారు. ఈ చిత్రం ఎంతో మందికి స్ఫూర్తిగా ఉంటుంది అని, అలాగే యూత్‌ను

ఆశ పడితే.. అంతే



విష్ణు వంశీ, రియ కపూర్

శ్రీ కృష్ణ మూవీస్ బ్యానర్ పై కటకం వెంకటేశ్వర్లు సమర్పణలో విష్ణు వంశీ, రియా కపూర్ హీరో, హీరోయిన్లుగా దర్శకుడు ఎంఆర్ దీపక్ రూపొందిస్తున్న సినిమా 'పెన్ డ్రైవ్'.

కె. రామకృష్ణ నిర్మాత. బుజ్జి బొగ్గారపు సహ నిర్మాత. నేటితరం ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా సమకాలీన కథా కథనాలతో తెరకెక్కనున్న ఈ సినిమా ఈ రోజు పలువురు సినీ ప్రముఖుల ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సాయి కుమార్ క్లాప్ నివ్వగా, నిర్మాత టి. రామసత్యనారాయణ ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. మరో నిర్మాత కె రామకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేశారు.

దర్శకుడు ఎంఆర్ దీపక్ మాట్లాడుతూ, 'ఇంటర్నెట్, సోషల్ మీడియాలో ఉచితంగా వచ్చే దేనికీ ఆశపడకూడదు. అలా ఆశపడితే ఇబ్బందులు పడతారనే అంశాన్ని చూపిస్తున్నాం. ఈ నెల 22వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి నాలుగు షెడ్యూల్స్‌లో సినిమా పూర్తి చేస్తాం' అని తెలిపారు. 'మంచికి మాత్రమే టెక్నాలజీని ఉపయోగించాలనే సందేశాన్ని ఈ చిత్రంలో చెబుతున్నాం. మంచి కాన్సెప్ట్‌తో ఉన్న సినిమా' అని నిర్మాత కె రామకృష్ణ అన్నారు.

పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా దో కమీనే

దర్శకుడు వి.సముద్ర వారసులు అరుణ్ మహాశివ, రామ్ త్రివిక్రమ్ హీరోలుగా 'దో కమీనే' సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. హారిక సమర్పణలో చందు క్రియేషన్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ చంద్ర పులుగుజ్జు నిర్మిస్తున్నారు. సముద్ర దర్శకత్వం వహిస్తున్నారు. తస్మయి, శ్రీ రాధ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

ముహూర్తపు సన్నివేశానికి సుమన్ క్లాప్ నివ్వగా, దర్శకులు బి.గోపాల్ ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. హీరో శ్రీకాంత్ స్క్రిప్ట్ అందించారు. నందమూరి మోహనకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ వి.సముద్ర మాట్లాడుతూ, 'పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. 'షోలే', 'ఆర్‌ఆర్‌ఆర్' కలిపితే ఎలా ఉంటుందో అలాంటి సినిమా ఇది. నా మిత్రుడు చంద్ర ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. నవంబర్ 3వ వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. మా మూవీ రిలీజ్ అయ్యాక దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంటుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'మా చంద్ర క్రియేషన్స్ బ్యానర్‌లో ఈ సినిమాను ఘనంగా లాంచ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. సముద్ర దర్శకత్వంలో ఒక మంచి మూవీతో మీ ముందుకు రాబోతున్నాం' అని నిర్మాత చంద్ర పులుగుజ్జు చెప్పారు.



అరుణ్ మహాశివ, తస్మయి, రామ్ త్రివిక్రమ్

హీరోలు రామ్ త్రివిక్రమ్, అరుణ్ మహాశివ మాట్లాడుతూ,'నాన్న దర్శకత్వంలో నటించాలనేది మా డ్రీమ్. ఆ కల ఇంత త్వరగా నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది. అందుకు మా ప్రొడ్యూసర్ చంద్రకి థ్యాంక్స్ చెబుతున్నాం. త్వరలోనే ఒక మంచి చిత్రంతో మీ ముందుకు వస్తాం' అని అన్నారు.

సరికొత్త పాయింట్‌తో.. నా నిరీక్షణ

పికాక్ మూవీ మేకర్స్ బ్యానర్ పై పి.సంతోష్‌రెడ్డి నిర్మాణంలో అమర్ దీప్ హీరోగా, లిషి గణేష్ కల్లపు హీరోయిన్‌గా సాయివర్మ దాట్ల దర్శకత్వంలో రాబోతోన్న చిత్రం 'నా నిరీక్షణ'. దసరా సందర్భంగా ఈ చిత్ర పూజా కార్యక్రమాలు నిర్మాత సురేష్ బాబు ఆశీస్సులతో గ్రాండ్‌గా జరిగాయి.

ముహూర్తపు సన్నివేశానికి దిల్ రాజు క్లాప్ కొట్టగా, రాజా రవీంద్ర స్క్రిప్ట్ అందజేశారు. నిర్మాత గణపతి రెడ్డి కెమెరా స్విచాన్ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ సాయి వర్మ దాట్ల మాట్లాడుతూ, 'సినిమా కథ గురించి ఇప్పుడే చెప్పలేను. అయితే ఓ మంచి చిత్రాన్ని మాత్రం తీస్తున్నానని కచ్చితంగా చెప్పగలను' అని అన్నారు.

'హీరోగా ఇది నా రెండో చిత్రం. బిగ్ బాస్ తరువాత సెలెక్ట్ చేసుకున్న ఫస్ట్ స్క్రిప్ట్ ఇది. నన్ను నమ్మి ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని అమర్ దీప్ చెప్పారు.

లిషి గణేష్ కల్లపు మాట్లాడుతూ, 'ఇది నా రెండో చిత్రం. కథాకథనాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. సరికొత్త పాయింట్‌తో ఈ సినిమా ఉంటుంది. ఈ



సినిమాలో ఓ మంచి పాత్ర చేస్తున్నా. ఇంత మంచి పాత్రను ఇచ్చిన మేకర్స్‌కు ధన్యవాదాలు' అని అన్నారు. అమర్‌దీప్ చౌదరి, చైతన్య వర్మ, లిషి గణేష్ కల్లపు, రమ్య ప్రియ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత : పి.సంతోష్ రెడ్డి, కథ-స్క్రీన్ ప్లే-దర్శకత్వం :సాయి వర్మ దాట్ల, మాటలు : తిరుమలేష్ బండారు, కెమెరామెన్ : వి.రవి కుమార్, సంగీత దర్శకుడు : శేఖర్ చంద్ర.

కుప్పలు తెప్పలు

ఎస్సీ కమిషన్ వద్ద 47 వేల ఫిర్యాదులు

- వేధింపులు, భూ వివాదాలకు సంబంధించినవే అధికం
- సగానికి పైగా యూపీ నుంచే
- ఆరు రాష్ట్రాల్లోనే 81 శాతం నమోదు



(ఫైల్)

న్యూఢిల్లీ : 2020 నుంచి ఇప్పటి వరకూ జాతీయ ఎస్సీ కమిషన్ (ఎన్సీఎస్సీ) వద్ద 47 వేల ఫిర్యాదులు పెండింగులో ఉన్నాయి. 2020-21 లో 11,917, 2021-22లో 13,964, 2022- 23లో 12,402 ఫిర్యాదులు నమోదయ్యాయని, ఈ ఏడాది ఇప్పటి వరకూ 9,550 ఫిర్యాదులు వచ్చాయని ఎన్సీఎస్సీ తెలిపింది. ఆర్టీఐ కింద పీటీఐ వార్తా సంస్థ ఇచ్చిన దరఖాస్తుకు స్పందనగా ఎస్సీ కమిషన్ ఈ వివరాలు అందజేసింది. వేధింపులు, భూ వివాదాలు, ప్రభుత్వ రంగాల్లో సేవలకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు అందాయని ఎన్సీఎస్సీ చైర్‌పర్సన్ కిషోర్ మక్వానా పీటీఐ వార్తా సంస్థకు తెలియజేశారు.

ఫిర్యాదులపై వేగవంతంగా చర్యలు తీసుకోవడానికి వీలుగా వచ్చే నెల నుంచి తాను కానీ లేదా కమిషన్ సభ్యులు కానీ రాష్ట్ర కార్యాలయాలను సందర్శిస్తామని, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తామని మక్వానా చెప్పారు. తాను వారానికి నాలుగు రోజులు విచారణలు నిర్వహిస్తున్నానని, ప్రజలను కలిసి వారి సమస్యలు వింటానని తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి తమ కార్యాలయం తలుపులు ప్రజలకు తెరిచే ఉంచామని చెప్పుకొచ్చారు.

హెల్ప్‌లైన్‌కు లక్షలాది కాల్స్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి అధిక ఫిర్యాదులు అందాయని కమిషన్ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. కమిషన్‌కు ప్రతి రోజూ రెండు మూడు వందలు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిలో చాలా వరకూ రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నామని ఆయన తెలిపారు. ఏ ఒక్క ఫిర్యాదును వదిలేయడం లేదని, అవన్నీ పరిశీలనలోనే ఉన్నాయని అన్నారు. కాగా జాతీయ హెల్ప్‌లైన్ ప్రకారం వేధింపులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీల నుంచి 6,02,177 కాల్స్ వచ్చాయి. వీటిలో 5,843 ఫిర్యాదులు ఉండగా 1,784 పరిష్కారమయ్యాయి. ఉత్తరప్రదేశ్ నుంచే సగానికి పైగా... అంటే 3,10,623 కాల్స్ వచ్చాయి. ఈ హెల్ప్‌లైన్‌ను సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తోంది.

ఆ ఆరు రాష్ట్రాలలోనే ఎక్కువ

ఎస్సీ, ఎస్టీల (వేధింపుల నిరోధక) చట్టం కింద ప్రభుత్వ తాజా నివేదిక ప్రకారం ఎస్సీలపై 13 రాష్ట్రాలలో అత్యధికంగా వేధింపులు జరుగుతున్నాయి. 2022లో వచ్చిన మొత్తం కేసుల్లో ఈ రాష్ట్రాలకు చెందినవే 97.7 శాతం ఉండడం గమనార్హం. ఈ చట్టం కింద 2022లో నమోదైన 51,656 కేసులలో యూపీ నుంచి అత్యధికంగా 12,287 (23.78 శాతం) వచ్చాయి. 8,651 కేసులతో (16.75 శాతం) రాజస్థాన్ రెండో స్థానంలో, 7,732 కేసులతో (14.97 శాతం) మధ్యప్రదేశ్ మూడో స్థానంలో ఉన్నాయి. కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో బీహార్ (6,799-13.16 శాతం), ఒడిషా (3,576-6.93 శాతం), మహారాష్ట్ర (2,706-5.24 శాతం) ఉన్నాయి. మొత్తం కేసుల్లో ఈ ఆరు రాష్ట్రాల్లోనే 81 శాతం నమోదయ్యాయి.

గౌరీ లంకేశ్ హత్య కేసులో...

నిందితులకు హిందూత్వశక్తుల సన్మానం

బెంగళూరు : జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య కేసులో కీలక నిందితులైన పరశురామ్ వాఘ్‌మోర్, మనోహర్ యదావేలను హిందూత్వ శక్తులు బెంగళూరులో సన్మానించాయి. బెంగళూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలైన తర్వాత వారిద్దరినీ శుక్రవారం సన్మానించారు. నిందితులకు ఈ నెల 9న ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇరువురు నిందితులు తమ స్వస్థలమైన విజయపురా చేరుకున్న తర్వాత సంఘ్ పరివార్, శ్రీరామ సేన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఆదివారం వైరల్ అయ్యాయి.

విజయపురా చేరుకున్న తర్వాత నిందితులు కాళీమాత ఆలయంలో ప్రార్థనలు చేశారు. సంఘ్ పరివార్, శ్రీరామ సేన సభ్యులు వారిని పూలమాలలతో సత్కరించారు. నగరంలోని శివాజీ సర్కిల్‌లో ఉన్న శివాజీ విగ్రహానికి కూడా వారు పూలమాలలు వేశారు. బెంగళూరులోని తన నివాసం ఎదుట గౌరీ లంకేష్‌ను దుండగులు 2017 సెప్టెంబర్ ఐదవ తేదీన కాల్చి చంపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 25 మందిని అరెస్ట్ చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకూ 18 మందికి బెయిల్ లభించింది.



(ఫైల్)

గౌరీ లంకేష్ హత్య కేసులో నిందితులను హిందూత్వ సంస్థలు, బీజేపీ మద్దతుదారులు సన్మానించడం ఇది మొదటిసారి కాదు. ఈ సంవత్సరం ఆగస్టులో బీజేపీ మాజీ ఎంపీ ప్రతాప్ సింగ్ నిందితుడైన నవీన్ ఇంటికి వెళ్లి అతనిని సన్మానించారు. లంకేశ్ హంతకులకు బెయిల్ లభించడంతో బీజేపీ నేతలు ఆనందంతో సంబరాలు జరుపుకోవడంపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.

రికార్డుల దసరా

సంజు శాంసన్, సూర్య విశ్వరూపం

- ఉప్పల్‌లో భారత్ రికార్డు స్కోరు
- 3-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్

25 సిక్స్‌లు, 22 ఫోర్లు.. దసరా ధమాకాతో ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. పరుగుల సునామీతో ఉప్పల్ ఓ సంద్రాన్ని తలపించింది. సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్ వీర విహారం చేయటంతో బంగ్లాదేశ్ బౌలర్లు చేతులెత్తేశారు. విధ్వంసక ఇన్నింగ్స్‌లకు సరికొత్త నిర్వచనం ఇస్తున్నట్టు బాదిన సంజు, సూర్య టీ20 ఫార్మాట్‌లో రెండో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా భారత్‌ను నిలిపారు. సంజు శతకం, సూర్య అర్థ సెంచరీతో భారత్ తొలుత 297 పరుగుల ఆల్‌టైమ్ రికార్డు స్కోరు సాధించగా.. ఛేదనలో బంగ్లాదేశ్ 164 పరుగులే చేసింది. మూడు మ్యాచుల టీ20 సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది.

నవతెలంగాణ-హైదరాబాద్

పొట్టి ఫార్మాట్‌లో టీమ్ ఇండియా అదరగొట్టింది. గౌతం గంభీర్, సూర్యకుమార్ యాదవ్ కాంబినేషన్‌లో టీమ్ ఇండియా వరుసగా ఆరు మ్యాచుల్లో విజయాలు సాధించింది. శ్రీలంకపై 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన భారత్.. తాజాగా బంగ్లాదేశ్‌పై సైతం 3-0తో క్లీన్‌స్వీప్ విజయం సాధించింది. వరుసగా మూడో మ్యాచ్‌లో ఏకపక్ష విజయం సాధించిన భారత్.. హైదరాబాద్‌లో రికార్డులను తిరగరాసింది. సంజు శాంసన్ (111, 47 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా.. సూర్యకుమార్ యాదవ్ (75, 35 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో వీర విహారం చేశాడు. రియాన్ పరాగ్ (34, 13 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), హార్దిక్ పాండ్య (47, 18 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. బ్యాటర్ల మెరుపు విన్యాసాలతో భారత్ తొలుత 20 ఓవర్లలో 6 వికెట్లకు 297 పరుగుల రికార్డు స్కోరు చేసింది. ఛేదనలో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 164 పరుగులే చేసింది. తౌహిద్ హృదయ్ (63, 42 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), లిటన్ దాస్ (42, 25 బంతుల్లో 8 ఫోర్లు) రాణించారు. స్పిన్నర్ రవి బిష్ణోయ్ (3/30), మయాంక్ యాదవ్ (2/32) బంతితో మెరిశారు. 133 పరుగుల తేడాతో మూడో టీ20లో విజయం సాధించిన టీమ్ ఇండియా.. 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. శతక వీరుడు సంజు శాంసన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. ఆల్‌రౌండ్ షోతో హార్దిక్ పాండ్య 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.

సంజు శతక విహారం

టాస్ నెగ్గిన తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్ అభిషేక్ శర్మ (4) వికెట్‌ను ఆరంభంలోనే కోల్పోయింది. కానీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (75) జతగా సంజు శాంసన్ (111) విశ్వరూపం చూపించాడు. 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 22 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన సంజు.. ఆ తర్వాత వాయువేగంతో పరుగులు పిండుకున్నాడు. ఇన్నింగ్స్ 9వ ఓవర్లో రిషన్ హుస్సేన్‌పై సంజు సిక్సర్ల సునామీ సృష్టించాడు. తొలి బంతికి పరుగు చేయని సంజు.. ఆ తర్వాత వరుసగా ఐదు బంతుల్లో ఐదు సిక్సర్లు కొట్టాడు. ఈ ఓవర్లో 30 పరుగులు పిండుకున్న సంజు..40 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. మరో ఎండ్‌లో సూర్యకుమార్ యాదవ్ 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఈ ఇద్దరికి తోడు రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్య సైతం దంచికొట్టడంతో భారత్ 297 పరుగుల రికార్డు స్కోరు చేసింది. బౌండరీల రూపంలోనే భారత్ 232 పరుగులు పిండుకుని సరికొత్త రికార్డును నమోదు చేసింది.

బంగ్లా చతికిల

రికార్డు ఛేదనలో బంగ్లాదేశ్ చతికిల పడింది. భారత బౌలర్లు సమిష్టిగా రాణించటంతో బంగ్లా బ్యాటర్లు తేలిపోయారు. పర్వేజ్ హుస్సేన్ (0) డకౌట్ కాగా.. హసన్ (15), నజ్ముల్ (14)లు ఆరంభంలోనే నిష్క్రమించారు. లిటన్ దాస్ (42, 25 బంతుల్లో 8 ఫోర్లు), తౌహిద్ హృదయ్ (63, 42 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో బంగ్లాదేశ్‌కు గౌరవప్రద స్కోరు అందించాడు. గమ్యం లేని ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు కోల్పోయిన బంగ్లాదేశ్ 164 పరుగులు చేసింది. మయాంక్ యాద్ రెండు వికెట్లు పడగొట్టగా..రవి బిష్ణోయ్ 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్ : సంజు (సి) మెహిది (బి) ముస్తాఫిజుర్ 111, అభిషేక్ (సి) మెహిది (బి) హసన్ షకిబ్ 4, సూర్య (సి) రిషద్ (బి) మహ్మదుల్లా 75, రియాన్ పరాగ్ (సి) దాస్ (బి) టస్కిన్ 34, హార్దిక్ పాండ్య (సి) రిషద్ (బి) హసన్ షకిబ్ 47, రింకూ సింగ్ నాటౌట్ 8, నితీశ్ (సి) మెహిది (బి) హసన్ షకిబ్ 0, వాషింగ్టన్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 17, మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 297.

వికెట్ల పతనం : 1-23, 2-196, 3-206, 4-276, 5-289, 6-289.

బౌలింగ్ : మెహిది హసన్ 4-0-45-0, టస్కిన్ 4-0-51-1, హసన్ షకిబ్ 4-0-66-3, ముస్తాఫిజుర్ 4-0-52-1, రిషద్ 2-0-46-0, మహ్మదుల్లా 2-0-26-1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ : పర్వేజ్ (సి) పరాగ్ (బి) మయాంక్ 0, హసన్ (సి) వరుణ్ (బి) వాషింగ్టన్ 15, నజ్ముల్ (సి) సంజు (బి) బిష్ణోయ్ 14, దాస్ (సి) తిలక్ (బి) బిష్ణోయ్ 42, హృదయ్ నాటౌట్ 63, మహ్మదుల్లా (సి) పరాగ్ (బి) మయాంక్ 8, మెహిది హసన్ (సి) పరాగ్ (బి) నితీశ్ 3, రిషద్ (సి) అభిషేక్ (బి) బిష్ణోయ్ 0, హసన్ షకిబ్ నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు : 11, మొత్తం : (20 ఓవర్లలో 7 వికెట్లకు) 164.

వికెట్ల పతనం : 1-0, 2-35, 3-59, 4-112, 5-130, 6-138, 7-139.

బౌలింగ్ : మయాంక్ 4-0-32-2, హార్దిక్ 3-0-32-0, వాషింగ్టన్ 1-0-4-1, నితీశ్ 3-0-31-1, రవి 4-1-30-3, వరుణ్ 4-0-23-0, అభిషేక్ 1-0-8-0.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886